అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 184 | మంగళవారం | 03 -06-2025 | కరీంనగర్   Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఐపిఎల్ ఫైనల్ నేడే



గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు తలపడనున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు



### పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను

# చక్కదిద్దుతున్నాం...

- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ రూపొందించాం
- పెట్టుబడులు, పర్యాటకానికి రాష్ట్రంలోని అనుకూలతలను ప్రపంచానికి చూపించాం
- హైదరాబాద్ పెట్టుబడులకు కేరాఫ్‌గా మారింది
- తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు మహిళలే
- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- భూ వివాదాలు లేకుండా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం
- తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంతో పోటీ పడేలా 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్ రూపొందించామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. 2047 నాటికి తెలంగాణను గొప్ప అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉందన్నారు. తెలంగాణకే ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రపంచానికి చూపించామని వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రావతరణ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. అవతరణ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జపాన్‌లోని కితాక్యూషూ సిటీ మేయర్ టేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందని, అప్పటివరకు త్రీ ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. పెట్టుబడులు, పర్యాటకానికి తెలంగాణలో ఉన్న అనుకూలతలను ప్రపంచానికి చూపించామన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడంతో పాటు పెట్టుబడులు రాబట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయని, దీంతో హైదరాబాద్ పెట్టుబడులకు కేరాఫ్‌గా మారిందన్నారు. దశాబ్దాల పోరాటంతో తెలంగాణను సాధించుకున్నామని, సకల జనుల ఆకాంక్షలు నెరవేరిన రోజన్నారు. కట్టుబానిసత్వాన్ని, వెట్టిచాకిరీని తెలంగాణ తరువాయి 2లో





### త్యాగాలతో రాష్ట్రం సాధించుకున్నా

# ఆకాంక్షలు నెరవేరలే

- సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, అజీజ్ పాషా ఆవేదన
- కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి మాట నిలబెట్టుకోవాలని సూచన
- మగ్దూంభవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రజలు తమ అసాధారణ పోరాటాలు, అనేక త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పటికీ పదేళ్ల కాలంలో వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను నేరవేర్చుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వాటిని పూర్తి చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ జాతీయ జెండాను ఎగురవేయగా, సయ్యద్ అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహా, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎన్.జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.అంజయ్యనాయక్, కెవిఎల్, తరువాయి 2లో

# 5వ తేదీన రాలేను

- కాళేశ్వరం విచారణ కమిషన్‌ను మరో గడువు కోరిన మాజీ సిఎం కెసిఆర్
- 11వ తేదీకి విచారణ వాయిదా



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్'కు అత్యంత ఉత్కంఠ నెలకొన్నది. ఈ నెల 5వ తేదీన విచారణకు హాజరు కావాల్సిన బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు గడువు కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు విచారణను ఈ నెల 11వ తేదీకి కమిషన్ వాయిదా వేసింది. కాళేశ్వరం విచారణ విషయంలో కెసిఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని కొందరు, తర్జన భర్జన పడుతున్నారని మరికొందరు ఇలా రకరకాల చర్చ జరుగుతోంది. తొలుత ఈ నెల 5న జరిగే విచారణకు కెసిఆర్ హాజరవుతారని, అంతకుముందు కాళేశ్వరంపై బిఆర్‌ఎస్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేసే అవకాశాలు ఉంటాయని ప్రచారం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మాజీ తరువాయి 2లో

# ప్రజల వద్దకే 'రెవెన్యూ'


- నేటి నుంచి 20వ తేదీ వరకు అన్ని మండలాల్లో సదస్సులు
- తహసీల్దార్‌తో కూడిన బృందం భూ సమస్యలు పరిష్కరిస్తుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం తమ స్వార్థం కోసం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపర్చిన విధానాలతో జరిగిన తప్పులను సరిచేసి, మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసి, భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామని తెలిపారు. 'ప్రజల వద్దకే రెవెన్యూ' అనే నినాదంతో రెవెన్యూ సదస్సులకు తహశీల్దార్‌తో కూడిన బృందం వెళ్లి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తుందని అన్నారు. 'రెవెన్యూ సదస్సు'ల అంశంపైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తరువాయి 12లో..





# ప్రపంచం
WORLD NEWS

## కాంట్రాక్టు ప్రాతిపదికపై విదేశాలకు ఘనా యువ కార్మికులు

**అక్రా:** ఘనదేశ యువకులను ఫిక్సెడ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికపై విదేశాలకు పంపుతామని ఆ దేశ అధ్యక్షుడు జాన్ ద్రమణి మహమ ప్రకటించారు. ఘనా దేశం విదేశాలకు బంగారం, కోకా, ముడి చమురు, పామాయిల్, కసావా, మామిడిపండ్లు, అరటిపండ్లను ఎగుమతి చేస్తుందని, ఇకమీదట ఘనలో మధ్యతరగతి పేదరికాన్ని నిర్మూలించేందుకు ఘనా యువకులను కూడా విదేశాలకు ఫిక్సెడ్ కాంట్రాక్టు ప్రాతిపదికపై పంపుతామని మహమా ప్రటించారు. ఐతే ఘనా దేశ యువకులు ఎప్పటికీ అమ్మకానికి సిద్ధంగా లేరని కూడా ఆయన అదేసమయంలో చెప్పారు. వందల సంవత్సరాలుగా ఘనదేశ యువకులు అమెరికా సహా ఇరత దేశాలకు కార్మికులుగా, పనిమనుషులుగా అమ్ముడుపోతూ వస్తున్నారు. విదేశాలలో పనులకు వారిని గతకాలంలో మధ్యవర్తులు అమ్మకానికి పెట్టేవారు. అందుకు విరుద్ధంగా చట్టపరిధిలో 2000 మంది ఘనా యువకుల కార్మికశక్తిని ఫిక్సెడ్ లేబర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికపై విదేశాలకు పంపనున్నారు. దీనివల్ల ఘనాలో కుటుంబాలు, ప్రభుత్వం కూడా ఆర్థికలబ్ధి పొందుతాయని మహమా అన్నారు.



## పోలెండ్ అధ్యక్ష ఎన్నికల్లో..
# ట్రంప్ మద్దతిచ్చిన నవ్రోకి గెలుపు

**వార్సా :** పోలెండ్ అధ్యక్ష ఎన్నికలలో జాతీయవాది, చరిత్రకారుడు, డోనాల్డ్ ట్రంప్ మద్దతుగల అభ్యర్థి కరోల్ నవ్రోకీ (42) విజయం సాధించారు. ఆయన ఐదు సంవత్సరాలు అధ్యక్ష పదవిలో ఉంటారు. దీంతో పోలెండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్ ప్రభుత్వానికి గడ్డురోజులు మొదలయ్యాయి. నవ్రోకీ మొదటి నుండీ ట్రంప్ తరహా ఆలోచనా ధోరణులనే ప్రతిబింబిస్తున్నారు. సెక్యులర్ ఆలోచనలకు వ్యతిరేకంగా ఉండే నవ్రోకీ పాలనలో ఇక పోలెండ్ దేశం మరింత జాతీయవాద దృక్పథంతో ముందుకు వెళుతుందని అంచనావేస్తున్నారు. నవ్రోకీ పోలెండ్ దేశాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టాలని తాను మొదటినుండీ కోరుకున్నానని ట్రంప్ అన్నారు. పోలెండ్‌లో 10వేల మంది అమెరికా సైనికులు ప్రస్తుతం తిష్ఠవేసుకుని ఉన్నారు. ఇక పోలెండ్‌తో అమెరికా సైనిక సంబంధాలు మరింత పటిష్టమవుతాయి. ఐతే ప్రస్తుతం ప్రధాన మంత్రి బాధ్యతల్లో ఉన్న డోనాల్డ్ టస్క్ కూటమి ప్రభుత్వం కలలు భగ్నమయ్యాయి. ఆయన అభ్యర్థి ఆండ్రెజ్ దుడా ఓటమిపాలయ్యారు. ఆయన స్థానంలో నవ్రోకీ అధ్యక్ష బాధ్యతలు తీసుకుంటారు. తమ అభ్యర్థి గెలిస్తే సంస్కరణలను, ఎన్నికల వాగ్దానాలను ముందుకు తీసుకువెళ్ళాలని డోనాల్డ్ టస్క్ భావించారు. కానీ ఇక మళ్ళీ 2027లో పార్లమెంటుఎన్నికల్లో గెలిచేవరకూ టస్క్ వాగ్దానాలు అమలయ్యే అవకాశాలు లేవు. 2015 నుండి 2023 వరకూ పోలెండ్‌ను పాలించిన జస్టిస్‌పార్టీ డోనాల్డ్ టస్క్ నాయకత్వానగల కూటమి ధాటికి తట్టుకోలేక 2023 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు జస్టిస్ పార్టీ అభ్యర్థి నవ్రోకీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు. పలు యూరప్ దేశాల నాయకులు నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. పోలెండ్‌లో యూరప్ అనుకూల అభ్యర్థి ట్రజాస్కోవ్‌స్కీ గెలుస్తారని అందరూ ఆశించారు. యూరప్ భద్రత పోలెండ్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. నవ్రోకీ విజయం సాధించడంతో పరిస్థితుల్లో గణనీయంగా మార్పులు వచ్చే అవకాశం ఉంది. రెండో విడత ఆదివారంనాడు జరిగిన రన్నాఫ్ పోలింగ్‌లో వార్సా మేయర్, యూరోపియన్ యూనియన్ అనుకూల లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి రఫాల్ ట్రజాస్కోవ్‌స్కీ (53), లా అండ్ జస్టిస్‌పార్టీకి చెందిన అభ్యర్థి, చరిత్రకారుడు కరోల నవ్రోకీ ఇద్దరూ అధ్యక్ష పదవికోసం ప్రధానంగా పోరాడారు. నువ్వా–నేనా అనే రీతిలో జరిగిన హోరాహోరీ రన్నాఫ్ బ్యాలట్ పోరాటంలో నవ్రోకీకి 50.89 శాతం ఓట్లు లభించాయి. ట్రజాస్కోవ్‌స్కీకి 49.11 శాతం ఓట్లు లభించాయి. అమెరికాతోపాటు యూరప్ దేశాలలో ఉన్న సంప్రదాయవాదులు నవ్రోకీ విజయంపట్ల ఎంతో హర్షం ప్రకటించారు. మొదటి రౌండ్ ఎన్నికల నుండి చివరివరకూ అధ్యక్ష అభ్యర్థుల మధ్య పోటీ ఉత్కంఠతో సాగింది. రన్నాఫ్ పోలింగ్ ప్రారంభం కావడానికి ముందుగా వెల్లడైన ముందస్తు సర్వే నివేదికలలో ట్రజాస్కోవ్‌స్కీ విజయం సాధిస్తారని ఫలితాలు వెల్లడైనప్పటికీ నిజమైన ఫలితాల్లో మాత్రం పరిస్థితి తలక్రిందులైపోయింది. నవ్రోకీ విజయం సాధించారు. దీంతో ట్రజాస్కోవస్కీ ఓటమిని అంగీకరించి నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతోపాటు జర్మనీ, హంగేరీ దేశాల నాయకులు నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. యూరప్ దేశాల నుండి ఉక్రేన్‌కు ఆయుధాల సరఫరాలో పోలెండ్ దేశమే ఇప్పటివరకూ కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. ఇక ఇప్పుడు ట్రంప్ ప్రభావంతో పోలెండ్ ఎలాంటి పాత్ర నిర్వహిస్తుందనే విషయం ముందు ముందు వెల్లడికానున్నది. ఐతే ఎన్నిక ప్రరాచార సందర్భంగా నవ్రోకీ ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాను వ్యతిరేకించారు. జెలెన్స్కీ తన అభినందన సందేశంలో యూరప్ భద్రత విషయంలో పోలెండ్ దేశం కీలకపాత్ర వహిస్తోందని అన్నారు. పోలెండ్‌తో వ్యక్తిగతంగా నవ్రోకీతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. హంగేరీ ప్రధానమంత్రి విక్టర్ ఓర్బన్ అభినందనలు తెలియజేస్తూ నవ్రోకీ అద్భుత విజయం సాధించారన్నారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ అభినందనలు తెలియజేశారు.ప్రజాస్వామ్య విలువలను యూరోపియన్ యూనియన్–పోలెండ్ దీర్ఘకాలంగా పంచుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు. యూరప్ భద్రతకోసం కలిసి పనిచేద్దామని అన్నారు.

## నేడు దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికలు




**సియోల్ :** దక్షిణకొరియాలో మంగళవారంనాడు అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. గడచిన మూడు రోజులుగా ముందస్తు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజే పలువురు అధ్యక్ష అభ్యర్థులు తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. దక్షిణ కొరియా ప్రతిపక్షం డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి లీ జే మ్యుంగ్, అధికార పీపుల్స్ పవర్‌పార్టీ అభ్యర్థి కిమ్ మూన్ సూ మధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. నాలుగున్నరకోట్లకుపైగా ఉన్న అర్హులైన ఓటర్లు పోలింగ్‌లో పాల్గొంటారు. ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, ఉత్తర కొరియాతో చేతులు కలుపుతున్నాయని ఆరోపిస్తూ గత ఏడాది డిసెంబరు మూడో తేదీన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో మార్షల్ లా విధించారు. ఎదురైన ఒత్తిడిని భరించలేక ఆరు గంటల వ్యవధిలోనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని దేశద్రోహిగా ముద్రవేసుకున్నారు. పార్లమెంటు ఆయనపై మహాభియోగ తీర్మానం చేసి పదవీచ్యుతుణ్ణి చేసింది. తర్వాత ఆయన జైలుపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనకు బదులుగా అధికార పీపుల్స్ పవర్‌పార్టీ తరపున కిమ్ మూన్ పోటీలో ఉన్నారు.

# తిరుగుబాట్లు అణచివేస్తా : సూడాన్ భద్రతే లక్ష్యం

## కొత్త ప్రధానమంత్రి ఇద్రిస్ ప్రకటన

**కార్టూమ్:**ఆఫ్రికా ఈశాన్యప్రాంతదేశం సూడాన్ ప్రధానమంత్రి కామిల్ ఎల్టయెబ్ ఇద్రిస్ ఇప్పటివరకూ ఉన్న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఆయన రద్దుచేశారు. మంత్రివర్గాన్ని రద్దుచేస్తున్నట్లు ఆయన ప్రకటిస్తూ, కొత్త మంత్రివర్గం ఏర్పడేవరకూ ప్రభుత్వ మంత్రిత్వశాఖలో ఉన్న కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు సంంధిత శాఖల వ్యవహారాలు ఆగిపోకుండా కొనసాగించాలని ఆదేశించారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి జాతిని ఉద్దేశించి సోమవారంనాడు ఆయన ప్రసంగిస్తూ, సూడాన్ జాతీయ భద్రతతే తన ప్రథమ కర్తవ్యమని చెప్పారు. దేశంలో సాయుధ తిరుగుబాటుదారులను, తిరుగుబాటు గ్రూపులను అణచివేస్తామని, వాటిని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్) పారామిలిటరీ సాయుధ బలగాలు సూడాన్ ప్రభుత్వాధికారాన్ని స్వాధీనం చేసుకోవడంకోసం 2023 ఏప్రిల్ 15వ తేదీ నుండి ప్రభుత్వ సైనిక దళాలలతో పోరాటం కొనసాగిస్తున్నాయి. అప్పటినుండీ సూడాన్‌లో మానవతా సంక్షోభం నెలకున్నది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం దాదాపు 20,000 మంది ప్రజలు అంతర్యుద్ధంలో మరణించారు. మరో కోటీ 50 లక్షలమంది ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. సూడాన్‌ను దీర్ఘకాలంగా పరిపాలించిన ఆ దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషర్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. తర్వాత సైనిక కుట్ర కారణంగా 2019లో ఆయన పదవీచ్యుతుడయ్యారు. అప్పటినుండి దేశంలో అంతర్గత కల్లోలం ప్రారంభమైంది. సూడాన్ 16వ ప్రధానమంత్రిగా మే 19వ తేదీన బాధ్యతలు చేపట్టారు.80 ఏళ్ళు వయసుగల ఇద్రిస్ రాజనీతిజ్ఞుడు, ఎంతో అనుభవజ్ఞుడు. అంతర్జాతీయ సివిల్ సర్వెంట్‌గా కూడా పనిచేశారు. వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్‌కు పదకొండు సంవత్సరాలపాటు (1997–2008) ఆయన డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. 2010లో ఆయన రాజకీయాల్లో చేరి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. ఆనాటి దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషర్‌ను ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి సవాలు చేసి పోలింగ్‌లో ఆరోస్థానంలో నిలిచారు. అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ బుర్హాన్ సారథ్యంలోని ట్రాన్సిషనల్ సావరిన్ కౌన్సిల్ గతనెలలో పౌరయుద్ధ సమయంలో ఇద్రిస్‌ను ప్రధానమంత్రిగా నియమించింది.

# నైజీరియాలో భూమి కోసం ఘర్షణలు

### గన్‌మెన్ కాల్పుల్లో 25 మంది మృతి

**జోస్ :** సెంట్రల్ నైజీరియాలో వేరేవేరుచోట్ల సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో 25 మంది మరణించారు. నార్త్–సెంట్రల్ బెన్యూ రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోగన్‌మెన్ కాల్పులు జరిపారు. స్థానికంగా స్థిరపడిన వ్యవసాయదారులకు, ముస్లిం ఫలూనా తెగకు మధ్య భూసంబంధమైన ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగానే ఈ కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. భూములు సొంతం చేసుకుని స్థిరపడిన రైతులలో ఎక్కువమంది క్రైస్తవ మతానికి చెందినవారు. గడచిన రెండు సంవత్సరాలుగా బెన్యూ రాష్ట్రంలో రైతు భూములకోసం జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకూ 6,896 మంది మరణించినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక తెలిపింది. బెన్యూరాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు అధికంగా ఉన్నారు. అంకపాలి కమ్యూనిటీకి చెందిన 14 మంది ఆదివారం జరిగిన కాల్పుల్లో మరణించారు. తాజా కాల్పుల్లో మరో 11 మంది మరణించారు.

# ఇజ్రాయెల్ అనుకూల ప్రదర్శనపై 'ఉగ్ర' దాడి

**బౌల్డర్:** గాజాలో ఉన్న బందీలను విడుదల చేయాలని కోరుతూ అమెరికా కొలరాడోలో సోమవారంనాడు జరిగిన ఇజ్రాయెల్ అనుకూల ప్రదర్శనపై కొంతమంది దాడి చేశారు. ఈ దాడిలో 50 నుండి 88 ఏళ్ళు వయసుగల ఎనిమిదిమంది ప్రదర్శకులు గాయపడ్డారు. ఈ ఘటనను ఎఫ్‌బిఐ తీవ్రంగా పరిగణించింది. దీనిని ఉగ్రవాద చర్యగా భావించి దర్యాప్తు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌కు అనుకూలంగా జరుగుతున్న ప్రదర్శనపై చేసిన దాడిని బెంజిమన్ నేతన్యాహూ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. డెన్వర్‌కు 48 కి.మీ దూరంలో ఉన్న కొలరాడో పెరల్‌స్ట్రీట్‌లో ఉన్న ప్రజాదరణ పొందిన బౌల్డర్ బహిరంగ ప్రదేశంలో జరుగుతున్న ప్రదర్శనపై దాడి జరిగింది. చొక్కాలేకుండా వచ్చిన ఒక వ్యక్తి ప్రదర్శనలో జొరబడి 'పాలస్తినాకు విముక్తి ప్రసాదించాలి'' అంటూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. అదే సమయంలో ప్రదర్శనపై దాడి జరిగింది. దాడి సమయంలో ఆ ప్రాంతంలో దట్టడంగా పొగ కమ్ముకుంది. ఎవరెక్కడున్నారో తెలియని పరిస్థితి రావడంతో ప్రదర్శకులు ఏమీ అర్థంకాక తలో దిక్కువైపూ పరుగులు తీశారు.

## రెండురోజులు తేలికపాటి వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, హమూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయా జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# 5వ తేదీన రాలేను

(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేస్తారని అధికారికంగా బిఆర్‌ఎస్ ప్రకటించింది. కానీ ఈ కార్యక్రమాన్ని అర్థంతరంగానే వాయిదా వేసుకున్నది. ఇందుకు సరైన కారణాలు కూడా స్పష్టం చేయక పోవడంపై రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాళేశ్వరం విచారణకు ఈనెల 6న బిఆర్‌ఎస్ ఎంపి, బిఆర్‌ఎస్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్, 9న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విచారణకు హాజరు కావాల్సి ఉన్నది.

### చిక్కుల్లో పడకుండా జాగ్రత్తలు...

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో వస్తున్న ఆరోపణలకు ధీటుగా సమాధానం చెబుతూనే చిక్కుల్లో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కెసిఆర్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో ఇప్పటికే జస్టిస్ పి.సిఘోష్ కమిషన్' తన విచారణ ప్రక్రియను దాదాపుగా ముగించింది. కాళేశ్వరం నిర్మాణం జరుగుతున్న సమయంలో బాధ్యులైన అప్పటి సిఎం, మంత్రులు మినహా అధికార యంత్రాంగం, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు, పలువురు నీటి పారుదల నిపుణులు తదితరులను విచారించి, వారి వాంగ్మూలాన్ని కూడా రికార్డ్ చేసింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు పత్రాలను,రికార్డులను సేకరించింది. వాటి ఆధారంగానే ప్రస్తుతం కమిషన్ విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కమిషన్ విచారణ సమయంలో ఎటువంటి సమాధానాలు చెప్పాలనే విషయమై ఇదివరకే కెసిఆర్ ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం. పైగా విచారణ కమిషన్ అధికారాలు, ఒక వేళ కమిషన్ ముందు హాజరుకాకపోతే వచ్చే సమస్యలు, హాజరవుతే, విచారణ సమయంలో చెప్పాల్సిన సమాధానాలు ఇలా పలు అంశాలపైన కెసిఆర్ ఇప్పటికే పలువురు న్యాయ, నీటిపారుదల నిపుణుల సలహాలు, సూచనలు, అభిప్రాయాలను కూడా తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. కమిషన్ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా ఒక వేళ ప్రభుత్వం ఏదైనా చర్యలకు పాల్పడితే, వాటిని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా ముందస్తుగానే

### 9న 'హరీశ్ విచారణ'పై దృష్టి ...

'కాళేశ్వరం విచారణ'కు ముందుగా హరీశ్‌రావును పంపిస్తే కమిషన్ విచారణ శైలి, సంధించిన ప్రశ్నలు, వారి వద్ద ఉన్న ఆధారాలు, తదితర అంశాలు తెలుస్తాయని, తద్వారా తగిన సమాధానాలు, ఆధారాలను కమిషన్ ముందు పెట్టేందుకు వీలవుతుందని కెసిఆర్ బావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో నిర్మించిన పలు ప్రాజెక్ట్‌లు, నిర్మాణ దశలో, ఆ తర్వాత అవి కూలిపోతే,లేదా ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలపైన కూడా బిఆర్‌ఎస్ ఆరా తీసినట్టు తెలిసింది. ప్రాజెక్ట్‌ల విపత్తుల గురైతే, ఆ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఉన్న బాధ్యులైన పాలకులపైన కేసులు నమోదయ్యాయా?, ఇంతకు వారి బాధ్యత ఉంటుందా?, లేదా కేవలం అధికారులు, నిర్మాణ సంస్థనే బాధ్యత వహిస్తుందా? అనే కోణంలో కూడా కెసిఆర్ ఆరా తీసినట్టు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

## ఆకాంక్షలు నెరవేరలే

(మొదటి పేజీ తరువాయి)

ఎం.నర్సింహా, కె.కాంతయ్య, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, బొమ్మగాని నాగభూషణం, సబ్బు రాజమౌళి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ పలు గీతాలను ఆలపించారు.

**మాజీ సిఎం కెసిఆర్ నియంత పాలనతో తన కీర్తిని తానే పోగొట్టుకున్నారు : డాక్టర్ నారాయణ**

తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ ప్రజలు ఏ ఉద్దేశంతో అయితే కెసిఆర్‌కు అధికారం అప్పగించారో దానిని పూర్తి చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని డాక్టర్ నారాయణ విమర్శించారు. పదేళ్ల పాటు ఆయన ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తిగా అప్రజాస్వామిక పద్ధతుల్లో నియంతృత్వ పాలన కొనసాగించారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఫామ్‌హౌజ్‌కే పరిమితమై ప్రభుత్వాన్ని, పార్టీని నడిపిన ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రమేనన్నారు. ఫలితంగా ఆయన సాధించుకున్న కీర్తిని ఆయనే పోగొట్టుకున్నారన్నారు. కెసిఆర్ నియంత ధోరణే చివరికి వారి కుటుంబంలో కల్లోలం లేపేందుకు కారణమైందన్నారు. కెసిఆర్‌ను గద్దె దించి కాంగ్రెస్‌కు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాజీ సిఎం కెసిఆర్ పాలనను ఓ గుణపాఠంగా తీసుకుని పరిపాలనకొనసాగించాలని సూచించారు. అధికారం చేపట్టే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్‌రెడ్డి పూర్తి చేయాలని, ఇందుకు సిపిఐ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని నారాయణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందేనని ఒకే మాటపై నిలబడిన ఏకైక జాతీయ పార్టీ సిపిఐ అని డాక్టర్ నారాయణ అన్నారు. మిగిలిన పార్టీలు ఇక్కడో మాట అక్కడో మాట మాట్లాడాయన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పేటెంట్ రైట్ మాత్రం మాజీ సిఎం కె.చంద్రశేఖరరావుకే దక్కుతుందని, కానీ ఆయన దానిని ఈ పదేళ్ల కాలంలో నిలబెట్టుకోలేకపోయారన్నారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేయాలి : అజీజ్ పాషా**

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత కృషి చేయాలని సయ్యద్ అజీజ్ పాషా సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిపిఐది అసాధారణ పాత్ర అని, అప్పట్లో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ కె.నారాయణ క్రియాశీల పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్రను ఎవరైనా మరిచిపోతే దానిని వారి విజ్ఞతకే వదిలివేద్దామన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ఉన్నప్పటికీ మరింత సమగ్రాభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. తాను కెసిఆర్, రేవంత్‌రెడ్డి పాలనను తను పోల్చడం లేదు కాని సంక్షేమ పథకాలు మరింత వేగవంతంగా అమలు కావాల్సి ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గనణ సర్వేతో ప్రధాని మోదీపై ఒత్తిడి పెరిగి కేంద్ర ప్రభుత్వం సైతం చేపట్టాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఓ మైలురాయేనన్నారు. నిత్యం పట్టణ ప్రాంతం విస్తరిస్తూ గ్రామీణ ప్రాంతం తగ్గుతుందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంత మేరకు తీరినప్పటికి మరింత ప్రభుత్వం పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి మూసీ ప్రక్షాళన మంచి కార్యక్రమామేనన్నారు.

# చక్కదిద్దుతున్నాం...

(మొదటి పేజీ తరువాయి)

సమాజం సహించదని, అందుకే ప్రజల ఆలోచనలే ఆచరణగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ఆకాంక్షలు నెరవేరలేదని సిఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి, ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ఎజెండా అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచి బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలు మహిళలు అని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహిళా సంఘాలకు బస్సులను ఆర్‌టిసికి అద్దెకు తీసుకుని వారికి ఆదాయం కల్పిస్తున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన యూనివర్శిటీలకు విసిలను నియమించామని, టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశామని, పోటీ పరీక్షలు నిర్వహించడంతోపాటు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, అమలుచేస్తున్నామన్నారు. విద్యా కమిషన్, వ్యవసాయ, రైతు కమిషన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. సమాచార కమిషనర్లను, లోకాయుక్త, హెచ్‌ఐఆర్‌సి సభ్యులను నియమించుకుని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**న్యూయార్క్, టోక్యోలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీ**

న్యూయార్క్, టోక్యోలకు దీటుగా ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నామని, ప్రపంచ దేశాలకు దీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును చేపడుతున్నామని, బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఫార్మా సిటీలతో పాటు లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రీజనల్ రింగ్ రోడ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు నిర్మించనున్నామని, రీజనల్ రైల్‌తో పాటు మెట్రో రైల్ విస్తరణ చేపడుతున్నామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూ.24వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు.

**భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణ:** భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం భూ భారతి 2025ను ప్రవేశ పెట్టామన్నారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఉపయోగపడేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ధరణి కొందరికి చుట్టమైతే, భూభారతి ప్రజలకు రక్షణ చట్టమన్నారు. రైతులకు వివాదాలు లేని భూములు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుస్తూ వారి విశ్వాసాన్ని పొందామన్నారు. సివిల్స్‌కు ఎంపికైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. గురుకుల విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. రూ.200 కోట్లతో నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

**కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయానికి తెలంగాణ కుల సర్వేనే కారణం**

దేశంలో దాదాపు వందేళ్ల క్రితం కులగణన జరిగిందని, వందేళ్లలో జరగని కులగణనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యతో కేంద్రంలో కూడా కదలిక వచ్చిందని, వచ్చే జనగణనలో కులగణన కూడా చేర్చుతామని ఇటీవల కేంద్రం ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయానికి తెలంగాణ కులసర్వేనే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాన్ని ప్రక్షాళన చేపట్టామని సిఎం చెప్పారు. ప్రభుత్వ వసతిగృహం విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిన విషయం గుర్తు చేశారు. ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. పేదల ఆరోగ్యం కాపాడటమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు.


**శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్:**శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశంలోనే ముందున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో అవార్డులు కూడా అందుకున్నారని చెప్పారు. డ్రగ్స్, నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు ముందున్నారని, సైబర్ నేరాల నివారణ, సొమ్ము రికవరీలో తెలంగాణ పోలీసుల పనితీరు నెంబర్‌వన్ అని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన



భారత్ సమ్మిట్‌లో 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలు, గొప్ప కట్టడాలను ప్రపంచానికి చూపించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**మహిళలకు ఉచిత వైద్యపరీక్షల పథకం**

క్యూఆర్ కోడ్ కార్డు ఇచ్చి మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించే పథకాన్ని తీసుకొస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వారికి రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామన్నారు. పాఠశాలల నిర్వహణ మహిళలకే అప్పగించామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేశామన్నారు. ఆ పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.26 వేల కోట్లు జమ చేశామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. బోనస్ పంపిణీ వల్ల రాష్ట్రంలో సన్న వడ్ల సాగు గణనీయంగా పెరిగిందని, నేడు రాష్ట్రంలో 2.75 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వస్తోందన్నారు. సంక్షేమ పథకాల చరిత్రలోనే సన్నబియ్యం పంపిణీ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందన్నారు.



**9 మంది ప్రముఖులకు ఒక్కొక్కరికీ రూ.కోటి నగదు పురస్కారం..**

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన 9 మందికి రూ.కోటి చొప్పున నగదును సిఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరికి నగదు పురస్కారాన్ని అందించారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి తరపున వారి కుటుంబసభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరపున ఆయన కుమార్తె పురస్కారాన్ని స్వీకరించారు. బహుభాషా సాహితీ వేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం అందించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీస్ అధికారులకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ అందజేశారు. 11 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను ముఖ్యమంత్రి అందచేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రెసిడెంట్ మెడల్ అందుకుంటున్న ఎసిబి డిజి విజయ్‌కుమార్, చిత్రంలో డిజిపి డాక్టర్ జితేందర్ కూడా ఉన్నారు.



## ప్రపంచ భాగస్వామ్యాలతో రాష్ట్ర పురోభివృద్ధి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ భవిష్యత్తు కోసం కొత్తగా ప్రపంచ భాగస్వామ్యాలతో వివిధ ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్ర పురోభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చిన కిటాక్యూషు నగర మేయర్ కజుహిసా టెక్యూచి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి రంగాల్లో కిటాక్యుషు సహకారం కోసం ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. గత ఏప్రిల్‌లో జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కిటాక్యూషు నగరాన్ని సందర్శించిన సందర్భంగా ఆ నగర మేయర్ కజుహిసా టెక్యూచితో సమావేశమైనప్పుడు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు సంస్థలతో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఒఐ) కుదుర్చుకున్నారు. తాజాగా జరిగిన భేటీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జపాన్ పర్యటన సందర్భంగా కిటాక్యూషు నగర ఎకోటౌన్ మాడల్తో చాలా ప్రేరణ పొందానని, మీరిచ్చిన ప్రేరణతోనే తెలంగాణ ప్రభుత్వం అలాంటి నమూనాను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం కోసం అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశామన్నారు.

సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణలలో ఈ సహకారం పునాది కానుందన్నారు. మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించిందని, తెలంగాణ యువతకు నైపుణ్యం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు. జపాన్‌లో అవకాశాలను అన్వేషించాలనే అభిలాషతో ఇక్కడి విద్యార్థులు జపనీస్ భాషను నేర్చుకోవాలని అనుకుంటున్నారని, ఔత్సాహికులకు జపనీస్ నేర్పించాలని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా కిటాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీ కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు.

కిటాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయే విధంగా ఉందని, రెండింటి మధ్య స్నేహం సుదీర్ఘ కాలం కొనసాగాలని కోరుకుంటున్నానన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ విజేతలకు రాజ్‌భవన్‌లో తేనేటి విందు

విజేతలను సన్మానించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు

ముఖ్య అతిథిగా హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్ 2025 పోటీలు తెలంగాణ గౌరవాన్ని ప్రపంచానికి చాటిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మహిళల సాధికారతను ప్రోత్సహించే ఈవెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. రాజ్‌భవన్‌లో మిస్ వరల్డ్ 2025 విజేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనేటి విందు ఇచ్చారు. అంతకుముందు వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎం.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ 2025 పోటీ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను వివరించారు. ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేశామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను ప్రదర్శించేందుకు ఈవెంట్ మంచి అవకాశమని పేర్కొన్నారు. మే 31న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన 72వ మిస్ వరల్డ్ ఫైనల్స్‌లో భాగంగా, 108 దేశాల నుంచి పాల్గొన్న అభ్యర్థుల్లో ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ (థాయ్‌లాండ్) మిస్ వరల్డ్ 2025 కిరీటం గెలుచుకోగా, హాస్సెట్ డెరెజె అడ్మాస్సు (ఇథియోపియా) మొదటి రన్నర్ అప్, మజా క్లాజ్డా (పోలాండ్) రెండో రన్నర్‌అప్, ఆరేలీ జోచిమ్ (మార్టినిక్) మూడో రన్నర్‌అప్గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో విజేతలతో పాటు మిస్ వరల్డ్ చైర్మన్ జూలియా మోర్లీ కూడా పాల్గొన్నారు. అంతకు ముందు మిస్‌వరల్డ్ ఓపల్ సుచాత శ్రీ, ఇతర కాంటినెంటల్ విజేతలకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి జితేందర్, పలువురు సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరులకు సిపిఐ ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ అమరవీరులకు సిపిఐ ఘన నివాళులు అర్పించింది. హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ నారాయణ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఆయన ప్రజాస్వామ్యాన్ని అంతం చేశారన్నారు. తెలంగాణలో ప్రజానీకంతో పాటు తన పార్టీలో కూడా ప్రజాస్వామ్యం లేకుండా చేశారన్నారు. అంతర్గతంగా, బహిరంగంగా ప్రజాస్వామ్యం లేకుండా ఫామ్‌హౌజ్ పాలన కొనసాగించారని, అదే ఇప్పుడు ఆయన కూతురు బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చేందుకు కారణమైందన్నారు. అమరులకు నివాళులు అర్పించిన వారిలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చందూ నాయక్, పైమిదా ఉన్నారు. అంతకుముందు గన్ పార్క్ వద్ద ప్రజానాట్యమండలి కళాకారులు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు.



**డాక్టర్ నారాయణకు ప్రభుత్వం సముచిత గౌరవం**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ప్రాత పోషించిన సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. సోమవారం గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమర వీరులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం నివాళులు అర్పించేందుకు డాక్టర్ నారాయణను సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అందరి కంటే ముందుగా పోరాడింది, క్రియాశీల పాత్ర పోషించింది నారాయణే అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

## ప్రజల ఆశలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ప్రాణ త్యాగాలతో, సబ్బండ వర్గాల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధించి, నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్ అమలైనప్పుడే తెలంగాణ ప్రజలు ఆశించిన తెలంగాణ సాకారం అవుతుందని, ఆ దిశగా పాలకులు తమ కార్యాచరణను అమలు చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, బస్టాండు సెంటర్లోని అమరవీరుల స్తూపం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ ఉద్యమ అమరులకు నివాళులర్పించారు, సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తొలి, మలి దశ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతమే నాంది పలికిందని, ఇక్కడ ప్రారంభమైన ఉద్యమం ప్రతిఒక్కరిలో స్ఫూర్తిని నింపి రాష్ట్ర సాధనకు బాటలు వేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి స్వరాష్ట్రం కోసం జరిగిన పోరులో అగ్రభాగాన నిలిచింది సిపిఐనేనని, ఉద్యమాన్ని తారాస్థాయికి చేర్చి ప్రజల్లో, కేంద్రంలో కదలిక తెచ్చింది సిపిఐనేనన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణా రాష్ట్రంలో ఆ ఉద్యమ ఫలాలను ప్రజల దరిచేర్చే విధంగా ఉద్యమాలతో ప్రభుత్వాలపై వత్తిడి చేసే భాధ్యతను సిపిఐ స్వీకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్బంధాలు లేని స్వేచ్ఛాయుత పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, అలాంటి తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ స్వేచ్ఛలేని నిర్బంధాలతో కూడిన పదేళ్ల పాలన నుంచి విముక్తి లభించినప్పటికీ ఉద్యమ ఫలాలు ప్రజల దరిచేరాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల, విద్యుత్, మౌలిక సదుపాయాల వంటి అంశాల్లో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ అది మరింత వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి నిధులు వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా సాగిన ఉద్యమ సమయంలో తృణః ప్రాయం ప్రాణాలను అర్పించిన అమరవీరులను సర్మించుకుంటూ ఎక్కడికక్కడ నివాళ్లు అర్పించారు. తెలంగాణ ప్రజలు ఆనాటి ఉద్యమ సన్నివేశాలను గుర్తుచేసుకుని ఉద్వేగాన్నికి గురయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయా పార్టీల కార్యాలయాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన తదితర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో తెలంగాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాతో పాటు తమ తమ పతాకాలను ఆవిష్కరించి అమరులకు నివాళ్లు అర్పించారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మగ్ధూంభవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, సయ్యద్ అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ యాదవ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, అమీర్ అలీఖాన్, బలమురి వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి, మాజీ ఎంపిలు అంజన్ కుమార్ యాదవ్, వి.హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్, మెట్టు సాయికుమార్‌లు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు ఈటెల రాజేందర్, మాజీ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరులకు నివాళ్లు అర్పించారు. తెలంగాణ సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను నిర్మించుకోవడమే వారి త్యాగాలకు నిజమైన గౌరవమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు భైరీ రమేష్, పల్లె వినయ్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఎంఎల్‌సి మధూసూధన్ చారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డిలు పాల్గొన్నారు.





**బిసి కమిషన్ కార్యాలయంలో..**

తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలల, శ్రీనివాసరావు డిప్యూటీ డైరెక్టర్, సతీష్ కుమార్ స్పెషల్ ఆఫీసర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. బిసి కమిషన్ ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో బిసి కమిషన్ అధికారిక వెబ్ సైట్‌ను ప్రారంభించారు. కమిషన్‌లో జరిగే నిర్ణయాలు, పత్రిక ప్రకటనలు సులువుగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని చైర్మన్ నిరంజన్ ప్రజలకు తెలిపారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజనుద్దేశించి ప్రసంగించారు. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ కోదండరామ్, విజయశాంతి, పలువురు ఎంఎల్ఎలు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి కార్యాలయంలో ఐజి శ్రీనివాస్‌లు జాతీయ పతాకాన్ని ఎగురువేయగా, మాసబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ దిల్‌రాజు జాతీయ జెండాను ఎగురవేశారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా మింట్ కాంపౌండలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనఅమరవీరుల చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. జిహెచ్ఎంసిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అన్‌దీప్ దురిశెట్టి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

**గన్‌పార్క్ వద్ద అమరులకు సిఎం ఘన నివాళి**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరు సూప్తం వద్ద ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, అధికారులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమరవీరుల సూప్తం వద్ద తెలంగాణ అమర వీరులకు పుష్పంజలి సమర్పించి శ్రద్ధాంజలి ఘంటించారు. అదే విధంగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, పిసిసి చైర్మన్ బి. మహేష్ కుమార్ గౌడ్, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం పుష్పాంజలితో నివాళులు అర్పించారు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌లు అమర వీరులకు నివాళ్లు అర్పించారు.

**హైకోర్టు ప్రధాన భవనంపై ..**

తెలంగాణ స్టేట్ ఫార్మేషన్ డే సందర్భంగా సోమవారం హైకోర్టు ప్రధాన భవనంపై జాతీయ జెండాను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ ఎగురవేసిన చిత్రం. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఏసీజే ప్రసంగం చేయలేదు.











అనంతరం తేనీటి విందు జరిగింది.

## పొత్తులు ఉండవు : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోబోదని, రాబోయే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు చెల్లించినట్టు సిఎం రేవంత్ రెడ్డి ఆధారాలను చూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను, బిఆర్ఎస్ గులాబీ జెండాను శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎంఎల్ఎలు వివేకానంద గౌడ్, ఎంఎల్‌సి సురభివాణిదేవి, బిఆర్ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య, డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లికి పూల మాల వేసి, అమరవీరులకు, ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళ్లు అర్పించారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ బిజెపి ఎంపిలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

ఎవరు స్పందించినా, స్పందిచకపోయినా తాము సుప్రీం కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్ట్ ను అడ్డుకుంటామని తెలిపారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని, ఎవరైనా బిఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే,వారి పేర్లను తమ రెడ్ బుక్‌లో రాసుకుంటామని హెచ్చరించారు.సిఎంకు సన్నిహితంగా ఉండే ఒక ఎంపి, ఒక కార్పొరేషన్ చైర్మన్ మిల్లీ మ్యాగీ తో అసభ్యకరంగా ప్రవర్తించారనే వార్తలు వస్తున్నాయని, వెంటనే సిసి ఫుటేజీ రిలీజ్ చేసి,బాధ్యులపైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడరని, ఈ ప్రాజెక్ట్ తెలంగాణకు ఒక శాపం కాబోతున్నదని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం ద్వారా గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రేమ ఉంటే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మధుసూదనాచారి బిఆర్ఎస్ పట్ల దుష్ప్రచారం చేసి, గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ జాతి ఉన్నంత వరకు బిఆర్ఎస్ ఉండేలా అందరూ అడుగులు వేద్దామన్నారు. బి వినోద్ కుమార్ మాట్లాడుతూ పరుగులు తీయాల్సిన వయసులో ఉన్న తెలంగాణ రాష్ట్రం దురదృష్టవశాత్తు దుర్మార్గుల చేతుల్లోకి వెళ్ళిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ, సూర్యాపేట జిల్లా.
No. 10/2025-26 టెండర్ నోటీసు తేది: 31.05.2025
**పని పేరు:** సూర్యాపేట జిల్లా, నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువపై కిమీ.76.808 నుండి కిమీ 132.809 వరకు గల మేజర్లు మెకానికల్ మరమ్మత్తుల పని చేయుట గురించి, **మొత్తం అంచనా విలువ:** రూ. 82.79 లక్షలు. **గమనిక:-** టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయము: 09.06.2025 మ. 3.00 వరకు మిగతా వివరములకు https://tender.telangana.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ.
DIPR R.O. No. : 2944-PP/CL/ADVT/1/2025-26, Date: 02-06-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటర్నరీ సెక్షన్, ఎల్‌బి నగర్ జోన్, జిహెచ్ఎంసి.
మెయిల్: ade.ghmc@gmail.com సెల్ నం. 9989930397
NIT No. 03/DD/VET/LBNZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 03.06.2025
**క్ర.సం. 1, పని పేరు:** 2025 బక్రీద్ సమయంలో ఆవులు మరియు ఇతర ఉత్పాదక జంతువుల వధను నివారించడానికి కొన్ని ఏర్పాట్లు. **అంచనా విలువ :** రూ.5,65,030/-, **ప్రారంభ తేది & ఆఖరి తేది:** 03.06.2025న ఉ.10.00గం.ల నుండి సా.5.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్, ఎల్‌బి నగర్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 2951-PP/CL/ADVT/1/2025-26, Date: 02-06-2025

## తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంపై తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సీపీఐ జిల్లా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తొలుత హనుమకొండ అదాలత్ సెంటర్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదకొండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన పార్టీలను, సంఘాలను ఉద్యమకారులను గుర్తించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్ఎ.స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎదునూరి వెంకటరాజం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, ఏశబోయిన శ్రీనివాస్, ఎం. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందకపోవడంపై రైతు కమిషన్ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ములుగువిత్తనోత్పత్తి బాధిత రైతులకు ఇప్పటీ వరకు నష్టపరిహారం చెల్లించకపోవడం పట్ల రైతుకమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ ములుగు జిల్లాలో విత్తనోత్పత్తి ఘటన పురోగతికి సంబంధించిన జూమ్ మీటింగ్ ద్వారా సమిక్షించారు నిర్వహించారు. ఈ సమావేశంలోఅగ్రికల్చర్ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్ర మిశ్రా, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ కేశవులు, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, రైతు కమిషన్ సలహాదారులు రామాంజనేయులు, దొంతి నర్సింహా రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డిలతోపాటు అడ్వకేట్ రామచంద్ర రెడ్డి, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, 03 జూన్

# రాజకీయ రణగొణధ్వనులు


వడివడినడకలతో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రం 12వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకోసారి వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై జరిగే ఎన్నికల్లో అధికారం పార్టీల చేతులుమారటం సహజం. ప్రజల తీర్పును శిరసావహించటం అనివార్యం అని తెలిపినా దాన్ని హుందాగా స్వీకరించే ప్రజాస్వామిక మనస్తత్వం కొరవడినపుడు రాజకీయ స్పర్థలు నిరంతరం కొనగుతూనే ఉంటాయి.అందుకు తెలంగాణ రాష్ట్రమే ఉదాహరణ. సుదీర్ఘకాల ప్రజా ఉద్యమం పర్యవసానంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యాన్ని గుర్తుచేసుకోవాలి. ఆ ఉద్యమానికి పేటెంట్ తమదేనని బలంగా విశ్వసించే తెలంగాణ రాష్ట్ర సమితి, దాని అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 9 సంవత్సరాలకు పైగా ఏకఛత్రాధిపత్యంగా ఏలుబడి సాగించారు. ఆయన పాలన ఏమిసాధించిందీ, ఎక్కడ విఫలమైందీ అనే సవివరమైన విశ్లేషణ ఇక్కడ సాధ్యంకాదు. ఆ పార్టీయే విశ్లేషణ చేసుకోనప్పుడు మన కెందుకు? అయితే ఆ పార్టీని ప్రజలు ఓడించి కాంగ్రెస్‌కు పట్టంకట్టారంటే ఆయన పాలన పట్ల ఓటర్లలో అసంతృప్తి పాలు ఎక్కువ ఉన్నట్లేకదా! కాని తమ అధికారాన్ని ఎవరో గుంజుకున్నట్లు గత 16 మాసాలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిత్యం విమర్శలు, ఆరోపణలు, దూషణలతో ముప్పేట దాడిచేస్తున్న బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్ తీరు వారి కార్యకర్తలకు కర్ణపేయంగా ఉండవచ్చు, కాని సామాన్య ప్రజలు చెవిఒగ్గటంలేదన్న వాస్తవాన్ని ఆ పార్టీ నాయకులు గ్రహించటం లేదు. ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమానికీ అడ్డుతగులుతూ అప్రతిష్ట తెచ్చుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకిరావాలని కలగనటం ఆక్షేపణీయం కాదు. అయితే తాము అధికారంలోకి వచ్చేవరకు అభివృద్ధికి అడ్డుపడటమే పనిగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో స్థిరపడితే అధికార అందలంమీదకు పూనరాగమనం పగటికలగానే మిగిలిపోతుంది. తాను పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఘంటాపథంగా చెబుతున్నారు. అది బిఆర్‌ఎస్ నాయకుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నట్లుంది. అందుకేనేమో రేవంత్‌రెడ్డి పదవి త్వరలో ఊడుతుంది, రాహుల్‌గాంధి ఇంటర్వ్యూ కూడా ఇవటంలేదని పాటపాడుతున్నారు. రేవంత్‌రెడ్డిని అపఖ్యాతి పాల్జేయకపోతే తాము ముందుకు రాలేమని ఆ నాయకుల్లో ఉన్న భయానికిది సంకేతం. వీరు ముందుగా తమ పార్టీ వ్యవహారాలు చక్కదిద్దుకుంటే మేలు. రోజూ మీడియా ముందుకొచ్చి నోరుపారేసుకునే బిఆర్‌ఎస్ నేతల్లో ఎందరు తాము నేరుగా కెసిఆర్ దగ్గరకు వెళ్లగలరో చెప్పగలరా?

ఆ పార్టీలో అప్పుడే వారసత్వ జగడం మొదలైందని కెసిఆర్ కుమార్తె ఆరోపణలు పోటీ రాజకీయాలు తేటతెల్లంచేస్తున్నాయి. అందరూ కెసిఆర్‌కు ముందుగా నమస్కారబాణంవేసి ఎవరిపద్ధతిలో వారు తమ సొంత రాజకీయాలు సాగిస్తున్నారు. దీని పర్యవసానం ఎలా ఉన్నప్పటికీ ఈ జగడంలోకి బిజెపి లాగబడింది. వచ్చే ఎన్నికల్లో అధికారం తమదేనని ఊదరగొడుతున్న బిజెపికిది మేలో, కీడో కాలమే చెబుతుంది. బిఆర్‌ఎస్‌ను బలహీనపరిచి తాము బలపడేటమనే (లోక్‌సభ ఎన్నికల ఫలితాలే ఇందుకు సాక్ష్యం) వ్యూహంతో పనిచేస్తున్న బిజెపి – కాంగ్రెస్,బిఆర్‌ఎస్ ఒకటే, కలిసిపోతాయనే ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్, బిజెపి ఒకటేనని బిఆర్‌ఎస్ ఆరోపణలు చేస్తోంది. బిజెపి, బిఆర్‌ఎస్ కలవటం ఖాయమంటోంది కాంగ్రెస్. అయితే తాను (లిక్కర్ కేసులో) జైల్లో ఉండగానే బిఆర్‌ఎస్‌ను బిజెపిలో కలిపే ప్రయత్నాలు జరిగాయని, తాను వ్యతిరేకించానని శ్రీమతి కవిత బయటపెట్టి బిఆర్‌ఎస్‌లోని తన వ్యతిరేకముఠాను ఇబ్బందుల్లో పడేశారు. బిఆర్‌ఎస్ మనుగడసాగించాలన్నా, బలపడాలన్నా అది తప్పుడు ఆరోపణ అని వారు ఖండించాల్సి వచ్చింది. బిజెపి అసలునాయకులు, అరువువచ్చిన నాయకుల మధ్య ఆధిపత్యపోరు వల్లనే రాష్ట్రపార్టీ అధ్యక్షుడి వరణం ఇంతవరకూ జరగలేదు. కేంద్రంలో మంత్రులుగా ఉన్న ఇరువురు –తెలంగాణయే కార్యస్థానంగా ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంపై, అటు బిఆర్‌ఎస్‌పై ధ్వజమెత్తుతున్నారు. అయితే కేంద్రంనుండి ఒక్కప్రాజెక్టు రాష్ట్రానికి తేలేదన్న కాంగ్రెస్ ఆరోపణ వారికి ముందరకాళ్లకు బందమవుతోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు బిఆర్‌ఎస్‌తో సమన్వయంతో అడ్డపడుతున్నారనే కాంగ్రెస్ ఆరోపణలకు గురవుతున్నారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణనను, దాని ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు, ఎస్‌సిల్లో ఉపవర్గీకరణ వంటి తీవ్రప్రభావంతమైన చర్యలతో బిజెపి, బిఆర్‌ఎస్ నోళ్లకు కాకపోయినా కాళ్లకు బందం వేశారు. అందువల్ల వచ్చే ఎన్నికలదాక ఈ రణడోలు తప్పవు. అయితే ప్రజలు రాజకీయ నాయకులకన్నా విజ్ఞులు. సరళంగా, సూటిగా ఆలోచిస్తారు. ఈలోపు రాజకీయనాయకులు త్రిముఖంగా, బహుళంగా చేసేవన్నీ మనుగడకోసం సాగించే విన్యాసాలే!

# పేదలకు తరుగుతున్న రుణాలు, పెరుగుతున్న బకాయిలు

**–జ్ఞాన్ పాఠక్**

జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్న అధికార యంత్రాంగంలోని నాయకులు, ఉన్నతాధికారులు తమ ప్రగల్భాల ద్వారా మన ఆర్థిక వ్యవస్థ బాగా ఉందనే తప్పుడు భావనను కలిగిస్తున్నారు. కానీ, అంకెలు మరో విధంగా మాట్లాడుతున్నాయి. పేదలలో రుణగ్రస్తత పెరిగింది. పేద రుణగ్రహీతలు అప్పులను తిరిగి చెల్లించలేకపోవడం కూడా పెరిగిపోయింది. 2023–24లో మైక్రో ఫైనాన్స్ రుణ అపరాధాలు పెరిగిపోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరిక కల నేపథ్యంలో ఆర్థిక సంస్థలు వారికి రుణాలు ఇవ్వకుండా ఆపుతున్నాయి. ఫలితంగా పేద ప్రజలు భారీగా వడ్డీలు వసూలు చేసే, వారి జీవితాలను దారుణంగా మార్చే ప్రైవేటు వడ్డీ వ్యాపారులు బారిన పడుతున్నారు. ఇది ప్రభుత్వం అత్యవసరంగా దృష్టి సారించాల్సిన అంశం.




మోదీ ప్రభుత్వం ఇలాంటి నిరుపేద రుణ గ్రహీతల విషయంలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వారి జీవితాలను సులభతరం చేయాలి. ఎందుకంటే ఆర్‌బిఐ పర్యవేక్షణలో బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా ప్రభుత్వం భారీ మొత్తం నగదును పొందుతున్నది. డిసెంబర్ 2024లో మైక్రో ఫైనాన్స్ రంగంలో తీవ్రమవుతున్న ఒత్తిడి గురించి ఆర్‌బిఐ బ్యాంకులను హెచ్చరించి, జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్యాంకులు తమ వంతుగా పేదలైన రుణగ్రహీతలకు ఇచ్చే రుణాలను గణనీయంగా తగ్గించాయి.మన బ్యాంకింగ్ వ్యవస్థలోని ప్రతి లాభాల వెంట పరుగెడుతుంటాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్‌బిఐ తమ ప్రధాన లక్ష్యమైన ప్రజా సంక్షేమానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. ఆర్‌బిఐ ప్రధాన విధి లాభాలను ఆర్జించటం కాదు. ఏమి చేసైనా ప్రజల బాగు కోసం ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడం. కానీ ఆ సంస్థ భారీ లాభాలను ఆర్జిస్తూ, భారత ప్రభుత్వానికి భారీ మొత్తాన్ని అందజేస్తోంది.




ఆర్‌బిఐ మే 23న ప్రకటించిన దాని ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌గా ఎన్నడూ లేనంతగా మిగులు రూ. 2.69 లక్షల కోట్లు చెల్లిస్తుంది. ఆర్‌బిఐ 2023–24 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ. 2.1 లక్షల కోట్లు బదిలీ చేసింది. దీనిని బట్టి బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత భారీ లాభాలను ఆర్జిస్తుందో ఊహించుకోవచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా తమ నిరంతరం పెరుగుతున్న లాభాలు సంపాదించే విధానాలతో భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. అవి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ సామాన్య ప్రజలు మాత్రం దెబ్బతింటున్నారు. దీని ద్వారా మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా రంగాన్ని ప్రైవేటీకరించడానికి ఎందుకు సిద్ధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రత్యేకించి పేద రుణగ్రహీతలు, సాధారణంగా పేద ప్రజలు బాధపడటం అనైతికం. తాజా డేటా ప్రకారం, 2024–25 సంవత్సరంలో 31 రోజులకు పైగా గడువు దాటిన సూక్ష్మ రుణ బకాయిలు 163 శాతం పెరిగి రూ. 43,075 కోట్లకు చేరుకున్నాయి. అంతకుముందు సంవత్సరం ఇది రూ. 16,379 కోట్లు. సాంకేతికంగా, వీటిని పోర్ట్‌ఫోలియో ఎట్ రిస్క్ (పిఎఆర్) అని అంటారు.

సూక్ష్మ రుణ రంగానికి స్థూల రుణ పోర్ట్‌ఫోలియో (జిఎల్‌పి) మార్చి 2024లో రూ. 4,42,700 కోట్లు ఉండగా, మార్చి 2025 నాటికి రూ. 3,81,200 కోట్లకు తగ్గింది. ఈ తగ్గుదల 13.9 శాతం. స్థూల రుణాలు మాత్రమే కాకుండా, క్రియాశీల రుణాలు కూడా ఈ కాలంలో రూ. 16.1 కోట్ల నుండి 14 కోట్లకు తగ్గాయి.

2023–24లో 0.7 శాతం ఉన్న 130 రోజుల పిఎఆర్ 2024–25లో 1.4 శాతానికి పెరిగింది. 2023–24లో 2.1 శాతం ఉన్న 31–180 రోజుల గడువు దాటిన పిఎఆర్ 2024–25లో 6.2 శాతానికి పెరిగింది. అంటే అది దాదాపు మూడు రెట్లు పెరిగింది అని సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ డేటా పేర్కొంది. అంతకంటే దారుణంగా ఈ కాలంలో 180 రోజులకు పైగా గడువు దాటిన పిఎఆర్1.6 శాతం నుండి 5.1 శాతానికి పెరిగింది.

రూ. 1 లక్షకు పైబడిన అధిక విలువ గల రుణాల విషయానికొస్తే, వాటి పాయింట్ ఆఫ్ సేల్స్ (పిఒఎస్) విస్తరిస్తున్నందున బకాయిలు పెరుగుతున్నాయని సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ చెబుతోంది. తక్కువ విలువ గల రుణాల విషయంలో బకాయిలు చాలా తక్కువగా ఉన్నాయి.

సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ డేటా ప్రకారం గత మూడు నెలల్లో రుణ వినియోగం మార్చి 2024లో రూ. 1,15,600 కోట్లు ఉండగా, మార్చి 2025లో రూ. 71,850 కోట్లకు తగ్గింది. గత మూడు నెలల్లో రుణాల సంఖ్య కూడా మార్చి 2024లో 240.5 లక్షల నుండి మార్చి 2025లో గణనీయంగా 133 లక్షలకు తగ్గింది.

సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ రూ. 1 లక్షకు పైబడిన అధిక విలువ గల రుణాల వైపు పెరుగుతున్న మార్పును ఎత్తి చూపింది. ఇది ఏడాది ప్రాతిపదికన 38.5 శాతం పెరిగింది. దీనికి విరుద్ధంగా రూ. 30,000 లోపు రుణాల్లో (35.9) శాతం ప్రతికూలవృద్ధి ఉంది. ఇది చిన్న రుణగ్రహీతలకు రుణాలు దూరమవుతున్న మార్పును సూచిస్తున్నది.

ఇలా ఎందుకు జరిగింది? ఎందుకంటే, బ్యాంకులు పేదలైన రుణగ్రహీతలకు రుణాలు నిరాకరించడం ద్వారా మైక్రో ఫైనార్స్ రంగం ఒత్తిడిని తీసుకువస్తున్నాయి. ఇది ఉద్యోగ మార్కెట్‌లో ఉద్యోగాలు పొందలేక, బ్యాంకుల నుండి చిన్న రుణాలు తీసుకొని చిన్న వ్యాపారాలు చేయడానికి ప్రయత్నిస్తున్న పేద ప్రజలను ప్రభావితం చేస్తోంది. వారు ఇప్పుడు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులకు ఎర అవుతున్నారు.

క్షేత్ర స్థాయిలో ఆర్థిక పరిస్థితి జాతీయ స్థాయిలో, ముఖ్యంగా అధికార వర్గాల్లో గ్రహించిన దానికంటే చాలా దారుణంగా మారింది. ప్రజలు తమ మనుగడ కోసం బహుళ వనరుల నుండి రుణాలు తీసుకుంటున్నారు. ఇది వారిపై అధిక రుణ భారానికి దారి తీస్తుంది. ఇతర ఆర్థిక తాకిడిలు, ఆదాయ అనిశ్చితులు కూడా వారి రుణం తిరిగి చెల్లింపు సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయి. అయినప్పటికీ, 5 లేదా అంతకంటే ఎక్కువ మంది నుండి రుణాలు తీసుకుంటున్న రుణగ్రహీతలు 202324లో 9.7 శాతం నుండి 2024–25లో 4.9 శాతానికి తగ్గారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది రుణదాతల నుండి రుణాలు పొందుతున్న రుణగ్రహీతల వాటా సెప్టెంబర్ 2021లో 3.6 శాతం నుండి సెప్టెంబర్ 2024 చివరి నాటికి 5.8 శాతానికి పెరిగింది. ఇది రుణగ్రహీతల రుణ భారం విపరీతంగా పెరిగిందనటానికి సూచిక అని ఆర్‌బిఐ 2024 డిసెంబర్‌లో తెలిపింది.

కోవిడ్19 సంక్షోభం తరువాత మైక్రో ఫైనాన్స్ రంగానికి రుణం పెరిగింది. కొన్ని నాన్‌బ్యాంకింగ్ రుణప్రదాత కంపెనీలు అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నట్లు గుర్తించబడింది. ఇది అక్టోబర్ 2024లో ఆర్‌బిఐ పర్యవేక్షక చర్యలకు హేతువైంది. అధిక వడ్డీ రేట్లను, అసమంజసమైన అధిక ప్రాసెసింగ్ ఫీజులు, అసంబద్ధమైన జరిమానాలను వసూలు చేసే కొన్ని సంస్థల గురించి ఆర్‌బిఐ తన ఆందోళనలను ప్రముఖంగా వెల్లడించింది. ఈ సమస్య ఎంత సంక్లిష్టంగా ఉందనేది ఇది స్పష్టం చేస్తుంది. ఇది బ్యాంకింగ్ రంగం లాభదాయకతను దాటి పేద ప్రజల మనుగడకు సంబంధించి తీవ్రమైన పర్యవసానాలను కలిగి ఉంది. క్షేత్ర స్థాయిలో తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వం తక్షణ బహుముఖ వ్యూహాన్ని పరిశీలించాలి.

# మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మెడికల్ టూరిజంకు గమ్యస్థానంగా మారుతున్నది. ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, అత్యాధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన చికిత్స అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీయులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు హైదరాబాద్ వచ్చి నాణ్యమైన చికిత్సలు పొందుతున్నారు. విదేశాల్లో సాధ్యం కానీ ఎన్నో కష్టమైన సర్జరీలు హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో విజయవంతంగా చేసి చూపిస్తున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే హైదరాబాద్‌లో చికిత్స ఖర్చులు అరవై శాతం తక్కువ. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, క్యాన్సర్ చికిత్స, కాస్మోటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు, అవయవ మార్పిడి లాంటి ఎన్నో సంక్లిష్టమైన సర్జరీలను నిపుణులైన వైద్యులు, హెల్త్ కేర్ సిబ్బంది హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా చేస్తున్నారు. హైదరాబాద్ లోని ఆసుపత్రుల్లో నైపుణ్యం గల డాక్టర్లతో పాటు విదేశీయులతో ఇబ్బంది లేకుండా ఇంగ్లీష్ మాట్లాడే డాక్టర్లు, హెల్త్ కేర్ సిబ్బంది, అనువాదకులు ఉండడం, కాస్మోపాలిటన్ సంస్కృతి, సురక్షితమైన భద్రత, అనువైన వసతి ప్రయాణ సౌకర్యాలు వంటివి అనుకూలంగా ఉండటంతో అనేక దేశాల నుంచి రోగులు నాణ్యమైన, విలువలతో కూడిన వైద్యం అందుతుందనే నమ్మకంతో హైదరాబాద్‌లో ఆసుపత్రులకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. వైద్య సదుపాయాల నాణ్యత, నైపుణ్యాలు మొదలగు అన్ని అంశాలు మెడికల్ టూరిజం అభివృద్ధికి దోహదపడుచున్నవి. కార్పొరేట్ ఆసుపత్రులు విదేశీయుల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి సిబ్బందిని, అనువాదకులను అందుబాటులో ఉంచి విదేశీయులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాదులో నాణ్యమైన చికిత్సలు అతి చౌకగా లభించడంతో విదేశీయులే గాక ఇతర రాష్ట్రాల వారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సంవత్సరం లక్షకుపైగా విదేశీయులు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని అంచనా! 2024లో వైద్య సేవల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులు 4.64 లక్షలు అయితే అందులో 1.51 లక్షల మంది హైదరాబాదులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. దేశంలోని మెడికల్ టూరిజంలో హైదరాబాద్ వాటా 30% పైనే అని చెప్పవచ్చు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్ మెడికల్ టూరిజంను ప్రమోట్ చేయడం జరుగుచున్నది.హైదరాబాదులో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారులందరితో గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రిలో వైద్య పర్యాటకంపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి హైదరాబాదులో విస్తృతమైన అవకాశాలు ఉండడంతో దీని ఆలంబనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మెడికల్ టూరిజం అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ విదేశీ పేషెంట్లకు అవసరమైన అనువాదకులను ప్రోత్సహించడం, వారు ఏ విధంగాను దోపిడీకి గురికాకుండా చూడడం, వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, వారి సంస్కృతికి తగ్గట్టుగా ఆహారం అందేలా చూడడం, వారు ఖర్చు పెట్టే ప్రతి పైసకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తూ ఆచరణలో పెడుతున్నది. మెడికల్ టూరిజంలో అగ్రస్థానంలో ఉండడానికి కావలసిన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెడికల్ టూరిజం రంగంలో ప్రపంచంలోనే అందరూ కోరుకునే సురక్షితమైన ఆదర్శవంతమైన వనరులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. మెడికల్ టూరిజం వలన మన ఆరోగ్య ఆర్థిక రంగాలు బలోపేతం అవుతున్నవి. హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్ గా రూపుదిద్దుకోవడం ఆహ్వానించదగిన పరిణామం.




**పుల్లూరు వేణుగోపాల్**
**9701047002**

# ప్రైవేట్ విద్యాసంస్థలకు చట్టాలు, జీవోలు వర్తించవా?



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యను వ్యాపారం చేస్తున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలలు అంతా మా ఇష్టం, ఫీజుల జీవోలు మాకు వర్తించవన్నట్టు, వ్యాపార కేంద్రాలు అన్నట్లుగా మార్చేస్తున్నారు. అధికారికంగా తెలంగాణలో జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలల ప్రారంభం, జూన్ ఒకటవ తేదీ నుంచి ఇంటర్ కళాశాలల ప్రారంభం. కానీ ఎప్పటి నుండో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రారంభం. అనేక పాఠశాలలు, కళాశాలలు ఈ అడ్మిషన్ల పేరుతో దందా మొదలెట్టాయి.

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలను గాలికి వదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు, కొత్తగా అడ్మిషన్ల కోసం విద్యార్థులకు అడ్మిషన్ టెస్టులను నిర్వహిస్తూ టెస్ట్ పాస్ అయితేనే సీటు, లేకుంటే లేదు అంటున్నారు. ఏకంగా ఒకటి, రెండు, మూడు తరగతి విద్యార్థులకు కూడా అడ్మిషన్ టెస్టులు నిర్వహించి అడ్మిషన్లు ఇస్తున్నారు. అడ్మిషన్ టెస్ట్ కోసం ఫీజు కట్టి, పరీక్ష రాసి పరీక్ష పాస్ అయితేనే సీటు ఇట్లా ఒక్కో తరగతిలో 100మంది విద్యార్థులకు పరీక్ష పెట్టి పదుల సంఖ్య విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చి విద్యా వ్యాపారం చేస్తున్న పరిస్థితి. ఆ తరగతిలో విద్యార్థులు సరిపడా ఉన్న అడ్మిషన్ టెస్ట్ పెట్టి ఫీజు వసూలు చేసి మార్కులు తక్కువ వచ్చాయి, సీటు ఇవ్వలేము అని వెనక్కి పంపించే పాఠశాలల యాజమాన్యాలు అనేకం ఉన్నాయి. మళ్లీ అడ్మిషన్ ఫీజు లేదా రిజిస్ట్రేషన్ ఫీజు అంటూ ఒక్కో పాఠశాలలో రూ.10 నుంచి రూ.25 వేల వసూలు, కళాశాలల్లో రూ.5 వేల నుంచి రూ.8వేలు వసూలు ఇలా ఇష్టారాజ్యంగా లేని ఫీజులను సృష్టించి వసూలు చేస్తున్నారు. ఈ ప్రతి పాఠశాల వారు ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయడం లేదు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రతి పాఠశాల కళాశాలలో వారికి వారే నిర్ణయించుకొని 15 నుండి 20% ఫీజులు పెంచుకున్న పరిస్థితి. ఫీజుల నియంత్రణ చట్టం ప్రకారం ఏ పాఠశాలలో ఎంత ఫీజుల వసూలు చేస్తున్నారో ఆ పాఠశాల, కళాశాల ఆవరణ నోటీస్ బోర్డుపై పెట్టడం లేదు, పేరెంట్స్ కమిటీలు వేయడం లేదు. టీచింగ్ సిబ్బంది వివరాలు ప్రకటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఈ అడ్మిషన్ ఫీజులు రిజిస్ట్రేషన్ ఫీజుల వసూళ్లు చేస్తున్నారు. అనేక పాఠశాలలు పుస్తకాలు ,యూనిఫామ్‌లు అన్ని రకాల స్టేషనరీ వస్తువులను పాఠశాలల ఆవరణలోనే అమ్ముతూ పాఠశాలలను సూపర్ మార్కెట్లుగా మార్చుతున్నారు. ఇదంతా బహిరంగంగా చేస్తా ఉన్న విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఇలాంటి విద్యా వ్యాపారాన్నీ అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. విద్యాశాఖ కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలల అదనపు ఫీజు వసూళ్ల దోపిడిని అరికట్టాలి. విద్యాశాఖ తీసుకువచ్చిన ప్రతి జీవో ప్రతి విద్యాసంస్థలో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ ఫీజుల వసూళ్లు, పుస్తకాలు అమ్ముడు,అధిక ఫీజుల దోపిడీ, నిబంధనలు పాటించని పాఠశాలలు, జూనియర్ కళాశాలల పై కఠిన చర్యలు తీసుకోవాలి.

# అప్రమత్తతే కరోనాకు నిరోధం

కరోనా మహమ్మారిని వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండడం అవసరం. కరోనా వ్యాధి లక్షణాలు మన దేశంలో తిరిగి చెదురుమదురుగా బయటపడుతూ కేసులు రిజిస్టర్ అవుతున్నందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా గాంధీ ఆసుపత్రిలో అరవై బెడ్‌ల ఒక గదిని ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం. హైద్రాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో వైద్యుల సమావేశం ఏర్పాటు చేసి కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరోనా లక్షణాలు కన్పిస్తే చికిత్స చేయడానికి ఏర్పాట్ల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మన దేశంలో చాపకింద నీరులా కరోనా వ్యాధి వ్యాపిస్తుంది. వేరు వేరు రాష్ట్రాలలో కరోనా లక్షణాలు బయటపడుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు కొద్దిగా నమోదైనా ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి.

**కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రద్దీగా ఉండే ప్రాంతాలకు నిత్యావసర వస్తువులు, పెళ్ళిళ్ళు, ప్రయాణాల కోసం బస్సు డిపోలకు, రైల్వే స్టేషన్ లకు వెళ్ళాల్సి వస్తే మూతికి మాస్క్ ధరించాలి. చేతులను మాటిమాటికీ శుభ్రపరుచుకోవడం చేయాలి.

**కరోనా లక్షణాలు :**

దగ్గు, జ్వరం, తలనొప్పి, చలి, కీళ్ల నొప్పులు, కాళ్ళు చేతులు గుంజడం, వాంతులు లాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం వహించకుండా ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకోవాలి.కరోనా టెస్ట్ చేపించి ఒక వేళ కరోనా లక్షణాలు ఏ మాత్రం ఉన్నా మిగతా వారికి సోకకుండా క్వారంటైన్ ( ఇంట్లో లేదా ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకోవడం) అవసరం.బయటి దేశాల నుండి ఎవరైనా మన దేశానికి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి వస్తే విమానాశ్రయంలో కరోనా చికిత్సలు నిర్వహించాలి. కరోనా నెగిటివ్ ఉన్నట్లు తేలిన తర్వాతనే మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళడానికి అనుమతించాలి. కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అంటూ ప్రజలు భావించకుండా ప్రభుత్వానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు అందించాలి. మన ప్రాంతాల్లో ముఖ్యంగా అపార్ట్మెంట్‌లలో కరోనా లక్షణాలు కన్పిస్తే వెంటనే చికిత్స తీసుకునే విధంగా వారిని అప్రమత్తం చేయాలి. వేసవి సెలవులు ముగిసి పది, పదిహేను రోజులలో పాఠశాలలు, కళాశాలలు, అన్ని విద్యా సంస్థలు ప్రారంభమవుతున్న సమయంలో కరోనా వైరస్ గురించి కేసులు బయట పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరోనా వలన పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలు అన్నీ మూత పడటం విద్యార్థులు ఆన్ లైన్‌లో విద్యను అభ్యసించి విద్యలో వెనుకబడిన విషయాలను తలచుకొని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డాక్టర్. ఎస్. విజయ భాస్కర్**
**9290826988**

# మంచి ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్నుకోవడం ఎలా...?


భారతదేశంలో ఇంజనీరింగ్ విద్య అనేది సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన విద్యగా నిలిచింది. ప్రతి ఏడాది లక్షల మంది విద్యార్థులు ఐఐటిలను, ఎన్ఐటిలను, ఇతర రాష్ట్ర స్థాయి, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలను లక్ష్యంగా పెట్టుకుని పోటీ పరీక్షలు రాస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో, ప్రతి విద్యార్థి మౌలికంగా ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానమిచ్చుకోవాలి— నేను ఎలాంటి ఇంజనీరింగ్ కోర్సును ఎంచుకోవాలి? మరియు ఏ కాలేజీ నాకు సరైనదీ? ఇంజనీరింగ్ అంటే కేవలం సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అనే పాత తరహా కోర్సులు మాత్రమే అన్న దశ గడిచిపోయింది. నేటి యుగంలో ఎన్నో కొత్త కోర్సులు తెర పైకి వచ్చాయి. డిజిటల్ రంగం విస్తరిస్తున్నప్పుడల్లా ఆ రంగానికి అనుగుణంగా కొత్త కొత్త డొమెన్లు తెరపైకి వస్తున్నాయి. కొన్ని ప్రస్తుతానికి మరియు భవిష్యత్తుకు అత్యంత అవసరమైన కోర్సులు:

**ఏ కోర్సులకు డిమాండ్:** కంప్యూటర్ సైన్స్ యాక్సిలరేటెడ్ మాస్టర్స్ ప్రోగామ్ (ఎఎంపి) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సంబంధించిన కోర్సులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రపంచం నేడు డేటా ఆధారిత నిర్ణయాల దిశగా దూసుకుపోతుంది. ఈ కోర్సులో విద్యార్థులు డేటా సైన్స్, మిషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అంశాలను నేర్చుకుంటారు. Google, Amazon, Microsoft వంటి దిగ్గజ కంపెనీలు AI నిపుణులను భారీగా నియమిస్తున్నాయి. డేటా సైన్స్ (ఎఎంపి) బిగ్ డేటా అనలిటిక్స్ వంటి కోర్సులు డేటా అనలిసిస్‌లో నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తయారుచేసి కంపెనీలకు 'బిజినెస్ ఇన్సైట్' అందించగలుగుతాయి. కావున ఈ రంగానికి ప్రాధాన్యం విపరీతంగా పెరిగింది. సైబర్ సెక్యూరిటీ కోర్సులు సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్స్‌ను తరచేస్తాయి నేడు ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరిగాయి కావున హ్యాకింగ్ ముప్పు కూడా పెరుగుతోంది. అందుకే సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఉంది. మెషిన్ లెర్నింగ్ (ఎఎంపి)రోబోటిక్స్ కోర్సులు వంటి కోర్సులు నేడు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. దీన్ని చదవడం ద్వారా రోబోట్స్‌ను రూపొందించటం, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాభివృద్ధి సాధించడం ద్వారా భవిష్యత్తును సుస్థిరం చేసుకోవచ్చు. బయోటెక్నాలజీ (ఎఎంపి) బయోఇంజనీరింగ్ కోర్సులు మంచి ఉద్యోగాలను కల్పిస్తుంది. కరోనా తర్వాత హెల్త్ టెక్నాలజీకి గణనీయమైె ప్రాముఖ్యత వచ్చింది. ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ కోర్సు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఉన్న ముప్పుల నేపథ్యంలో ఈ రంగానికి భవిష్యత్‌లో ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త డొమెన్లు టెక్నాలజీ రంగంలో భారీ మార్పులకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా స్టార్టప్ సంస్కృతి పెరుగుతున్నందున ఈ నైపుణ్యాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయి.

**కాలేజీ ఎంపిక:** విద్యార్థులు ఏ కోర్సు చదవాలన్న నిర్ణయం తీసుకోవడమే కాదు, దానిని నేర్చుకునే స్థలాన్ని ఎంచుకోవడమూ అంతే ముఖ్యమైనది. మంచి కాలేజీ అనేది కేవలం భవనాల వల్ల కాదు–అది ఫ్యాకల్టీ, పరిశోధన వాతావరణం, ప్లేస్‌మెంట్స్, ఇండస్ట్రీ లింకేజ్ లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. భారత ప్రభుత్వ హై ఎడ్యుకేషన్ మినిస్ట్రీ విడుదల చేసే National Institutional Ranking Framework (NIRF) ర్యాంకింగ్స్ ఆధారంగా టాప్ కాలేజీలను పరిశీలించవచ్చు. ఈ ర్యాంకింగ్స్ ఫ్యాకల్టీ క్వాలిటీ, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, విద్యార్థి నిష్పత్తి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. ఒక కాలేజీకి ఎంతమంది పిహెచ్.డి ప్రొఫెసర్లు ఉన్నారు? వారు పరిశోధనల్లో ఎంతగా పాల్గొంటున్నారు? వారిచే నిర్వహించే సదస్సులు, వర్క్‌షాపులు వంటి అంశాలు ఎంతో ముఖ్యమైనవి. ఇంజనీరింగ్ అంటే కేవలం పాఠ్యపుస్తకాలు కాదు. పరిశోధన చేయగలగటం కూడా ముఖ్యమే. ఆ కాలేజీలో (ఎఎంపి)లాబ్స్ ఉన్నాయా? ప్రాజెక్ట్స్ నిర్వహించబడుతున్నాయా? పరిశీలించాలి.

**ప్లేస్‌మెంట్లు (ఎఎంపి)ఇంటర్న్‌షిప్ అవకాశాలు:** మంచి కంపెనీలతో కాలేజీ సంబంధాలు ఉన్నాయా? గత సంవత్సరాల్లో ఎంత మంది విద్యార్థులు ప్లేస్ అయ్యారు? వారి ప్యాకేజీలు ఎంత? ఇలా అడగాలి. అలాగే స్టార్టప్‌లు, MNC కంపెనీలతో టైఅప్స్ ఉన్నాయా? . ఇండస్ట్రీ అవసరాల మేరకు విద్యార్థులు సిద్ధమవ్వాలంటే, విద్యాసంస్థలు ఆ పరిశ్రమలతో అనుసంధానంగా ఉండాలి. గెస్ట్ లెక్చర్స్, ప్రాజెక్ట్ మెంటరింగ్, ఆఫ్–క్యాంపస్ ఇంటర్న్‌షిప్స్ వంటివి ఈ లక్షణాలే. అంతర్జాతీయ విద్యా సంస్థలతో మౌలిక ఒప్పందాలు ఉన్న కాలేజీల్లో చదివిన విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాలలో MS, Joint Research Programmes చేయడానికి మంచి అవకాశాలు ఉంటాయి.

**మహేశ్వరం భాగ్యలక్ష్మి**
**9505618252**



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఎన్‌డిఎ 3.0 తొలి వార్షికోత్సవ వేళ

## రేపు కేంద్రమంత్రివర్గంలో కీలక నిర్ణయాలు!

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్రమంత్రివర్గం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం మొదటిసారి సమావేశం కానున్నది. జూన్ తొమ్మిదో తేదీనాటికి నరేంద్రమోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని పూర్తిచేసుకోబోతున్నది. మూడోవిడత గెలిచిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్న విషయాలను జూన్ 4న మంత్రివర్గంలో ప్రధానంగా చర్చిస్తారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కార్యకలాపాలపై కేంద్ర మంత్రివర్గానికి ఈ సమావేశంలో పూర్తి వివరాలు అందజేస్తారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి మోదీ ఆపరేషన్ సిందూర్‌తోపాటు ఇప్పటివరకూ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమం గురించి మంత్రివర్గ సహచరులతో చర్చిస్తారని భావిస్తున్నారు. గుజరాత్ సహా నాలుగు రాష్ట్రాలలో ఉప ఎన్నికల సందర్భంగా స్వరాష్ట్రంలో ఇటీవల పర్యటన సందర్భంగా మోదీ పాకిస్థాన్‌పై సాధించిన విజయాల గురించి ప్రధానంగా ప్రస్తావించారు.

# ఆరువేల మృతదేహాల స్వాధీనానికి రష్యా అంగీకారం

మృతదేహాల సేకరణకు
మూడు రోజులు కాల్పుల విరమణ

ప్రతిపాదిత ఒప్పంద పత్రాల
పరస్పర మార్పిడి

వారం తర్వాతే తదుపర చర్యలు
ఉక్రేన్ ప్రకటన

నెలాఖరులోపు పుతిన్, జెలెన్‌స్కీ,
ట్రంప్ సమావేశం?





**మాస్కో :** అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న రష్యా–ఉక్రేన్ రెండో విడత ముఖాముఖీ చర్చలు ఇస్తాంబుల్‌లో సోమవారం సాయంత్రానికి ముగిశాయి. సరిహద్దుల్లో ఉన్న కొన్ని యుద్ధరంగ ప్రాంతాల్లో మరణించిన సైనికుల మృతదేహాలు సేకరించేందుకు రెండు లేదా మూడు రోజులు కాల్పుల విరమణకు ప్రతిపాదించినట్లు రష్యా బృందానికి నాయకత్వం వహించిన వ్లాదిమీర్ మెడిన్‌స్కీ చెప్పారు. చర్చల అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరువేలమంది సైనికుల మృతదేహాలు, వారి శరీర భాగాలను ఉక్రేన్‌కు స్వాధీనం చేసేందుకు అంగీకరించినట్లు చెప్పారు. రెండు దేశాలూ ఈ చర్చలకు సంబంధించి ప్రతిపాదిత ఒప్పంద పత్రాలను తుర్కియే విదేశాంగమంత్రి ద్వారా పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయని చెప్పా రు. చర్చలకు సంబంధించిన ప్రతిపాదిత ఒప్పం ద, డిమాండ్ల పత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ తర్వాత బృందాలు స్పందిస్తాయి. పుతిన్–జెలెన్‌స్కీ మధ్య సమావేశ అవకాశాల గురించి కూడా ఈ బృందాలు చర్చించాయి. రెండో విడత చర్చల్లో గొప్ప పురోగతి లేకపోయినప్పటికీ అమెరికాతో సంబంధాలను సమస్యలు లేకుండా కొనసాగించాలని ప్రతినిధులు నిర్ణయించారు. కాగా పుతిన్–జెలెన్‌స్కీ మధ్య చర్చలు ఏర్పాటు చేసేందుకు తాము ఒక వంతెనలా కృషి చేస్తామని తుర్కియే దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్ వ్యాఖ్యానించారని వార్తలు వెలువడ్డాయి. రెండు దేశాలవద్దా బందీలుగా ఉన్న సైనికులను మరోసారి ఇచ్చి పుచ్చుకోవాలని చర్చల్లో నిర్ణయించాయి. చాలా తీవ్రంగా గాయపడిన సైనికులు,18–25 ఏళ్ళ లోపు వయసుగల యువకులైన సైనికులు, మరణించిన సైనికుల మృతదేహాలను పరస్పరం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు. మే 16న జరిగిన తొలి విడత చర్చల్లో కూడా ఇదే నిర్ణయం తీసుకుని మూడురోజులపాటు ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ చర్చలపై ఉక్రేన్ రక్షణమంత్రి రస్టెమ్ ఉమెరోవ్ మొదట స్పందిస్తూ, రష్యా ఇచ్చిన డిమాండ్ పత్రాలను అధ్యయనం చేసి వారం రోజుల తర్వాత తదుపరి చర్యలు ప్రకటిస్తామని చెప్పారు. ఈనెలాఖరులోపు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలమధ్య సమావేశం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఐతే ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను కూడా భాగస్వామిగా చేసే అవకాశాలు ఉన్నట్లు ఉక్రేన్ రక్షణమంత్రి ఉమెరోవ్ చెప్పారు. రెండు దేశాలమధ్యా జరిగే ముఖాముఖీ చర్చలను పర్యవేక్షించడానికి ఎవరో ఒకరుండాలని, ఆ ఒక్కరూ అమెరికా నాయకుడైతే బాగుంటుందన్నారు. ''యుద్ధాన్ని ముగించేందుకు నిజమైన కృషి చేయాలని, మానవతా చర్యలు తీసుకోవడానికి, నాయకులమధ్య సమావేశానికి మేం పిలుపు ఇచ్చాం, రష్యా గనుక చిత్తశుద్ధితో ఉంటే అంగీకరిస్తుంది, లేకపోతే ఇక రష్యాపై తదుపరి ఆంక్షలు అమలు జరుగుతాయి'' అని ఆయన సమావేశానంతరం చెప్పారు. ఇదిలా ఉండగా రష్యా చర్చలపట్ల చిత్తశుద్ధితో లేదని, యుద్ధాన్ని ముగించేందుకు యూరప్ ద్వారా మరిన్ని ఆంక్షలు రష్యాపై విధించేందుకు ఒత్తిడి తీసుకురావాలని ఉక్రేన్ భావిస్తున్నట్టుగా ఉందని పాశ్చాత్య మీడియా పేర్కొంది. ఒకవైపు పరస్పర కాల్పుల యుద్ధం జరుగుతుంటే మరొకవైపు రెండో విడత సంప్రదింపులు జరిగాయి. భారత కాలమానం ప్రకారం సోమవారం 3.30గంటలకు ముఖాముఖీ చర్చలు మొ దలయ్యాయి. ఉక్రేన్ తరఫున రస్టెమ్ ఉమెరోవ్, రష్యా తరఫున వ్లాదిమీర్ పుతిన్ సహాయకుడు మెడిన్‌స్కీ బృందాలకు నాయకత్వం వహించారు. తుర్కియే విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్ చర్చలకు అధ్యక్షత వహించారు. తుర్కియే ఇంటిలిజన్స్ ఉన్నతాధికారులు కూడా చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల్లో తుర్కియే ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండబోదని రష్యా ముందుగా ప్రకటించింది. ఉక్రేన్‌లో యుద్ధం రావడానికి మూల కారణాలను పరిష్కరించాలని రష్యా దృఢ నిశ్చయంతో ఉంది. దీనినికే కేంద్రబిందువుగా చేసుకుని ఒక సుదీర్ఘమైన ఒప్పంద పత్రాన్ని చర్చల నిమిత్తం రష్యా దౌత్యాధికారులు సిద్ధం చేశారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధం ముగస్తుందన్న ఆశాభావం అందరిలోని ఉంది. ఈ చర్చల ఫలితాలకోసం ప్రపంచదేశాలు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. మే 16వ తేదీన మొదటిసారి ఈ రెండు దేశాలమధ్య ముఖాముఖీ చర్చలు జరిగాయి. కానీ శాంతి సాధన, యుద్ధ ముగింపులో విఫలమయ్యాయి. పరస్పరం తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులను మార్పిడి చేసుకోవాలని మాత్రం నిర్ణయించి ఆ మేరకు శాంతియుతంగా సైనికులను ఇచ్చిపుచ్చుకున్నారు.


### ఉక్రేన్ దాడుల్లో రష్యాకు భారీ నష్టం

ఈ సంప్రదింపులకు కొద్ది గంటలు ముందుగా రెండు దేశాలమధ్య పరస్పర సైనిక దాడులు జరిగాయి. ఒకవైపు చర్చలు కొనసాగుతున్నప్పటికీ రెండు దేశాలమధ్యా ఉన్న 1000 కి.మీ సరిహద్దు ప్రాంతం వెంట యుద్ధం జరుగుతూనే ఉంది. ఉక్రేన్ చేసిన దాడుల్లో ఆదివాకంరాడె రష్యాకు 7 బిలియన్ డాలర్లమేరకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా రష్యా వ్యూహాత్మక యుద్ధ విమానాలపైనే గురిపెట్టి వాటిని ధ్వంసం చేసింది. క్రూయిజ్ క్షిపణులను మోసుకెళ్ళే వ్యూహాత్మకమైన రష్యా బాంబర్లను ధ్వంసం చేసినట్లు ఉక్రేన్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు చెప్పారు. కాగా సోమవారంనాడు ఉక్రేన్‌కు చెందిన 162 డ్రోన్లను ఎనిమిది రష్యన్ ప్రాంతాలలో కూల్చివేసినట్లు సోమవారం నాడు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రటించింది. అదేవిధంగా ఉక్రేన్ వైమానికదళం ఒక ప్రకటన చేస్తూ, రష్యా తమపై ప్రయోగించిన 80 డ్రోన్లలో 52 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. దాదాపు 40 రష్యా విమానాలను ధ్వంసం చేశామని ఉక్రేన్ భద్రతాదళాలు ఆదివారంనాడు ప్రకటించాయి. అదేవిధంగా రస్యా దాడుల్లో 12 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు.

# ఈశాన్య రాష్ట్రాలకు వరద నిధులివ్వండి

ప్రధాని మోదీకి కాంగ్రెస్ విజ్ఞప్తి

అసోంను వరదరహితంగా
మారుస్తామని ద్రోహం చేశారని విమర్శ



**న్యూఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు అతలాకుతలం సృష్టిస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో వరద పరిస్థితులకు సంబంధించి మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. ఆయన తన పిఎం కేర్ నిధులు గేట్లు తెరుస్తారని ఆశిస్తున్నానన్నారు. అసోంలో విరదల పరిస్థితులను ప్రస్తావిస్తూ 2016లో ప్రధాని మోదీ అసోంను వరదరహిత రాష్ట్రంలో మారుస్తానని హామీనిచ్చారని కానీ, బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసినట్లుగా కనిపిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. ఈశాన్య భారతం వరదలు, కొండచరియలు, భారీ వర్షాల విధ్వంసంలో చిక్కుకుపోయాయని ఖర్గే ఎక్స్‌లో సోమవారం పోస్టు చేశారు. అసోం, అరుణాచల్, మణిపూర్, సిక్కిం, మేఘాలయ రాష్ట్రాలు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయాయని, ఇక్కడ అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది ప్రజలు ప్రభావితమైనట్లు తాను గమనించానన్నారు. ప్రజలకు సాయం అందించడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2016లో బిజెపి అసోంను వరద రహితంగా మారుస్తామని హామీ ఇచ్చిందని, 2022లో కూడా హోంమంత్రి అమిత్ షా ఈ హామీని పునరావృతం చేశారని ఖర్గే గుర్తు చేశారు. స్మార్ట్ సిటీ అని పిలవబడే గువహటి దృశ్యాలను చూస్తుంటే మోదీ జీ, అతని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అసోంను ఎలా మోసం చేశాయో గుర్తుకు వస్తుందని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజల దృష్టిని ప్రాథమిక అభివృద్ధి సమస్యల నుండి భావోద్వేగం, ధ్రువణ అంశాలకు మళ్లించారని, పరధ్యానం, మళ్లింపు బిజెపి రాజకీయాల ముఖ్య లక్షణమని కాంగ్రెస్ చీఫ్ విమర్శించారు. వరదల సంసిద్ధత కోసం మోదీ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ, ముఖ్యంగా అసోంకు మరిన్ని నిధులు విడుదల చేయాలన్నారు. బహుశా మోదీ జీ పిఎం కేర్స్ నిధి వరద ద్వారాలను తెరవవచ్చని, వాటిలో కోట్లాది రూపాయలు ఉన్నాయని, ప్రజా ఆడిట్ చేయడం లేదని ఖర్గే ప్రధానమంత్రిపై విమర్శలు గుప్పించారు. ఆశాన్య రాష్ట్రాల్లో, ముఖ్యంగా అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం సంభవించిన వార్త చాలా విచారకరమని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషాదం కారణంగా గువహటిలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, జనజీవనం అస్తవ్యస్తమైందన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ, సహాయ చర్యలను వేగవంతం చేయాలని, అవసరమైన వారందరికీ తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఆయన అన్నారు. సహాయక చర్యలలో సాధ్యమైనంత సహాయం అందించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరినీ గాంధీ కోరారు. ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మేఘాలయ, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షపాతం తర్వాత వరద పరిస్థితి భయంకరంగా ఉంది. అసోంలో వరదల కారణంగా ఇప్పటివరకు పది మంది మరణించారు. 20కి పైగా జిల్లాల్లో నాలుగు లక్షలకు పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. ఏడు ప్రధాన నదులు పొంగిపొర్లుతున్నాయి. రాష్ట్రం, పొరుగు ప్రాంతాలలో కొనసాగుతున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, నదీ తీర ప్రాంతాలలో నివసించే ప్రజలకు పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

# జెఇఇ అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్‌గా రజిత్ గుప్తా

బాలికల విభాగంలో ప్రథమ ర్యాంక్ సాధించిన దేవ్ దత్తా

54,378 మంది అర్హత సాధించిన విద్యార్థులు

ఫలితాలు విడుదల చేసిన కాన్పూర్ ఐఐటి





**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రతిష్ఠాత్మకంగా ఉన్న ఐఐటిల్లో బిటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బిఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఢిల్లీ జోన్‌కు చెందిన రజిత్ గుప్తా టాప్ ర్యాంక్ సాధించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) కాన్పుర్ మే 18వ తేదీన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించింది. పేపర్–1, పేపర్ –2కు కలిపి మొత్తం 1,80,422 మంది పరీక్ష రాశారు. ఫలితాలను సోమవారం వెల్లడించగా, 54,378 మంది అర్హత సాధించారు. అందులో 9,404 మంది బాలికలు ఉన్నారు. కాగా కోటా నివాసి అయిన రజిత్ గుప్తా 360 మార్కులకు గానూ 332 మార్కులు సాధించి కామన్ ర్యాంక్ జాబితాలో (సిఆర్‌ఎల్) టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. బాలికల విభాగంలో ఐఐటి కాన్పూర్ జోన్‌కు చెందిన దేవ్‌దత్తా మార్ఝి 312 మార్కులు సాధించి సిఆర్‌ఎల్‌లో టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జెఇఇ మెయిన్ ప్రవేశ పరీక్ష, ఇది జెఇఇ అడ్వాన్స్‌డ్ అర్హత సాధించే పరీక్ష. ఈ పరీక్ష మొత్తం 116 మంది విదేశీ విద్యార్థులు కూడా హాజరయ్యారు. అందులో 13 మంది మాత్రమే అర్హత సాధించారు. టాప్ ర్యాంక్‌లు సాధించిన వంద మంది విద్యార్థుల్లో బాంబే, ఢిల్లీ జోన్‌కు చెందిన వారు 31 మంది చొప్పున ఉండగా, 23 మంది ఐఐటి హైదరాబాద్‌కు చెందిన వారు. కాన్పూర్ జోన్ నుంచి నలుగురు టాప్ 100 ర్యాంకులు సాధించి వారిలో ఉన్నారు. ఖరగ్‌పూర్ నుంచి ఐదుగురు, రూర్కీ నుంచి ఐదుగురు ఉన్నారు. సీట్ల భర్తీకి ఈసారి ఆరు విడతల జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)2025 కౌన్సెలింగ్ జరగనుంది. ఐఐటి కాన్పుర్ ఇటీవల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జోసా–2025 వెబ్‌సైట్‌లో పెట్టింది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూన్ 9, 11 తేదీల్లో మాక్ సీట్ అలాట్‌మెంట్ 1, 2; జూన్ 12న ఫైనల్ ఛాయిస్ లాకింగ్ జరగనున్నాయి. అనంతరం జూన్ 14న ఒకటో విడత, 21న రెండో విడత, 28న మూడో విడత జోసా కౌన్సిలింగ్ జరగనున్నాయి. ఇక నాలుగు, ఐదు ఆరో విడద కౌన్సిలింగ్‌లు వరుసగా జులై 4, జులై 10, జులై 16 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇక ఈ ఏడాది స్వల్పంగా సీట్ల పెరిగే అవకాశం ఉంది. గత విద్యాసంవత్సరం(2024–25) 23 ఐఐటిల్లో 17,760 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈసారి మద్రాస్ ఐఐటి సహా పలు ఐఐటీల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాయి.

# మిలిటరీ క్యాంప్‌పై విరిగిపడిన కొండచరియలు

ముగ్గురు ఆర్మీ సిబ్బంది మృతి
మరో ఆరుగురు సైనికులు గల్లంతు



**గ్యాంగ్‌టాక్ :** ఈశాన్య రాష్ట్రాల్లో వర్ష బీభత్సం ఏమాత్రం తగ్గలేదు. తాజాగా సిక్కింలోని ఛటేన్ అనే ప్రదేశంలో మిలిటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ముగ్గురు భద్రతా సిబ్బంది మరణించగా.. మరో ఆరుగురి ఆచూకీ గల్లంతైంది. ఈ విషయాన్ని రక్షణశాఖ అధికారులు సోమవారం ధ్రువీకరించారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ముగ్గురి మృతదేహాలను దళాలు గుర్తించాయి. మరో నలుగురు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇక ఆచూకీ గల్లంతైన వారిని కాపాడేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయని అధికారులు తెలిపారు.

ఈశాన్య భారత్‌లో రెడ్ అలర్ట్

ఈశాన్య భారత్‌లోని రాష్ట్రాల్లో నేడు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని పేర్కొంది. దీంతోపాటు ఉరుములు, పిడుగులు పడొచ్చని హెచ్చరించింది. అస్సాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మేఘాలయలో అతి భారీ వర్షాలు పడొచ్చని వెల్లడించింది. పశ్చిమబెంగాల్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఇక జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు తొందరగా రావడం, బంగ్లాదేశ్, మేఘాలయాపై అల్పపీడనం ఏర్పడటం వంటి కారణాలతో ఈశాన్య రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అసోంలో ఆదివారం 7 ప్రధాన నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 20కి పైగా జిల్లాల్లో వరద జలాలతో సుమారు 4 లక్షల మంది ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గువాహటిలో శనివారం 24 గంటల్లోనే 11 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. గత 67 ఏళ్లలో మే నెలలో ఒక్క రోజులో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదే కావడం గమనార్హం. ఇక త్రిపుర రాజధాని అగర్తలలో ఎడతెగని వర్షంతో ఓ వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి చనిపోయాడు. మూడు గంటల వ్యవధిలోనే 20 సెం.మీ.ల రికార్డు వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఆదివారం తెలిపారు.

# విమానాశ్రయంలో అరుదైన పాములు సీజ్

థాయ్ నుంచి సరీసృపాలు
స్మగ్లింగ్



**ముంబయి :** సరీసృపాల జాతికి చెందిన అరుదైన పాములను ముంబయి ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయంలో పట్టుకున్నారు. థాయిలాండ్ నుంచి వస్తున్న ప్రయాణికుడి నుంచి వాటిని సీజ్ చేశారు. కొన్ని రోజుల క్రితమే ఇలాంటి సర్పాలను భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులోనూ సీజ్ చేశారు. కస్టమ్స్ శాఖ అధికారులు తన ఎక్స్ పోస్టులో ఆ సర్పాలకు చెందిన ఫోటోలను రిలీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి మే 31వ తేదీన వచ్చిన ప్రయాణికుడి నుంచి సరీసృపాలను సీజ్ చేశారు. అతని బ్యాగులో ఆ అరుదైన జాతికి చెందిన పాములను గుర్తించినట్లు చెప్పారు. థాయిలాండ్ నుంచి వస్తున్న ప్రయాణికుల్లో .. వారంరోజుల్లోనే ఇద్దరు వ్యక్తుల నుంచి అరుదైన పాములు స్వాధీనం చేసుకున్నారు. ఆగ్నేయాసియా, భారత విమానాశ్రయాల మధ్య స్మగ్లింగ్ నెట్వర్క్ ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ముంబయి కస్టమ్స్ అధికారులు ఆపరేషన్ చేపట్టారు. దాని ద్వారానే అరుదైన జాతులకు చెందిన ప్రాణులను పట్టుకున్నారు. వీటిల్లో స్ఫైడర్ టెయిల్ హార్న్‌వైపర్స్, ఏసియన్ లీఫ్‌టర్టల్స్, పిట్ వైపర్స్ ఉన్నాయి

# గాజాపై ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వం ఇక ఉధృతం

**గాజా :** పాలస్తినాలో యుద్ధాన్ని నివారించేందుకు ఖతార్, ఈజిప్టు దేశాలు ఇప్పటివరకూ చేస్తున్న మధ్యవర్తిత్వ చర్యలను మరింత ఉధృతం చేయనున్నాయి. గాజాలో పరిస్థితులు విషమించడం, భీకర దాడులకు అంతూదరీ లేకపోవడంతోపాటు పాలస్తినా ప్రజలు దాదాపు మరణం అంచులకు చేరుతూ ఉండటంతో మధ్యవర్తిత్వ చర్యలు వేగం పుంజుకుంటున్నాయి. అమెరికా చేప్పుసాయిదా ఒప్పందంపై హమాస్ కొత్త షరతులు విధించింది. ముందుగానే పూర్తిగా కాల్పుల విరమణ జరగాలని, అందకు ప్రతిగా 10 మంది సజీవులైన ఇజ్రాయెలీ బందీలను, మరో 18 మంది మృతదేహాను స్వాధీనం చేస్తామని హమాస్ స్పష్టం చేసింది. అందుకు అమెరికా మధ్యప్రాత్యదౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, నేతన్యాహూ తిరస్కరించారు. ఇదిలా ఉండగా గడచిన 24 గంటల్లో గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 51 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 503 మంది గాయపడ్డారు.

# భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయ్

పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ :** ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్‌కు, అమెరికాకు మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. ఈ ఒప్పందం విషయమై ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ చర్చల్లో పాల్గొన్న సమయంలోనూ మాట్లాడుకున్నారని తెలిపారు. వాణిజ్యం విషయంలో రెండు దేశాలు కలిసి పని చేయాలనే భావనతో ఉన్నాయని గోయల్ చెప్పారు. ఈ సమస్యను ఇరుదేశాలు ద్వైపాక్షికంగా పరిష్కరించుకుంటాయన్నారు. ఇరుదేశాల మధ్య ప్రతిపాదిత, మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌ను సందర్శించనుందని తెలిపారు. జూన్ చివరికి ఇరుదేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై అంగీకారం కుదిరే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గత నెలలో వాషింగ్టన్‌లో అధికారులతో చర్చలు జరిపారని గోయల్ తెలిపారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో అధికారిక పర్యటనలో ఉన్న గోయల్ ఆ దేశంతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను పెంచుకోవడానికి అక్కడి నాయకులు, వ్యాపార ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై ఉన్న 25 శాతం సుంకాలను జూన్ 4 నుంచి రెట్టింపు చేస్తామని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. అయితే దీనివల్ల భారతీయ ఆటో మొబైల్‌భాగాల ఉత్పత్తుల ఎగుమతిదారులపై, ఉక్కు పరిశ్రమల రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరించారు. దాంతో అగ్రరాజ్యానికి చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నామన్న విషయాన్ని భారత్ ప్రపంచ వ్యాణిజ్య సంస్థ దృష్టికి తీసుకెళ్లింది. భారత స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులకు ఇస్తున్న రాయితీలను నిలిపివేసి, దిగుమతి సుంకాలను పెంచనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రపంచ వ్యాణిజ్య సంస్థ యూఎస్‌కు నోటీసులు పంపగా వాటిని అగ్రరాజ్యం తిరస్కరించింది.

# ఇంకా ప్రజల వద్ద రూ.6,181 కోట్ల రూ.2వేల నోట్లు : రిజర్వ్ బ్యాంక్



**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రూ.2000 నోట్లపై కీలక ప్రకటన చేసింది. రూ.2 వేల నోట్లు పూర్తిస్థాయిలో మాకు చేరలేదని చెప్పింది. ప్రజల వద్ద ఇంకా రూ.6,181 కోట్ల వి లువైన రూ.2000 నోట్లు ఉన్నాయని పేర్కొంది. 2023 మే 19 నాటికి చలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.26 శాతం తిరిగి వచ్చాయని ప్రకటించింది. రూ. 2000 నోట్లను ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో మార్చుకోవచ్చని ఆర్‌బిఐ అవకాశం కల్పించింది. రూ.2 వేల నోట్లను 2023 మే 19న ఆర్‌బిఐ రద్దు చేసింది. 2023 అక్టోబర్ 7వ తేదీ వరకు బ్యాంకులో మార్చుకోడానికి, డిపాజిట్ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2023 అక్టోబర్ 9నుంచి ఆర్‌బిఐ ఇష్యూ కార్యాలయాల్లో రూ. 2000 వేల నోట్లను మార్చుకోడానికి అవకాశం కల్పించింది. వీటిని వ్యక్తుల, సంస్థల పేరుతో నేరుగా ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత ఇండియాలో ఉన్న పోస్టాఫీసుల నుంచి నోట్లను ఆర్‌బీఐకి పంపించే వారి ఖాతాల్లో నగదు క్రెడిట్ అయ్యే అవకాశం కల్పించింది.

# ఓఖ్లాలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై జులైలో సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** దేశరాజధాని న్యూఢిల్లీలోని ఓఖా గ్రామంలో అనధికారికంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేత ప్రతిపాదనకు సంబంధించిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వచ్చేనెలలో విచారణ జరుపుతుంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేస్తుంది. ఓఖా గ్రామంలో చట్ట నిబంధనలకు అనుగుణంగా అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ఢిల్లీడవలప్‌మెంట్ అథారిటీకి సుప్రీంకోర్టు గతనెల ఏడో తేదీన ఆదేశించింది. ఈ ఆదేశాలపై పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే సుప్రీంకోర్టుకు హాజరై విజ్ఞప్తి చేశారు. ''మేం ఇచ్చిన ఉత్తర్వుల గురించి మాకు తెలుసు, మేం ఇక ఏమీ చెప్పదలచుకోలేదు, మేం తగిన ఉత్తర్వులు జారీ చేయమంటారా?లేక జులైలో జారీ చేయమంటారా? ఈ విషయం మీకే వదిలేశాం అని ధర్మాసనం ప్రశ్నించింది. జులైలో ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పుడు ఇచ్చినా పెద్ద తేడా ఏమీ ఉండదని హెగ్డే పేర్కొన్నారు. ఈ కేసు మరోసారి విచారణకు వచ్చిన తర్వాత కోర్టు ఈ కేసును జులైకి వాయిదా వేసినట్లు హెగ్డే చెప్పారు. ఢిల్లీలో ప్రభుత్వ ప్రాంతాలలో, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు జరగడంపై 2018లో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారన్న పిటిషన్‌పై ధర్మాసనం తర్వాత విచారణ జరిపింది. అక్రమనిర్మాణాలలో ఉన్నవారంతా ఖాళీ చేయాలని డిడిఎ ఇటీవల నోటీసులు జారీ చేసింది.

# దోషికి 30 ఏళ్ల జైలు శిక్ష

అన్నా యూనివర్సిటీ లైంగిక దాడి
కేసులో సంచలన తీర్పు

**చెన్నై :** గతేడాది తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన దేశ వ్యాప్తంగా సంచలన రేపిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దోషిగా తేలిన జ్ఞానశేఖరన్‌కు శిక్ష ఖరారు చేసింది. దోషికి 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ రాజలక్ష్మి తీర్పు వెలువరించారు. శిక్షతోపాటు రూ.90,000 జరిమానా కూడా విధించారు. కాగా, గత వారం ఈ కేసును విచారించిన చెన్నైలోని మహిళా కోర్టు జ్ఞానశేఖరన్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. చార్జిషీట్‌లో పేర్కొన్న మొత్తం 11 అభియోగాల్లో అతడు దోషిగా తేలాడు.ఈ కేసు విచారణ సందర్భంగా మహిళా కోర్టు జడ్జి రాజలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని అభియోగాల్లో దోషిగా తేలినందున జ్ఞానశేఖరన్‌కు కచ్చితంగా తీవ్రమైన శిక్షపడాలని అన్నారు. అయితే జ్ఞానశేఖరన్ మాత్రం తనకు తక్కువ శిక్ష విధించాలని కోర్టును కోరాడు. తాను వృద్ధురాలైన తన తల్లితోపాటు, ఎనిమిదేళ్ల కుమార్తె బాగోగులు చూసుకోవాల్సి ఉందని, కాబట్టి తనకు తక్కువ శిక్ష విధించాలని అభ్యర్థించాడు. అన్నా యూనివర్సిటీ పరిసరాల్లో బిర్యానీ పాయింట్ నడుపుతున్న జ్ఞానశేఖరన్ గత ఏడాది డిసెంబర్‌లో 19 ఏళ్ల విద్యార్థినిపై క్యాంపస్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. వర్సిటీలో సెకండియర్ చదువుతున్న విద్యార్థినిపై గతేడాది డిసెంబర్ 23న ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ వెనుకవైపు ఏకాంతంగా ఉన్న సమయంలో నిందితుడు అక్కడికి వెళ్లి వారిని వీడియో తీశాడు. బాధితురాలి స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ఆ ఘటనను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. విషయం బయటకుచెబితే వీడియో బయటపెడుతానని బ్లాక్‌మెయిల్ చేశాడు. అయినా బాధితురాలు భయపడకుండా తన స్నేహితుడితో కలిసి ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు అప్పట్లో సంచలనంగా మారింది. రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. ప్రభుత్వం మహిళల రక్షణలో విఫలమైందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే పోలీసులు ఘటనపై విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. జ్ఞానశేఖరన్‌పై మొత్తం 11 అభియోగాలు మోపారు. అన్ని అభియోగాల్లోనూ అతడిని దోషిగా తేల్చిన మహిళా కోర్టు.. ఇవాళ శిక్ష ఖరారు చేసింది.

## దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సోమవారం కేవలం 15 మంది ఫిర్యాదుదారులు మాత్రమే ఫిర్యాదులను సమర్పించగా, ఆ ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఫిర్యాదును పంపిస్తూ సాధ్యమైనంత త్వరగా ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫిర్యాదుదారుకు పరిష్కారాన్ని తెలియజేయాలని, ఒకవేళ ఫిర్యాదు పరిష్కారం కాకపోతే ఎందుకోసం కాలేదో ఆ వివరాలను సైతం తెలియజేయాలని, అలాగే కలెక్టర్ కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి సైతం వెంటనే ఫిర్యాదు పరిష్కారం పై తెలియజేయాలని చెప్పారు మండల, గ్రామస్థాయిలో సైతం ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఆమె ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, తదితరులు ఫిర్యాదులను స్వీకరించారు.

## చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పరిధిలోని రాయిరిలో మినీ శిల్పారామంను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు కలసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పచ్చదనంగా శిల్పారామంను చూసి ముఖ్య అతిథులు సంతోషం వ్యక్తం చేశారు. చేనేత హస్త కళాకారులకి యాదగిరిగుట్టలో ఒక వేదిక దొరకడం చాలా ఆనందంగా ఉందని కొనియాడారు. గుట్టకు వచ్చే సందర్శకులు శిల్పారామంకు కూడా విచ్చేసి చేనేత హస్తకలకారులను ప్రోత్సహించవలసిందిగా వారు కోరారు. అనంతరం బోటింగ్‌ను తిలకించారు.



## ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి

### రూ. 7.61కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత జిల్లా విద్యుత్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రూ.7.61 కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత జిల్లా విద్యుత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్, టిజిఎస్ఎస్‌డిసిఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు లతో కలిసి ప్రారంభించారు. జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా సాగు చేస్తున్నందున రైతులకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా చేయాలని, వర్షాలు, పకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎస్ఈ ఫ్రాంక్లిన్‌ని తన కుర్చిలో మంత్రి కూర్చోబెట్టి రైతుల పట్ల మంచిగా ఉండాలని సూచించారు. వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డీవో వేణుమాదవ్, ఈఈ కృష్ణారెడ్డి, డిఈ శ్రీనివాసులు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎఇ శేఖర్ పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి



**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఎగరవేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్రం సిద్దించాక పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని కాంగ్రెస్ ప్రజా పాలనలో పేరుతో అధికారంలోకి రావడం జరిగిందని ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేలా ప్రజా పాలన సాగాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మైనోద్దిన్, పట్టణ సహాయ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్, శాఖ కార్యదర్శులు శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

## ఐఐటి, జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025లో జయ విద్యార్థుల విజయభేరి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ప్రతిష్టాత్మకమైన ఐఐటి, జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షల్లో సూర్యాపేట పట్టణంలోని జయ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో విజయభేరి మ్రోగించారు. 13 మంది విద్యార్థులు ఐఐటితో పాటు జాతీయ స్థాయి కాలేజీ సీట్లను సాధించారు. కళాశాలకు చెందిన శ్రీతేజశ్రీ 1505 ర్యాంకు, సిహెచ్ అన్వూత శ్రీ 2040, జి.మే నక 2146, టి.అమూల్య 4877, డి.లాస్య 5766, డి.జగదీష్ రాజు 8076 ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జయ కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు జ్యోతి, జల్లా పద్మ అభినందించారు. విజయానికి కారకులైన అధ్యాపక బృందానికి, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఆర్ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన సపావథ్ పవన్‌కు ఆలిండియా స్థాయిలో 204 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అదే విధంగా బర్మావత్ సుమన్‌కు ఆలిండియా స్థాయిలో 1049 ర్యాంకు వరించింది. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ అధ్యాపక బృందం కలిగి ఉండి క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన వల్లే ఈ ర్యాంకులు సాధ్యం అయ్యాయన్నారు. ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సిఈఓ సురేందర్ రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, డీన్ కిషోర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు,ఏఓ సరితా రెడ్డి అధ్యాపకులు,వర్ధన్,శ్రీను,ప్రసన్న విద్యార్థులను అభినందించారు.

## ఐఐటి అడ్వాన్స్‌లో కెఎన్ఎన్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెలువడిన ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ విద్యార్థులు బి.మోహిత్‌రాజానాయక్ 19వ ర్యాంకు, డి.ఆనంద్ 1840వ ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఫలితాలతో నల్లగొండ జిల్లాలోనే ఐఐటీలో కేఎల్ఎన్ మేటి అని రుజువైందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థిని మోహిత్‌రాజానాయక్‌ను, ఆనంద్‌ను కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌తోపాటు, డైరెక్టర్స్ నరేందర్‌రెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

# సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ దిక్సూచి

### యువతే ప్రజాప్రభుత్వ నిర్మాతలు
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిలాగా ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పి నర్సింహా, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి, తెలంగాణ తల్లికి, జాతీయ నాయకులకు పుష్పాంజలి ఘటించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి పదకొండు సంవత్సరాలు నిండాయని, ఈ రోజు రాష్ట్రమంతటా తెలంగాణ అవతరణ వేడుకలను వైభవంగా జరుపుకుంటున్నారని, సూర్యాపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లాలో 22వేల యూనిట్ల ఇందిరమహిళ శక్తి పథకానికి పనులు పురోగతిలో ఉన్నవన్నారు. 6408 సభ్యులతో 181 కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో క్యాంటిన్‌ను మహిళ స్వయం సహాయక సంఘానికి ఇవ్వడం జరిగిందన్నారు. 726 మహిళ సంఘాలకు కుట్టుకేంద్రాలు ద్వారా స్కూల్ యూనిఫాం కుట్టించి 82 లక్షల ఉపాధిని కల్పించడం జరిగిందన్నారు. స్త్రీ నిధి పథకం ద్వారా 2024/25 ఆర్థిక సంవత్సరానికిగానూ 77కోట్ల రుణం అందించి జీవనోపాదుల లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపుకు దృష్టిసారించి 64 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 5116 స్వయం సహాయక సంఘాలకు రూ.544 కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజీ మంజూరు చేసిందన్నారు. పేదరిక నిర్మూలన ద్వారా 2025/26 సంవత్సరానికి 883 ఎస్సీ, ఎస్టీలకు రూ.105 కోట్ల టార్గెట్‌గా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గరిడేపల్లి, చిలుకూరు, తిరుమలగిరిలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక్కో స్కూల్‌కు 200 కోట్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. హుజూర్‌నగర్‌లో సీతరామగుట్ట వద్ద యువత ఉపాధికోసం శిక్షణ ఇప్పించేందుకు ఏడాది బడ్జెట్‌లో 1435 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు బరోసా కింద ప్రతి ఎకరానికి ఏడాదికి 12వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 2,29,965 ఎకరాలకు, మూసి ప్రాజెక్టు కింద 15,234 ఎకరాలు, శ్రీరాంసాగర్ రెండోదశ ప్రాజెక్టు ద్వారా 2,13,175 ఎకరాలకు, 1036 చెరువులు, కుంటల పరిధిలో 69385 ఎకరాలు, 54 ఐడిసి ఎత్తిపోతల పథకం కింద 54713 ఎకరాలు సాగు చేయడం జరుగుతుందన్నారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌడ సభ్యులకు 10 మందికి కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. మహిళ స్వయం సహాయక గ్రూపులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ద్వారా 169 స్వయం సహాయక సంఘాలకు రూ.23కోట్ల 73 లక్షల బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. దీనికి ముందు అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవో వేణుమాదవ్, డిఆర్‌డివో వివి అప్పారావు, డిఎఫ్‌వో సతీష్‌కుమార్, పశుసంవర్ధక అధికారి శ్రీనివాస్, కల్చరల్ టీమ్ శంకర్, అశోక్, రమేష్‌కుమార్, సిపివో శంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ఆపినా ఆగదు

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ అభివృద్ధి ఎవరూ ఆపినా ఆగదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆయన పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కళాభారతి వరకు జాతీయ జెండాలు, బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి భారీ ర్యాలి నిర్వహించారు. అనంతరం కలాభారతి వద్ద అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా మల్టీ పర్పస్ సిబ్బందికి హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ చెక్కులను అందచేశారు. పట్టనంలో చెత్త సేకరణకు మంజూరైన 12 టాటా ఏస్, ఆరు ట్రాక్టర్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# పోరాటాల పొద్దుపొడుపు నల్లగొండ

### జిల్లా సర్వోతోముఖాభివృద్ధికి కలిసి పని చేద్దాం : మంత్రి కోమటిరెడ్డి

### రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్





**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** నల్లగొండ అంటే నమ్మకానికి ప్రతిరూపం..పోరాటాల పొద్దుపొడుపు..అలాంటి నల్లగొండ జిల్లాలో పుట్టడం సంతోషకరం..జిల్లాను సర్వోతోముఖాభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు,అధికారులందరూ కలిసి పని చేద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం ఆయన నల్లగొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్ లతో కలసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.అనంతరం జిల్లా ప్రజలకిచ్చిన సందేశంలో తెలంగాణ రాష్ట్రం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో మంది పోరాటాల వల్ల తెలంగాణ సాధించుకోగలిగామని,తాను సైతం తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయడం జరిగిందని, ప్రజల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరున పేదల సంక్షేమం కోసం సమగ్ర పాలసీలను రూపొందించిందని, ప్రపంచ స్థాయిలో తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఆడబిడ్డల సంక్షేమంలో భాగంగా ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు నాలుగు కోట్ల అరవైనాలుగు లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయగా ,203 కోట్ల 78 లక్షల రూపాయలు లబ్ధి చేకూర్చడం జరిగిందని రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ముందు మంత్రి క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాల నుంచి అమరులకు నివాళులర్పించారు.ఆదేవిదంగా బాల భవన్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.అభివృద్ధిని తెలిపే విధంగా శకటాల ప్రదర్శన ,స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన ఆరుగురికి జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వర్గాలకు కొమ్ముకాస్తున్న బిజెపి

### సిపిఐ జిల్లా కార్యదర్శి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పారిశ్రామిక వర్గాలకు కొమ్ముకాస్తూ శ్రామిక వర్గాలను అణగదొక్కే కుట్ర చేస్తుందని అందులో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం సిపిఐ గట్టుప్పల 2వ మండల మహాసభ మండల పరిధిలో గల వెల్మకన్నె గ్రామంలోని మాదగోని యాదయ్య ప్రాంగణంలో నిర్వహించారు.ఈ మహాసభ కారింగు శ్రీను అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలతో ప్రజాధనం దోచుకుతిన్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రజెక్టులో కెసిఆర్ దోషిగా నిలబడడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించే ప్రకటనలతో కేసిఆర్, కవిత ఇద్దరు కలిసి డ్రామాలాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నిష్పక్షపాతంగా అమలు పర్చాలని కోరారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ,రేషన్ కార్డులు రాజీవ్ యువ వికాస్ తదితర పథకాల అమలులో నిష్పక్షపాతంగా పేదలకు అందే విధంగా చూడాలన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిర్పారి వెంకటేశ్వర్లు , నల్పరాజు రామలింగయ్య , జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య ,చాపల శ్రీను , గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ , ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షకార్యదర్శులు చలం పాండురంగారావు , జగన్ ,ఏఐవైఎఫ్ నాయకులు గడ్డం నవీన్ , కట్ట దశరథ , రాపోలు సత్తయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకోను

### ఇండ్ల భూమిపూజలో ఎమ్మెల్యే రాజ్ గోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నా రు. సోమవారం మండలంలోని చీకటిమామిడి,కొంపెల్లి గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంకు భూమి పూజ చేశారు. చీకటిమామిడి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల 21 మంది లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పేద ప్రజలకు ఉపయోగపడే విధం గా నిర్మాణాలు జరగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేదిరి విజయేందర్ రెడ్డి,నారబోయిన రవి,భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, జాల వెంకన్న పాల్గొన్నారు.

## ఐఐటి, జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో ప్రగతి ప్రతిభ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన తో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని ప్రగతి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ప్రకటించిన ఐఐటి, జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వివిధ క్యాటగిరిలలో ర్యాంకులు సాధించిన తమ కళాశాల విద్యార్థి ఆర్. క్రిష్ణ 480 వ ర్యాంకు సాధించి కళాశాల టాపర్గా నిలిచినాడనీ తెలిపారు .అదే విధంగా కళాశాలకు చెందిన డి. చరణ్ 1569, డి. చరణ్ 2960, కె. సమీరా 4122 ర్యాంకులు సాధించి ప్రగతి జూనియర్ కళాశాల ది బెస్ట్ కళాశాల అని నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశిధర్రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైజింగ్ -2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు

### రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి





**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుఖేందర్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిసిపి అక్షాంష్ యాదవ్‌తో కలసి పోలీసు వందనం స్వీకరించారు. తెలంగాణ తల్లి, మహనీయుల చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ గావించారు. తదుపరి జిల్లా ప్రగతి నివేదికను ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరుగుచున్న వేడుకలకు విచ్చేసిన జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా న్యాయమూర్తులకు, స్వాతంత్ర్య సమర యోధులకు, అధికారులకు, అనధికారులకు, పాత్రికేయులకు, విద్యార్థినీ, విద్యార్థులకు ,జిల్లా ప్రజలందరికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం, ఆరు దశాబ్దాల పోరాటం, అమరవీరుల త్యాగాల ఫలంగా 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచస్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 67 మంది విద్యార్థిని, విద్యార్థులకు నిర్మాణ సంస్థ (CSR) రాజేష్ అనూష, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుండి కైలాస్‌ల వారి సహకారంతో 67 మందికి సైకిళ్లను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి , అడిషనల్ డిసిపి లక్ష్మీ నారాయణ, జెడ్పీ సిఈఓ శోభా రాణి, ఏసిపి రాహుల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు, ఆర్డీవో కృష్ణా రెడ్డి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## బంగారు తెలంగాణలో భాగస్వాములు కండి

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియాలో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా పివి కాలనీ, రామాలయం కూడలిలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెస్సార్ జయశంకర్ విగ్రహానికి, అలాగే డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.అమరవీరుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు, కొమరం భీమ్, చాకలి ఆయిలమ్మ విగ్రహాలకు కార్యక్రమ ముఖ్య అతిథి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఇతర గౌరవ అధికారులు, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం యూనియన్ల ప్రతినిధులు నివాళులు అర్పించారు. అనంతరం జిఎం కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో భాగంగా గాంధీజీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రసంగిస్తూ సంస్థ మన రాష్ట్ర ప్రగతిలో, రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న విషయం మనందరికీ తెలుసునన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. ప్రకృతిని రక్షిద్దాం



**ప్రజాపక్షం/పినపాక:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎఫ్ఆర్ఒ తేజస్వి తన సిబ్బందితో కలిసి జానంపేటసమీపంలో గల ఆర్ ఎఫ్ ఏరియాలో ఉన్న ప్లాస్టిక్ ను తొలగించారు.ఆమె మాట్లాడుతూ ప్రకృతి మన జీవితానికి ఊపిరిలాంటిది అన్నారు. పచ్చదనం లేకపోతే మన ఊపిరి ఆగడం ఖాయం అన్నారు. గాలిలో తేమ లేకపోతే జీవం ఉండదు. డిఆర్ఓ వెంకటేశ్వరరావు, ఎఫ్ ఎస్ ఓ లు, ఎఫ్బి ఓలు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని రంగాలలోనూ తెలంగాణ ఫస్ట్



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ మండె వీరహనుమంతరావు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా జాతీయ జేండా ఆవిష్కరణ చేసారు. ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో మొదటి స్థానంలో మన తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. సొసైటి ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు పంపిణి సేవలు అందజేస్తున్నామన్నారు. మార్కెటింగ్ కమీటి మాజీ డైరెక్టర్ భూక్య రాంబాబు, సొసైటి డైరెక్టర్ తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వర రావు, సంఘ సిబ్బంది పాల్గోన్నారు.

## రాష్ట్ర సాధనలో సిపిఐది కీలకపాత్ర

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ అమర వీరుల ఆశయాల సాధన దిశగా అంతా అడుగులేద్దామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాల్వంచలోని చంద్రా రాజేశ్వరరావు భవన్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళ్లర్పించారు. అనంతరం విశ్వనాథం మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు గుర్తించి స్వరాష్ట్రం కోసం చేపట్టిన పోరులు అగ్రభాగన సిపిఐ నిలిచిందన్నారు. ఉధ్యమాన్ని తారా స్థాయికి చేర్చి ప్రజల్లో, ఆ నాటి కేంద్రప్రభుత్వంలో కదలికి తెచ్చింది కూడా సిపిఐనే అని గుర్తు చేశారు. సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, చెరుకూరి శేఖర్, మన్నెం వెంకన్న, నిమ్మల రాంబాబు, సుంకర రంగారావు, జకరయ్య, ఎస్ఏ రెహమాన్, కరీం, బానోత్ రంజిత్, సాయిలు శ్రీను, ఆవుల సతీష్, చంచలాపూరి శ్రీను, కొంగర అప్పారావు, భూక్యా చందూలాల్ ఎర్రగడ్ల ప్రభాకర్, ఆదినారాయణ, రామాచారి, బిల్లా రంగయ్య, ఐలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుల పోరాటం వల్లే తెలంగాణ

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య**




**ప్రజాపక్షం/మణుగూరు:** ఎందరో త్యాగ ధనుల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా జాతీయ జెండాను బి. అయోధ్య ఎగురవేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో అనేకమంది విద్యార్థులు, పోరాట నాయకులు అమరులైనారని, మలిదశ ఉద్యమం లో అనేకమంది సుమారు 1200 మంది విద్యార్థులు త్యాగాలు చేశారని, సకలజనులు తెలంగాణ రాష్ట్రం కోసం ఉవ్వెత్తున పోరాటం చేశారని వారు గుర్తు చేశారు. అనేక ఉద్యమాలు నిర్వహించామని, మణుగూరు నుండి ఖమ్మం వరకు పాదయాత్ర కొనసాగించామని, నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు, పార్టీ ప్రజా సంఘాల ద్వారా పోరాటాలు పెద్ద ఎత్తున చేశామన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్ర మరువలేనిదన్నారు. సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడారు.జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సొందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, కార్యవర్గ సభ్యులు తోట రమేష్, జక్కుల రాజబాబు. కొత్తపల్లి సీతారాములు, మహిళ సమైక్య మండల కార్యదర్శి దుబ్బాక నిర్మల, కోడిమల సుజాత, ఎస్డీ. ఉమర్, బొజ్జ సదానందం, బోసెట్టి సంపత్, శ్రీకాకుళం వీరమల్లు, కోటయ్య వంగ పాపయ్య, లక్ష్మ య్య, లింగస్వామి, రాజు, రామారావు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవవేడుకలను రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి పురందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్వేత, పోలీస్ స్టేషన్‌లో సిఐ ఉస్మాన్‌షరీఫ్ లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆవిర్భావ వేడుకల సందర్భంగా జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండల పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా।। పి. శ్రీజ తెలిపారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీతో పాటు అన్ని అభివృద్ధి సం క్షేమ కార్యక్రమాలపై అధికారులు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ, ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం నేతృత్వంలో రైజింగ్ తెలంగాణ



**మహిళల కోసం ఇందిరా మహిళా శక్తి**

**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైజింగ్ తెలంగాణగా రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పాలన సాగుతుందని అభివృద్ధి పథంలో ఖమ్మంజిల్లాను అగ్రపదాన నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సోమవారం ఖమ్మం పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అంతకు ముందు తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలోనే అగ్ర స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. సమగ్ర పథకాలకు రూపకల్పన చేసి ప్రపంచ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు పారదర్శక సుపరిపాలన అందిస్తున్నామన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, గ్రీన్ ఎనర్జీ, పారిశ్రామికాభివృద్ధి, టూరిజం పాలసీలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి 55వేల ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఈ ప్రభుత్వం దన్నుగా నిలిచిందన్నారు.



2030 నాటికి 20వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆడబిడ్డలు ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు మహిళలకు రూ.167.89 లక్షల రూపాయలు ఆదా చేశామని ఆయన తెలిపారు. సిలెండర్ పై రూ. 500లు సబ్సిడీ ఇస్తున్నామని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారునికి ఐదు లక్షలు అందజేస్తామని ఇందిరామ మహిళాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్నామన్నారు. మధిర నియోజక వర్గంలో ఇందిరా డెయిరీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేస్తున్నామని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించామని తెలిపారు. సన్న రకం ధాన్యానికి రూ 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందని ఆయిల పాం సాగును పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజీవ్ కెనాల్ ద్వారా 25 వేల ఎకరాలను స్థిరీకరణ చేశామని యాతాలకుంట టన్నెల్ , పాలేరు లింక్ కెనాల్ పనులు వేగంగా చేస్తామని ఆయన తెలిపారు. రఘునాథపాలెం మండలంలో సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. బోనకల్ మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఖమ్మంలో ఖిల్లా రోప్‌వే, పాలేరు లేక్ పార్క్, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సిపి సునీల్ దత్, ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డిఎఫ్‌వో సిద్దార్థ విక్రం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అంకమ్మతల్లి జాతర



**ప్రజాపక్షం/సుజాతనగర్:** భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారామైయున్న కొర్లపాటి అంకమ్మ దేవి మహా లక్ష్మ మ్మ జాతర మ హోత్సవం గత వారం రోజుల నుండి ఎం తో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకుని సోమవారంతో ముగిసింది. గ్రామంలో ప్రతిరెండేళ్లకుఒకసారి గ్రామస్తులంతా సమన్వయంతో అంకమ్మ మహాలక్ష్మమ్మ జాతరను నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు చొప్పకట్ల జనార్ధన్ శర్మ శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబిర్ పాషా సిపిఐ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ఆదేశాలతో చుంచుపల్లి సిఐ రాయల వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్సై మాలోత్ రమాదేవి, చుంచుపల్లి ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

## అన్ని రంగాల్లోనూ తెలంగాణ దూసుకుపోతోంది..

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**అమరులకు నివాళి, జాతీయపతాకం ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోరాడి సాంధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దూసుకుపోతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నా రు. రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని ప్రగతి మైధానంలో సోమవారం జరిగాయి.ఆయన ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్‌రాజ్‌తో కలిసి అమర వీరులకు నివాళ్లర్పించారు. అనంతరం జాతీయజెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోని అందరి చూపును ఆకర్షిస్తోందన్నారు. ఇదంతా అమరుల త్యాగఫలమే అని, వారి త్యాగాలు చిరస్మరణీయం అన్నారు.తెలంగాణనుప్రపంచ అగ్రశ్రేణి రాష్ట్రంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైజింగ్ 2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగా అర్హతగల పేదలందరికి సంక్షేమ పథకాలను దరిచేర్చడం, సుపరిపాలన అందించడం వంటి చర్యలకు పూనుకుంటుందన్నారు.సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు కొరకు 3123 ఎకరాల భూ సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. పెద్దవాగు, కిన్నెరసాని, తాలిపేరు ఆయకట్టు 34060 ఎకరాలకు నీటి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు.ముందుగా తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ, రవాణాశాఖ, పశుసంవర్ధకశాఖ, అగ్నిమాపక శాఖ, వైద్యశాఖలు చేపడుతున్న పలు కార్యక్రమాలపై చేసిన శకటాలను ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం, విత్తుకొద్దీ పంట అనే నినాదంతో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. సమరయోధులను మంత్రి గౌరవంగా సన్మానించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, తహశిల్దార్ పుల్లయ్యతో పాటు అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జెఇఇలో రెజొనెన్స్ ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** దేశ వ్యాప్తంగా నిర్వహించిన జెఈఈ అడ్వాన్స్ ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థుల జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. సోమవారం వెలువడిన ఫలితాలలో ఐఐటి, జెఈఈ విభాగం నందు టి. స్నేహమృదుల 89, బి. రాకేష్ 230, బి. అభినాయక్ 342, జే. మదన్ 371, జి. సురేష్ 577, బి. హర్షవర్ధన్ 906, బి. శ్యామ్ 1860, ఆర్. గురుప్రసాద్ 2097, గోపీచంద్ 2275, జి. దివ్యతేజ 2847 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు లు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధన అనుభవం కలిగిన మేనేజ్‌మెంట్ కారణమన్నారు. ఇంటర్‌తో పాటు జెఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణను ఇవ్వడం ద్వారా అద్భుత ఫలితాలను సాధించామన్నారు. సాధారణ విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను, తల్లిదండ్రులను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు

**హవేలీ మహాసభలో బాగం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ రాజకీయాలు సంక్లిష్ట స్థితిలో ఉన్నాయని మతం, ఆర్థిక వ్యవహారాలు ఈ దేశ రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. మోడీ విధానాలు ప్రజలను మోసం చేస్తున్నాయని మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఖానాపురం హవేలీ ఏరియా మహాసభ సోమవారం స్థానిక సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. మహాసభకు ముందు సిపిఐ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. నానబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడారు.ఉగ్రవాదులు దాడి చేసి శత్రుదేశం కవ్వించిన రాజీపడ్డారు కానీ దేశ పౌరులుగా ఉంటూ ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారితో మాత్రం శాంతి చర్చలు లేవంటూ ఊచకోతకు పాల్పడి నరహంతక ప్రభుత్వంగా రూపుదిద్దుకుందని ఆయన తెలిపారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరదా నర్సింహారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## 'హార్వెస్ట్'కు ఉన్నతశ్రేణి ఫలితాలు



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** ఎన్‌టిఏ నిర్వహించిన జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నతశ్రేణి ఫలితాలు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. సోమవారం ప్రకటించిన ఫలితాలలో వివిధ కేటగిరిల్లో తమ కళాశాల విద్యార్థులు బి. సాయిచరణ్ 83, బి. సంజయ్ 207, ఎం. నాగయశ్వంత్ 393, బి. సిద్దార్థ్ 395, డి. శ్రీనివాస్ గౌతమ్ రెడ్డి 686, వి.చరణ్‌గోపాలస్వామి 1092, బి. మోక్షజ్ఞ 1159, పి.క్రిష్‌సాత్విక్ 1163, ఎ. గణేష్ 1195, ఎన్‌సిహెచ్ జశ్వంత్ సాయి 1268, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 2108, పి.ప్రేమవర్ధన్ 5078, వి.సాయిదీపక్ 6001, పి.శ్రీనినాథ్ 14629 ర్యాంక్ సాధించినట్లు వారు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలనిఆకాంక్షించారు.

# టివి చౌదరి సేవలు అపూర్వం



**ఐదవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి**

**ప్రజాపక్షం/ఖమ్మం:** తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమ విస్తృతి కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన టివి చౌదరి ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. టివి చౌదరి ఐదవ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న టివి చౌదరి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. సుదీర్ఘ కాలం పాటు జిల్లా కార్యదర్శిగా సేవలు అందించిన ఆయన కమ్యూనిస్టు పార్టీ స్వర్ణయుగంలో పని చేశారన్నారు. నలుగురు శాసనసభ్యులు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో టివి చౌదరి జిల్లా కార్యదర్శిగా పనిచేశారని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం టివి చౌదరి పరితపించారని ఆయన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా రైతాంగ సమస్యలపై టివి చౌదరి పోరాడారన్నారు. తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నినదించిన టివి చౌదరి ధన్యజీవి అన్నారు.

**జాతీయ జెండా ఆవిష్కరణ :**

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**అమరులకు నివాళి :**

సిపిఐ ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఖమ్మం పెవిలియన్ మైదానంలోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగ ఫలితమే నేటి తెలంగాణ అని ఈ సందర్భంగా హేమంతరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు సాంబశివరెడ్డి, తాటి నిర్మల, వీరన్న, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై సిపిఐ పోరు

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదలు, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీ సిపిఐ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్, ద్వారకాపురి కాలనీలలో శాఖల మహాసభలు పాలకుర్తి వీరయ్య, ఎర్ర జాల రాజశేఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దండు మాట్లాడారు. ప్రజా సమస్యలపై మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నెంబర్ రామకృష్ణ మాట్లాడారు. కొరకొప్పుల స్వామి, ఆనంద్, ఎస్ కే షరీఫ్, పహారా,మనీ, రాజేష్,రాంబాబు ఉన్నారు.

## జెఇఇలో 'న్యూవిజన్' ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా ని ర్వహించిన జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల మరోసారి ప్రభంజనం సృష్టించింది. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిల్లో పేరాల ప్రణవ్ 497, కేటగిరిలో అజ్మీరా రోషిక్ మణిదీప్ ఐదవ ర్యాంకుతో ఖమ్మంజిల్లా చరిత్రలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరిలల్లో వెయ్యిలోపు 16మంది ఐదువేల లోపు 65 మంది విద్యార్థులుర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. భూక్యా పీయూష్ వర్ధన్ 102,అజ్మీర్ జిగిష204, అంగోత్ షామ్ 205, భూక్యా యశ్వంత్ 394, గూడె కార్తీక్ సాయి 537, చంద్ర సాయి కృష్ణ 556, గుగులోత్ నాయక్ 888, రామకౌశిక్ 953, పగిడిపల్లి చేతన్ చంద్ర 977, కంసాని మధురహాసిని చౌదరి 1026, భూక్యా శివనాగచైతన్య 1093, పొట్టి మూతి ఠాగోర్ 1151, పల్ల రోహిత్ 1194, బదావత్ అన్మల్ హేమచంద్ర 1297, భూక్యా శ్రీధన్ తేజ్ 1323, బానోత్ కౌశిక్ 1377, ధర్మసోత్ రాహుల్ నాయక్ 1427, వడ్లమూడి అషిష్ 1433, అల్ల హేమంత్ 1683, పండేటి యశస్విన్ 1797, వాంకుడోత్ బిందుబాయ్ 1800, బానోత్ దీపిక 1941, బానోత్ మోహన్‌సాయి లక్ష్మి 1982 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వారు తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ప్రతి ఏడాది ఐఐటిలో 44, ఎన్ఐటిలో 43, ఐఐఐటి, బిగ్‌షాట్ లో 20, ఎంబిబిఎస్‌లో 41 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి విద్యను అభ్యసిస్తున్నట్లు వారు తెలిపారు. రాబోయే నీట్ పరీక్షల్లో కూడా కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులను ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపక బృందం అభినందించారు.

## తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం

ప్రజాపక్షం/పరకాల : తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతున్నదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు అమర ధామం వద్ద నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దశాబ్దాల నిరీక్షణ ఫలితం ఎన్నో ప్రాణ త్యాగాలకు సమాధానం మన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కొట్లాడి తెచ్చుకున్న మన తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ లోని ప్రధాన అంశాలపై బడుగు బలహీన వర్గాల, దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారి యొక్క ఆర్థిక అభివృద్ధితో పాటుగా అదేవిధంగా తెలంగాణ రెవెన్యూ పెంచుతూ అభివృద్ధి,సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. 16వేల కోట్ల మిగులు బడ్జెట్తో ఏర్పడిన రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారన్నారు.ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ స్ఫూర్తిని కాపాడే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు.

## సిఎం చేతుల మీదుగా గ్యాలంట్రీ అవార్డు అందుకున్న పేరూరు ఎస్ఐ

ప్రజాపక్షం/వాజేడు: పేరూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ కు ఉత్తమ సేవల పట్ల తెలంగాణ ప్రభుత్వం గ్యాలంట్రీ అవార్డు ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఇది నిర్వహణలో అంకితభావంతో పనిచేసి వాజేడు, రేగొండ, చిట్యాల, ఏటూరు నాగారంలాలో విధులు నిర్వహించి, ప్రస్తుతం పేరూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎల్లనేని సేవలు అందిస్తున్న గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్కు దక్కిన ఈ పురస్కారం రావడం పట్ల మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/పాలకుర్తి: ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, బీఆర్ఎస్ పార్టీ నాయకుల తాటాకు చప్పుళ్లకు ఇందిరమ్మ రాజ్యంలో భయపడేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాజీవ్ చౌరస్తాలో దర్దేపల్లి రోడ్డు మార్గంలో తెలంగాణ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రాష్ట్రాన్ని ఇచ్చారని స్పష్టం చేశారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని కానీ, తెలంగాణ పాటను కానీ, టీజీ పదాన్ని కూడా ఉచ్చరించలేదని విమర్శించారు. తెచ్చుకున్న తెంగాణ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల్లో నిరుపేదలకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు కన్నీరు తుడిచేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంకా మోసం చేస్తున్నారన్నారు. వారి తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ పార్టీ భయపడేది లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందన్నారు. రాష్ట్రంలో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇస్తుండగా, నియోజకవర్గంలో 3500 ఇండ్లు ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నిధులు తెస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: బీర్ల ఐయిలయ్య



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: తెలంగాణ సమగ్రాభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా రైజింగ్ తెలంగాణ లక్ష్యాలతో ముందుకు పోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకుల సోమవారం జనగామ జిల్లాలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టరేట్లో జరిగిన వేడుకలలో బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్లో భాగంగా పేదల సంక్షేమం, సమగ్ర పాలసీ రూపకల్పన, ప్రపంచ స్థాయి గుర్తింపు, పారదర్శకత, సుపరిపాలన వంటి కీలక అంశాలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. రాష్ట్రంలో కోటీ మంది ఆడబిడ్డలను కోటీశ్వర్లులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, ఆర్టిసిలో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళా శక్తి క్యాంటిన్లు వంటివి చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి తన సహాయ సహకారలు తప్పక ఉంటాయన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. అంతకు ముందు అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. పోలీసులు పరేడ్ నిర్వయించగా బీర్ల ఐలయ్య గౌరవవందనం స్వీకరించారు.


ఈ కార్యక్రమంలో స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్లు రోహిత్సింగ్, పింకేషన్కుమార్, డిసిపి రాజ మహేంద్రనాయక్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డిఓ గోపిరాం, తహాశీల్దార్ హుస్సేన్, డిఈఓ భోజన్న, డీసీడీసీ గౌసియా బేగం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్తో పాటు పలువురు అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్తోనే



ప్రజాపక్షం/నెక్కొండ: పేదవాడి సొంత ఇంటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టిపిసిసి సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ విడుదల అనంతరం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరి పత్రాలను నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డిలు ఇరువురు కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆనాటి వైయస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు చాలా చిన్నగా ఉన్నాయంటూ అల్లుడు వస్తే ఎక్కడ పండుకోవాలంటూ ఎద్దేవా చేశారు కానీ ఒక్క గృహం కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని వారు దుయ్యబట్టారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు పురుడు పోసు కుంటున్నాయని, వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళల మహిళ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరు మృతి



ప్రజాపక్షం/కాటారం: మండలంలోని గంగారం గ్రామంలో అదుపు తప్పి కారు ఇంట్లోకి దూసుకెళ్లి ఇద్దరు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది విరాల్లోకి వెళితే కాళేశ్వరం వెళ్లి వస్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి రహదారి ప్రక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది అక్కడే ఉన్న మదునమ్మ 80 అక్కడికక్కడే మృతి చెందింది,నీలాల బానయ్య 65కు తీవ్ర గాయాలయ్యాయి దీంతో బానయ్యను భూపాలపల్లి ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు.ఈ ఘటనలో ఇద్దరికి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు.పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# వైభవంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ మైదానంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశిస్తూ జిల్లా ప్రగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వంతో సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047ను రూపొందించి ఆ దిశగా పలు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధా రాణితో కలిసి స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఈ సందర్భంగా మంత్రి చేతులమీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలియజేస్తూ ప్రదర్శించిన శకటాలు, ఏర్పాటుచేసిన స్టాల్స్లను మంత్రి సందర్శించారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.అంతకుముందు ఖిలా వరంగల్ మధ్యకోటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన త్యాగధనులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు మంత్రి శ్రీనివాస రెడ్డి, నగర మేయర్ గుండు సుధా రాణి, ఎం ఎల్ సి లు బస్వరాజు సారయ్య, శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్రెడ్డి, కేఆర్ నాగరాజు శాలువాలతో సన్మానించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజ్, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## రైజింగ్ 2047 విజన్తో రాష్ట్ర అభివృద్ధి

### ప్రభుత్వ విప్ డా.రాంచంద్రునాయక్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: తెలంగాణ రైజింగ్ 2047 విజన్తో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్లో ఆయన జాతీయ జండా ఎగురవేశారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్, డిఎఫ్ఓ విశాల్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారి పాల్గొన్న ఈసభలో ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్2047 విజన్లో నాలుగు కీలక అంవాలు ఉన్నాయని, పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సన్మానించారు. మహబూబాబాద్ పట్టణంలోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి కలెక్టరేట్లో జరిగిన జండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/హనుమకొండటౌన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి బాలసముద్రంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో కుటుంబ సభ్యులు,ప్రజా ప్రతినిధులతో కలిసి జాతియ జెండా ఎగురవేశారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో నగర అభివృద్ధి ఏర్పాటు చేసిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని మేయర్ సుధారాణి, కమీషనర్ అశ్విని తానాజీ వాకాడేతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బస్వరాజు సారయ్య, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, స్వర్ణతో కలిసి హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు.

## పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం



### అమరులకు నివాళులు.. పోలీసులకు సేవా పతకాలు

### మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : హనుమకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్స్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో మంత్రి కొండా సురేఖ, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ పరేడ్ను పర్యవేక్షించారు. వివిధ పోలీస్ విభాగాలు ఈ పరేడ్ లో పాల్గొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నూతన పథకాలు ప్రవేశ పెడుతూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్న ప్రభుత్వం ఈ తెలంగాణ ప్రజా ప్రభుత్వం కవులు కళాకారులు ఉద్యమకారులను గౌరవించుకుంటూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు చేస్తున్న ఘనత మన ప్రజా ప్రభుత్వాన్నిదని మంత్రి సురేఖ గారు తెలిపారు. పలువురు పోలీస్ అధికారులకు మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సేవా పతాకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర జిల్లా అధికారులతో పాటు ప్రజలు పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు చేరుకుని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు.

## అధికారులుసేవలు మరువలేము

### మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: ములుగు జిల్లా అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నదని, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న అధికారుల సేవలను ఎన్నటికి మరిచిపోలేమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సోమవారం 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు తంగడి మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం పోలీస్ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్మెంట్ లక్ష్యాలను సాధించడానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పేరుతో ముందుకు సాగుతున్నదని, ఈ డివిజన్ డాక్యుమెంట్ భవిష్యత్తు తెలంగాణకు భగవద్గీతగా మారి తెలంగాణ రాష్ట్ర రూపు రేఖలు మార్చేస్తుందని అభిప్రాయపడ్డారు. రానున్న రోజులలో జిల్లా అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని సీతక్క తెలిపారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శబరీష్, ఏఎస్పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్రావు, ఏఆర్ అదనపు ఎస్పి సదానందం, ఆర్డిఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి, తదితరులు పాల్గొన్నారు.



## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వైద్య సేవలపై సిపిఐ సర్వే

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : కాకతీయ మెడికల్ కాలేజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో రోగులకు వైద్య సేవలు, నిర్వహణ లోపాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం హాస్పటల్ ను సందర్శించి రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్ లో వైద్య సేవల నాణ్యత మేజర్ ఆపరేషన్ల అందుబాటు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది.ఇటీవల ఈ హాస్పిటల్ లో సరైన వైద్యం సేవలు అందడం లేదని, మేజర్ ఆపరేషన్లను నిర్వహించడం లేదని, ఔట్సోర్సింగ్ కార్మికుల కు పిఎఫ్ ఎస్ఐ, ఇతర సౌకర్యాల్లో లోపాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సిపిఐ బృందం రోగులు, సిబ్బందితో చర్చించి సమస్యలను గుర్తించడం జరిగింది. ఇట్టి విషయాలను సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ డిప్యూటీ సూపరెంట్ బాలరాజును, ఆర్ ఎంఓ దీపక్ రెడ్డిని కలిసి పై ఆరోపణలు దృష్టికి తీసికొని రాగా అధికారులు స్పందిస్తూ మేజర్ ఆపరేషన్ జరగకపోవడానికి ప్రధాన కారణం హాస్పటల్ లో సెంట్రల్ ఏసీ లేకపోవడం, ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడం, కొంత లోపం జరిగిందని దీనిపై పై అధికారులకు కూడా విన్నపించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో హాస్పటల్ లో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించినా వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడం జరిగింది. వారం రోజులలో సిపిఐ నాయకులు అందజేసిన సమస్యలపై సంపూర్ణ నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సిపిఐ బృందం వైపు నుండి జిల్లా నాయకులు మద్దేల ఎల్లేష్, వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ సెంట్రల్ ఏ.సి,ఆధునిక పరికరాలు సమకూర్చుకొని మేజర్ ఆపరేషన్లు తక్షణమే ప్రారంభించాలని, లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పోరాటాలు చేయడానికి వెనుకాడేది లేదని అధికారులను డిమాండ్ చేశారు. హాస్పిటల్ను సందర్శించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు మద్దెల ఎలేష్, వేల్పుల సారంగపాణి, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, శనిగరపు రాజకుమార్, కందె నరసయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి సిపిఐ జనగామ జిల్లా మహాసభలు

### బహిరంగ సభకు హాజరుకానున్న కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జనగామ జిల్లా మహాసభలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు మహాసభలు జరగనుండగా మొదటి రోజు నర్మెట మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడనున్నారు. కాగా మహాసభలకు అన్ని ఏర్పాట్లు జరిగినట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి తెలిపారు.

జనగామ జిల్లాలో కమ్యూనిస్టులకు ప్రత్యేకత ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జనగామ జిల్లా ఎనలేని పాత్ర పోషించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, విస్నూరు దొరను ఉరికించి తరిమిన సాకలి ఐలమ్మ, బందగీ, తెలంగాణ టైగర్గా పేరున్న నల్లా నర్సింహులుతో పాటు అనేక మంది ఈ జిల్లాకు చెందిన వారే. 200 గ్రామాలకు అధిపతిగా ఉంటు ప్రజల మాన, ప్రాణాలు తోడేసిన రజాకార్ మూకల అనుచరుడు విస్నూర్ రామచంద్రారెడ్డి సైతం ఈ జిల్లాకు చెందిన వారే. అలాంటి చరిత్ర కలిగిన జిల్లాలో సిపిఐ మహాసభలు మంగళ, బుధవారం జరగనున్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి 25కిలో మీటర్ల దూరంలో ఉన్న నర్మెట మండల కేంద్రంలో జిల్లా నాల్గవ మహాసభలు జరుగుతుండగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తన సొంత మండలం కావడంతో మహాసభలు దిగ్విజయంగా నిర్వయించాలనే పట్టుదలతో ఉన్నారు. మహాసభల సందర్భంగా ప్రారంభ రోజు భారీ మహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. నర్మెట మండల కేంద్రం చౌరస్తా నుండి వినాయక పంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వయించనున్నారు. ర్యాలీ అనంతరం అక్కడే బహిరంగ సభ జరనుంది.

**బహిరంగ సభకు కూనంనేని, తక్కెళ్లపల్లి**

మహాసభ మొదటి రోజు జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. అధిక సంఖ్యలో ప్రతినిధులు రానుండగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభం అవుతుందని జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

## కాజీపేట రైల్వే జంక్షన్ బలోపేతానికి ఫలించిన ఎంపి కృషి

### కాజీపేట రైల్వే ఉద్యోగుల భర్తీకి రైల్వే గ్రీన్ సిగ్నల్



ప్రజాపక్షం/కాజీపేట:కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను తగ్గకుండా చూడాలన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల రైల్వే జిఎం సానుకూలంగా స్పందించారు. గతంలో కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడ ఇతర ప్రాంతాలకు బదిలీ చేయకూడదన్నారు. ఉద్యోగులకు భర్తీని సైతం నిలిపివేయడంతో ఉద్యోగులపై భారం పడుతుందన్న విషయాన్ని రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ దృష్టికి ఎంపీ తీసుకువెళ్లారు. ఈ మేరకు త్వరలోనే ఉద్యోగాలు భర్తీ చేస్తామని రైల్వే జిఎం అరుణ్ కుమార్ ఎంపీకి వివరించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాముఖ్యతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఎంపీ కలెక్టర్ కడియం కావ్య అన్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ బలోపేతానికి కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. కాజీపేట రైల్వే బస్టాండ్ నిర్మాణం కొరకు త్వరితగతిన స్థల కేటాయింపు నిర్ణయం తీసుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎం కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలియజేశారు. బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికులకు మరిన్ని మెరుగైన రవాణా సేవలు అందించబడతాయి అన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎఐటియుసి బ్రాంచ్ సహాయ కార్యదర్శి గురిజపెల్లి సుధాకర్ రెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు క్యాతరాజు సతీష్, కొరిమి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, ఏఐటియుసి నాయకులు చంద్రమౌళి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫోకస్

# యువతరంగం



## పెన్ను విడిచిపెట్టి.. గన్ను చేతబట్టి..

ఆధిపత్య పోరాటాలు... ఉన్మాదపు యుద్ధాలు చరిత్రకు ఎర్ర రంగులు అద్దాయి. మనిషి ఎదుగుతున్న కొద్దీ... నాగరికత పెరుగుతున్న కొద్దీ పరస్పర అవగాహన, సోదరభావం, సౌభ్రాతృత్వం వర్ధిల్లాల్సింది పోయి... ఘర్షణలు మరింతగా పెరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక మూల తుపాకులు పేలుతునే ఉన్నాయి. మనుషులు శవాలుగా మారుతునే ఉన్నాయి. ఒకరు మరణిస్తే, ఆ కుటుంబం మొత్తం చిందరవందరవుతున్న వైనం మనం కళ్లెదుట కనిపిస్తునే ఉంది. అందుకే..

'రణరంగం కానిచోటు భూస్థలమంతా వెదికిన దొరకదు గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళ్ళతో' అంటాడు మహాకవి శ్రీశ్రీ. గతమేకాదు.. వర్తమానం కూడా రక్తమయమవుతున్నది. భవిష్యత్తులో శాంతి చిగురించి, ప్రపంచం పచ్చదనాన్ని సంతరించుకునే అవకాశాలు కనిపించడమే లేదు. ఈ పోరాటాల్లో చల్లారిన సంసారాలెన్నో... మరణించిన జన సందోహం లెక్కలెక్కడో? భూమిపై ఒక దేశాన్ని... ఒక ప్రాంతాన్ని లేదా ఒక జాతిని లేకుండా చేయాలన్న దుష్ట పన్నాగాలు కొనసాగుతున్నంత కాలం అసహాయుల హాహాకారాలే.. పాలస్తీనా లేదా లెబనాన్... సిరియా లేదా ఇరాక్... నిత్యం ఏదో ఒక యుద్ధం వెంటాడుతున్న నేపథ్యంలో, యువత చదువుకు దూరంకాక తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో యువకులు గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యను విడిచిపెట్టి, తుపాకీ చేతబడుతున్నారు. ప్రాణాలు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రక్తరంజిత రణక్షేత్రాలు అరాచక కేంద్రాలే తప్ప, శాంతి కారకాలు ఎప్పటికీ కావు. భయంకర తుపాకీ గర్జనలకు తగిన సమాధానం చెప్పడానికి పాలస్తీనియన్ యువత దశాబ్దాల క్రితమే యుద్ధ భూమిలోకి పరుగులు తీశారు. యుద్ధం ఆగలేదు. యువతీయువకుల సమస్యలు తీరలేదు. ప్రపంచం యావత్తు అధునాతన సాంకేతికను అందిపుచ్చుకొని, అన్ని రంగాల్లోనూ దూసుకెళుతుంటే, యుద్ధంలో మునిగితేలుతున్న దేశాల్లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రాణ భయంతో, కుటుంబాన్ని రక్షిల్యాలన్న తపనతో, భవిష్యత్తును పణంగా పెట్టి, ఆయుధాలు పడుతున్నారు. ఆ ధైర్యం కూడా చేయలేనివారు, జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటూ, దినదినగండంగా రోజులు గడుపుతున్నారు. కొంత మంది వ్యక్తుల దాహం తీరని యుద్ధ పిపాస, ఎన్నో దేశాల్లో ఆకలి కేకలకు కారణమవుతున్నాయి. అక్కడ అభివృద్ధి లేదు. ఉద్యోగావకాశాలు లేవు. ఆదాయం లేదు. పేదరికంతో సహవాసం... కష్టాలతో కలిసి ప్రస్థానం... మానవత్వాన్ని మసకబార్చే బాంబుల భీకర హోరులో, యువత ఆక్రందనలు కలిసిపోతున్నాయి. ధ్వంసం మిగిల్చిన ధూళి మేఘాలు అలముకున్న స్థితిలో, వారి బతుకులు దుర్భరమవుతున్నాయి. గాజాలో నెలకొన్న పరిస్థితులు... అక్కడి పాలస్తీనా ప్రజలు, ప్రత్యేకించి యువతీయువకులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. శాంతి చర్చలంటూ హడావుడి చేసిన అమెరికా ఇప్పుడు మౌనవ్రతం పట్టింది. యుద్ధం నీడలో బతుకుతున్న పాలస్తీనా పిల్లలు, యువతీయువకులు చదువుకు దూరమవుతున్నారు. యుద్ధాలకు తెరపడనిదే, ఆ సమస్యను ఎదుర్కొంటున్న దేశాల్లో యువత బతుకులు బాగుపడవు. వారి అభ్యున్నతికి బాటలు ఏర్పడవు.

## చిన్న వయసులోనే గొప్ప సేవ..

అమెరికాలోని రోడ్ ఐలాండ్ రాష్ట్రానికి చెందిన నికోలస్ లోవింగర్ చాలా చిన్న వయసులోనే చాలా పెద్ద సేవా కార్యక్రమాన్ని చేపట్టాడు. యువ సామాజిక సేవకుడిగా పేరు గడించాడు. నికోలస్ ఐదు సంవత్సరాల వయసులో తన తల్లితో కలిసి ఒక అనాథ శరణాలయాన్ని సందర్శించాడు. అక్కడ కొంత మంది పిల్లలు తెగిపోయిన పాత చెప్పులు వేసుకోడం, చాలా మంది అసలు చెప్పులే లేకుండా ఉండడం చూసి బాధపడ్డాడు. ఈ అనుభవం అతనికి ప్రేరణగా మారి, అనాథ పిల్లలకు కొత్త చెప్పులు అందించాలనే లక్ష్యంతో 'గొటా హావ్ సోల ఫౌండేషన్ (Gotta Have Sole Foundation)ను ప్రారంభించాడు. ఈ ఫౌండేషన్ ద్వారా అమెరికా అంతటా ఉన్న అనాథ శరణాలయాల్లోని పిల్లలకు కొత్త చెప్పులు పంపిణీ చేస్తున్నాడు. పిల్లల పాదాల పరిమాణానికి సరిపోయే చెప్పు, బూట్లతోపాటు సాక్స్‌లు అందిస్తున్నాడు. వ్యక్తిగత సందేశాలతో కూడిన కార్డులు పంపిస్తూ, వారికి చాలా చేరువగా ఉన్న ఆనందాన్ని కలిగిస్తున్నాడు. సర్వింగ్ లవ్ అనే కార్యక్రమం ద్వారా క్రీడల్లో రాణించాలనుకుంటున్న పిల్లలకు బూట్లు పంచుతున్నాడు. అదే విధంగా వృద్ధులైన సైనికులు, వారి కుటుంబ సభ్యులకు 'సోల్‌డియర్స్' కార్యక్రమం ద్వారా చెప్పులు, బూట్లు ఇస్తున్నాడు. ఇప్పటి వరకూ నికోలస్ 125,000కు పైగా పిల్లలకు చెప్పులు అందజేయడం అతని సేవాతత్పరతకు నిదర్శనం. అతని సేవలకు గుర్తుగా 2014లో నిక్లడియన్ హాలో అవార్డు లభించింది. మరుసటి సంవత్సరం వరల్డ్ ఆఫ్ చిల్డ్రెన్ యూత్ అవార్డును అతను అందుకున్నాడు. ప్రతిష్ఠాత్మకమైన 'త్రిడాట్‌డాష్ గ్లోబల్ టీన్ లీడర్' అవార్డు కూడా నికోలస్ అవార్డుల జాబితాలో చేరింది. అతను చేపట్టిన సేవా కార్యక్రమం, పిల్లల జీవితాలలో సానుకూల మార్పు తీసుకువచ్చింది. పిల్లలకు కొత్త చెప్పులు అందించడం ద్వారా, వారు స్కూల్‌కు వెళ్లడం, క్రీడలలో పాల్గొనడం వంటి అవకాశాలను పొందుతున్నారు. ఇది ఒక చిన్న చర్యగా కనిపించవచ్చు, కానీ దీని ప్రభావం పిల్లల ఆత్మవిశ్వాసం మరియు భవిష్యత్తుపై గొప్పగా ఉంటుంది.



### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## యాజమాన్యాల ఇష్టారాజ్యం




కార్పొరేట్ ప్రపంచంలో యాజమాన్యాల ఇష్టారాజ్యం ఏ విధంగా కొనసాగుతున్నదో చెప్పడానికి హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దీ ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇటీవల హఠాత్తుగా ఫ్యాక్టరీలోని తయారీ యూనిట్లలో ఒకదానిని మూసివేసినట్టు విప్రో ప్రకటించింది. అయితే, ఈ విషయాన్ని సైట్‌ఇన్‌ఫ్లస్ మీడియా సంస్థ వెల్లడించే వరకూ కార్మికులకు వివరాలు ఏవీ తెలియలేదు. విప్రో యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో కనీసం 80 మంది ఉద్యోగాలు సందిగ్ధంలో పడ్డాయి. రెగ్యులర్ షిఫ్ట్‌ల కోసం వచ్చే ఉద్యోగులను భద్రతా సిబ్బంది ఫ్యాక్టరీ గేట్ల వద్ద ఆపి, మూసివేత గురించి తెలియచేయడం దారుణమని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. డిసెంబర్‌లో తాము పని ప్రారంభించామని, కంపెనీ నిర్ణయం గురించి తమకు తెలియదని చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యామని కార్మికులు అంటున్నారు. కార్యాచరణ అంతరాయాలు, ఆర్థిక నష్టాల కారణంగా షట్‌డౌన్ జరిగిందని విప్రో ప్రకటనలో ఉన్నట్టు మీడియా నివేదిక పేర్కొంది. దీనిపై ఫ్యాక్టరీ కార్మిక సంఘం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి, కార్మిక శాఖకు ఫిర్యాదులు చేసింది. కార్మికుల హక్కులను కాపాడటానికి జోక్యం చేసుకోవాలని కోరింది. కాగా, విప్రో తీసుకున్న ఈ మూసివేత నిర్ణయం కార్మికులపై మాత్రమేగాక, సరఫరాదారులపై కూడా ప్రభావం చూపుతున్నది. బద్దీలోని విప్రో ఫ్యాక్టరీ పనిచేస్తున్నప్పటికీ, ఈ యూనిట్ మూసివేయడం చాలా మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ముందస్తు నోటీసు లేకుండా విప్రో ఎంటర్‌ప్రైజెస్ కార్మికులను వెనక్కి పంపడం ప్రైవేటు యాజమాన్యాలు అనుసరిస్తున్న అనైతిక, అరాచక విధానాలకు దర్పణం. మెరుగైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత కోసం ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న తరుణంలో, భారీ నష్టాల కారణంగా ఒక యూనిట్‌ను మూసివేయాల్సి వచ్చిందని విప్రో యాజమాన్యం ప్రకటించడం అనుమానాలకు తావిస్తున్నది. ఇది కార్మికులను ఇబ్బంది పెట్టడానికి తీసుకున్న నిర్ణయంగా భావించాల్సి వస్తున్నది. విప్రో తయారీ కార్యకలాపాలలో బద్దీ యూనిట్ కీలకమైన భాగంగా ఉండేది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడింది. దీని మూసివేత శ్రామిక శక్తికి పెద్ద దెబ్బ. ఇది ప్రత్యక్ష ఉద్యోగులను మాత్రమే కాకుండా ఫ్యాక్టరీ కార్యకలాపాలపై ఆధారపడిన కాంట్రాక్ట్ కార్మికులు, సరఫరాదారులను కూడా ప్రభావితం చేస్తుంది. బద్దీలోని ఒక విప్రో కర్మాగారం పనిచేస్తుండగా, ఈ యూనిట్ మూసివేత భారతదేశ పారిశ్రామిక ప్రాంతాలలో యజమానులు, కార్మికుల మధ్య పెరుగుతున్న ఒత్తిడిని ప్రతిబింబిస్తుంది. కార్మిక వివాదాలు, ఆర్థిక సవాళ్లు కొనసాగితే ఇలాంటి మూసివేతలు కూడా వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ఆత్మవిశ్వాసానికి 'డాన్'

సీనియర్ సిటిజన్స్

మీదపడుతున్న వయసును తలచుకుంటూ, శారీరక బాధలను పదేపదే గుర్తుచేసుకుంటూ నిరంతరం మానసికంగా కుంగిపోయే వారు అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' శాస్త్రవేత్త డాన్ పెటిట్‌ను చూసి స్ఫూర్తి పొందాలి. నాసా చేపట్టిన 'ఎక్స్‌పెడిషన్ 71/72'కు ఎంపికైనప్పుడు ఆయన వయసు 69 సంవత్సరాలు. 2024 సెప్టెంబర్ 11న సూయజ్ ఎంఎస్ వ్యోమనౌకలో ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 20న సురక్షితంగా భూమికి తిరిగి వచ్చాడు. అదే రోజు ఆయన 70వ జన్మదినం కావడం విశేషం. ఐఎస్ఎస్‌లో మొత్తం 220 రోజులు గడిపాడు. శారీరకంగా, మానసికంగా దృఢత్వం ఉన్న వారికే ఇలాంటి యాత్రలు సాధ్యమవుతాయి. ఏడు పదుల వయసులో డాన్ అంతరిక్షంలోకి వెళ్లడాన్ని అద్భుతంగా కొందరు పేర్కొంటుంటే, అతని ఆత్మస్థైర్యానికి నిదర్శనమని ఎంతో మంది జేజేలు పలుకుతున్నారు. అతను ప్రయాణించిన దూరం 93.3 మిలియన్ మైళ్ళు, భూమి చుట్టూ చేసిన ప్రదక్షిణలు 3,520. రష్యా ఖగోళ శాస్త్రవేత్తలు అలెక్సీ ఓవ్చినిన్, ఇవాన్ వాగ్నర్ ఆయన సహచరులు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో, పెటిట్ పలు ముఖ్యమైన పరిశోధనలు నిర్వహించాడు. అంతరిక్షంలో మెటల్ 3డి ప్రింటింగ్ సామర్థ్యాలను మెరుగుపరచడం, నీటి శుద్ధి సాంకేతికతల అభివృద్ధి, విభిన్న నీటి పరిస్థితుల్లో మొక్కల పెరుగుదలపై అధ్యయనం, శూన్యతలో అగ్ని ప్రవర్తనపై పరిశోధనలు వంటి అనేక ప్రయోగాల్లో పాల్గొన్నాడు. సూయజ క్యాప్సూల్ ద్వారా కజకిస్తాన్‌లో భూమికి చేరుకున్న అతనికి ఎంతో మంది సాదరంగా స్వాగతం పలికారు. భూమికి చేరిన వెంటనే, గురుత్వాకర్షణకు మళ్లీ అలవాటు పడే సమయంలో ఆయన కొంత అస్వస్థతకు గురయ్యాడు. అయితే, ఇది సాధారణమేనని, తన ఆరోగ్యం బాగానే ఉందని నాసా ప్రకటించింది. 70 సంవత్సరాల వయసులోనూ డాన్ పెటిట్ అంతరిక్ష పరిశోధనలపై తన ఆసక్తిని ప్రదర్శిస్తున్నాడు. తన అనుభవం, శక్తిని వినియోగించి, భవిష్యత్తులో మరిన్ని మిషన్లలో పాల్గొనాలని ఆశిస్తున్నాడు. శాస్త్రవేత్తగా నాసా కేంద్రంలో అనేక ప్రయోగాలు చేసిన అతను గతంలోనూ అంతరిక్షంలోకి వెళ్లాడు. తాజా ప్రయాణం ద్వారా అంతరిక్షంలో తాను గడిపిన సమయాన్ని 590 రోజులకు పెంచుకున్నాడు. నాసా శాస్త్రవేత్తల్లో అత్యధిక కాలం అంతరిక్షంలో గడిపిన వారి జాబితాలో డాన్‌ది మూడో స్థానం.





# విలువలు గల నేత పోటు ప్రసాద్

### ప్రజా ఉద్యమ నిర్మాణమే సరైన నివాళి

### స్మారక స్తూపాన్ని ఆవిష్కరించిన పువ్వాడ



**ప్రజాపక్షం/ఖమ్మం :** సమకాలిన రాజకీయాల్లో విలువలు కలిగిన నేతగా పోటు ప్రసాద్ పేరొందారని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన త్యాగాల కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ పోరాట వారసత్వాన్ని కొనసాగించారని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని పర్ణశాల సమీపంలో సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఏర్పాటు చేసిన పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని సోమవారం పువ్వాడ ఆవిష్కరించారు. స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా రంగాపురంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబంలో జన్మించిన ప్రసాద్ విద్యార్థిగా ఖమ్మం వచ్చారని, పార్టీ ప్రజాసంఘాలలో సుదీర్ఘ కాలం సేవలు అందించారన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణమే ప్రసాద్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని పువ్వాడ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, ఏపూరిలతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరదా నర్సింహారావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పోటు ప్రసాద్ సతీమణి నిర్మల, కుమారుడు రాజా సాత్విక్, మాతృమూర్తి సక్కుబాయి, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, పోటు పూర్ణచందర్‌రావు, ఉయానాలి సాంబశివరెడ్డి, డాక్టర్ బాగం కిషన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, జాకీర్, ఉపేందర్ పాల్గొన్నారు.

# ఆర్థిక వనరుల దోపిడీకే మావోయిస్టుల అంతం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సహజ వనరులు, అటవీ సంపద, ఆర్థిక దోపిడీకి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసే పంతం పట్టారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం భాగి కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బాల నరసింహ హాజరై మాట్లాడుతూ మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతున్నారని, కనీసం వారి మృతదేహాలను కూడా అప్పగించకుండా పైశాచికానందం పొందుతున్నారన్నారు ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్తాన్‌తో శాంతిచర్చలు జరుపుతున్న కేంద్రం ప్రజలకు సంబంధించిన డిమాండ్‌లతో సిద్ధాంతపరంగా ఉన్న మావోయిస్టులతో శాంతిచర్చలకు ముందుకు రాకపోవడం హేయమన్నారు. భారతకు మిత్ర దేశంగా భావిస్తున్న అమెరికా యాజమాన్య దేశంగా రూపాంతరం చెందిందని వాపోయారు. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లడం యావత్ దేశ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్దిదారుడికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆర్థిక చేయుత అందించాలని కోరారు. తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీలను వ్యక్తులను శక్తులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, బి.పరమేశ్వర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, ఆర్.అల్వాల్‌రెడ్డి, భాగి కృష్ణయాదవ్, చాంద్ పాషా, శంకర్‌నాయక్, శ్రీను, జి.సత్యనారాయణ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సి.రాజు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, భార్గవి, కొండిటి పద్మావతి పాల్గొన్నారు.

# అమరుల స్వప్నం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం


నల్లగొండ..

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నీళ్ల నిధులు నియామకాల కోసం సాగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతోమంది ప్రాణ త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో గత ప్రభుత్వం అమరుల స్వప్నం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లా సిపిఐ కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఎమ్మెల్సీ సత్యం జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడుతూ నాడు నిజాం ప్రభుత్వం, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి 4000 మంది అమరులను త్యాగాలను చేసిన గొప్ప చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కే దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా మొట్టమొదటినే జాతీయ పార్టీ అయిన సిపిఐ ఉద్యమాన్ని బలపరిచి పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను చేయకుండా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలపైన దృష్టి పెట్టి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్లుగి నర్సింహా, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి పట్టణ నాయకులు ముండ్ల ముత్యాలు, పుట్టల సుజాత, జె విజయ లక్ష్మి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నా రెడ్డి, కౌసల్య చింత ధనలక్ష్మి ఎస్ కె మదర్,సీతారాములు,కె నారాయణ, తెలగమళ్ళ దశరథ,దోటి అక్కలయ్య,చంద్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించి రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మర్రి వెంకటస్వామి ఎగురవేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమయ్య, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కంది రవీందర్ రెడ్డి, అందె చిన్న స్వామి, బామండ్లపెల్లి యుగేందర్, మచ్చ రమేష్, బూడిద సదాశివ, మావురపు రాజు, కొట్టె అంజలి, చెంచల మురళి, మామిడిపెల్లి హేమంత్‌కుమార్, ఓర్సు కొమురయ్య, నర్సింహులు, కడారి బీరయ్య, జక్కుల రాజయ్య, మామిడిపెల్లి శంకరయ్య, కూన రవి, నగునూరి రమేష్, నల్లగొండ శ్రీనివాస్, నా యిని సురేష్, సందీప్‌రెడ్డి,సాంబయ్య పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో సిపిఐది ప్రత్యేక భూమికని పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆయన జాతీయజండా ఎగురవేశారు. కార్యక్రమం సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, వెలుగు శ్రావన్, ఎండి ఫాతిమా, బానోతు లింగ్యానాయక్, ఆబోతు అశోక్,కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి, తోట రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నేరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా కామ్రేడ్ ధర్మబిక్షం సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, ఖమ్మంపాటి రాము, నిమ్మల ప్రభాకర్, శ్రీనివాస్, ఎండి పాషా, పెండకృష్ణ, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** అమరుల ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పాటు జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను సుధాకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, సురేష్, అంజలి, ఆలీ ఇమ్రాన్, ఫిరోజ్, రాధకుమార్, కార్తీక్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

**భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించినారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహయ కార్యదర్శి చింతల మల్లేశం, ఎఐఎస్ఎఫ్ నాయకులు శాంతి, వంశీ, జానీ, చింతల పెంటయ్య, బద్దం వెంకట్ రెడ్డి, కోట శంకర్, కడారి మల్లేశం, చోప్పరి సత్తయ్య, ఎస్కే షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

**అదిలాబాద్/నిర్మల్ :** జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడుపు నలినిరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు, తబ్రెజ్ ఖాన్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు అమీనా బేగం, ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్థాంగి రమేష్, నర్సింగరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రాందాస్, స్వామి పాల్గొన్నారు.

**సిద్దిపేట :** అమరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురవారెడ్డి భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్. గజబింకార్ బన్సిలాల్. కర్నాల చంద్రం, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్ధన్, రామగల్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, బెక్కంటి సంపత్, కానుగుల రామ్‌నకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్..


నిర్మల్ అదిలాబాద్..


యాదాద్రిభువనగిరి..


సూర్యాపేట...


నిజామాబాద్...


సిద్ధిపేట..


మహబూబాబాద్



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## టిఎస్ సీడ్ విత్తనాల పంపిణీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ రూరల్ మండలం చిట్యాల్ గ్రామంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి టీఎస్ సీడ్ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి జిలుగు, సహా తదితర విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు మేలు రకమైన విత్తనాలను నాటి లబ్ధి పొందాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులను అన్ని విధాల ఈ ప్రభుత్వం మోసగిస్తుందని, వడ్ల కొనుగోలు లో గత ప్రభుత్వం మాదిరి ఈ ప్రభుత్వం కూడా దోపిడికి పాల్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, జమాల్, సరికెల గంగన్న, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్తాం

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి : తెలంగాణ రైజింగ్2047 విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్తామని ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. నస్పూర్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో లక్ష్యాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ఇది భవిష్యత్తు తెలంగాణకు భగవద్గీత లాంటిదని అభివర్ణించారు. విజన్‌లో పేదల సంక్షేమం, సమగ్ర విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మహిళల ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై రాయితీ, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం అందిస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్య, గృహ నిర్మాణం, హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేసిన పోచారం



ప్రజాపక్షం/బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిఎస్‌పి విఠల్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి



ఎంఎల్‌సి దండే విఠల్

ప్రజాపక్షం/పెంచికల్‌పేట : గత నాలుగు రోజులుగా తమ వ్యవసాయ భూముల విముక్తి కోసం అటవీ శాఖ అధికారులతో పోరాడుతున్న జైహింద్‌పూర్ గ్రామస్థుల సమస్య పరిష్కారం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ స్వయంగా ఆ సమస్యాత్మక ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ అటవీ శాఖ ఉన్నతాధికారి డిఎఫ్‌ఓతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యపై చర్చిస్తామని, త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వెంటనే అటవీ శాఖ అధికారులు పేద ప్రజల భూముల నుండి వెనుదిరగాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తమ భూముల నుండి వెళ్లిపోగానే ఎంఎల్‌సి దండే విఠల్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కొసం దరఖాస్తుల స్వీకరణ

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి

ప్రజాపక్షం/ నస్పూర్ : 2025 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడానికి అర్హులైన మైనారిటీ విద్యార్థుల నుండి ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. డిగ్రీ (ఇంజనీరింగ్) 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయుటకు, పిజిలో 60 శాతం మార్కులు వచ్చి పిహెచ్‌డి చేయాలనుకునే అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

## నిర్మల్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్రా అవతరణ దినోత్సవ వేడుకలు..

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెంగాణ రాష్ట్ర ఫైనాస్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,ఎస్పీ జానకి షర్మిల పూలమొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా చైర్మన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఫైనాస్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ,సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్మల్ జిల్లా ముందంజలో పయనిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి నేటితో పదకొండేళ్లు నిండాయని,ఈ విశిష్టసందర్భంలో వేడుకలకు విచ్చేసిన జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాభినందనలు తెలిపరు,ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలలో మహాలక్ష్మి పథకం,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా,కొత్తరేషన్ కార్డుల మంజూరు,ఇందిరమ్మ ఇండ్లపథకం వంటి పథకాల ద్వారా అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం సహాయాన్ని అందిస్తోందని జిల్లా ప్రగతిని వివరించారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించి అలరించారు.ఆతర్వాత విద్యారులకు బహుమతులను అందజేశారు.అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ సహకరంతో రైతులకు విత్తన ఉత్పత్తి కొరకు నాణ్యమైన ఫౌండేషన్ విత్తనాలను ఉచితంగా అందజేశారు.నిర్మల్ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను చైర్మన్,జిల్లా కలెక్టర్,ఎస్పీ అధికారులు ఆవిష్కరిచారు.అనంతరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేకు కత్తిరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ,నిర్మల్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల అవసరాలు తీర్చేందుకే ప్రజాపాలన

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం

రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుంచేందుకు రేవంత్ రెడ్డి కృషి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు





ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : రాష్ట్ర ప్రజల అవసరాలు,సమస్యలు తీర్చేందుకే ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో మంచి పరిపాలన అందిస్తుందని, ఎన్నో ఒడిదోడుకులు, కొట్లాడి, సబ్బండ వర్గాల కృషితో సాధించుకున్న తెలంగాణ, బంగారు, ఆర్థిక, సామాజిక తెలంగాణ కావాలంటే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అడిషనల్ కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పి మహేందర్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, మెదక్ ఆర్డిఓ రమాదేవి, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుగా అమరవీరుల స్థూపం వద్ద పూల మాల వేసి నివాళులర్పించి,పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ తెలంగాణ సాధించిన ఘనతను నలుదిక్కులా చాటేలా, ప్రత్యేక రాష్ట్రం ద్వారా ప్రజల జీవితంలో వచ్చిన మార్పు తెలియజేసేలా ఘనంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించు కుంటున్నందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితంగా దశాబ్దాల కల నెరవేరిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ 11 వసంతాలు పూర్తి చేసుకొని 12వ వసంతంలోకి అడుగుపెట్టిన చారిత్రక సందర్భంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎఫ్ జోజి, డిపిఓ యాదయ్య, డిఇఓ రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా అధికారులు విజయలక్ష్మి, శశికళ, ఇందిర, హైమావతి, ఇందిర, తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా తెలంగాణ రాష్ట్రా ఆవతరణ దినోత్సవ వేడుకలు

దామోదర్



ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డిజిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిచారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా విశదపరిచారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల స్ఫూర్తితో తెలంగాణ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి సంస్థ అటవీ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మహిళా శిశు సంక్షేమం నీటి పారుదల ఫిషరీస్ వివిధ శాఖల ఆద్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథితో కలసి కలెక్టర్ ఇతర అధికారులు స్టాళ్లను సందర్శించారు. తెలంగాణ అమరవీరులకు ప్రజాప్రతినిధులు ,అధికారులు శ్రద్దాంజలి ఘటించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ,ఎస్పీ పరితోష్ ఫంకజ్, నారాయణఖేడ్, శాసన సభ్యులు సంజీవరెడ్డి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పుర ప్రముఖులు ,పుర ప్రజలు పాల్గొన్నారు.

## వైబోవోపేతంగా బీరప్ప, కామరాతి కళ్యాణోత్సవం



ప్రజాపక్షం/పాపన్నపేట : చిన్న గ్రామమైన ఇంత పెద్ద కళ్యాణోత్సవం జరిపించడం హర్షింపదగ్గ విషయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లి లో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయం లో కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బీరప్ప కామరతి దేవి కళ్యాణ మహోత్సవంలో మండల నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురుమ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు సోములు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ లు బాల గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, పాపన్నపేట్ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి,ఆరేపల్లి తాజా మాజీ సర్పంచ్ శ్రీనాథరావు, మాజీ ఎంపీటీసీ జ్యోతి సాయిలు, మండల మాజీ సర్పంచులు నర్సింలు, నవీన్ గౌడ్, శ్రీనివాస్, నాయకులు వెంకటేశం సెట్, కొడపాక శంకర్, సంఘం నాయకుడు కొమరయ్య, బిఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వరరావు మాణిక్ రావు , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జాతీయ పథకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం సంగారెడ్డి, కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్ ,మాణిక్‌రావు పూల మాలలు వేశారు. ఎమ్మెల్యే చింతాప్రభాకర్ రాష్ట్ర ,జిల్లా ప్రజలకు తెలంగాణ ఆవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా తెలంగాణను సాధించుకున్నాం ,సాధించుకున్న తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కేసీఆర్ పాలన స్వర్ణయుగమన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పాలన తెలంగాణ చరిత్రలో నిలచిపోతారని అతని పాలన యుగం స్వర్ణయుగమని తెలిపారు. కేసిఆర్ తెలంగాణ పితామహునిగా తెలంగాణ చరిత్రలో మిగిలిపోతరన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనలో ఆగం అవుతున్నారన్నారు. అష్టకష్టాలు అనుభవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టీఎన్‌జిఓఎస్ అధ్యక్షులు, మామిళ్ల రాజేందర్ , మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు ,కార్యదర్శి నర్సింలు, బాలయ్యడా శ్రీహరి మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి విఠల్ మాజీ కౌన్సిలర్లు విష్ణు, ఆశ్విన్, సమీ, ప్రభుగౌడ్, అంజనేయులు ,గోవర్ధన్ రెడ్డి, పుల్లా రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధార్ కార్డులు లేవనే సాకుతో పిల్లలకు చదువు నిరాకరించవద్దు



ప్రజాపక్షం/నిజాంపేట్ : సంచార జాతుల పిల్లలకు అధార్ కార్డులు లేవనే సాకుతో చదువు నిరాకరించడం రాజ్యాంగ హక్కును ఉల్లంఘించడమేనని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని నిజాంపేట్, బచ్చురాజ్పల్లి, నంది గామ గ్రామాలలో డిబిఎఫ్ బృందం పర్యటించి ప్రజల స్థితిగతుల పై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మండల కేంద్రం లోని పొచమ్మలా సంచారజాతుల గుడిసెలను సందర్శింగా ఏడు కుటుంబాలు గుడిసెలలో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారని డిబిఎఫ్ నేత శంకర్ అన్నారు. దాదాపు పది మంది బాలబాలికలకు అధార్ కార్డులు లేవని బడిలో చెర్చుకొమని గత కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వం, ఉపాధ్యాయులు పిల్లలకు రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కును కాలరాయడం తగదన్నారు.బడి బాట చెస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మం,గ్రామ పంచాయతి భవనాల వెనుక చింత చెట్ల కింద నివాసం వుంటున్న సంచార జాతుల వారిని కలిసి వారి పిల్లలను బడిలో చెర్పించి వారి విద్యా హక్కు ను కాపాడాలని శంకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అవిర్భావ వేడుకలలో ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వ అధికారులు సంచార జాతుల వారికి ఇండ్లు నిర్మించి వారి నివాస హక్కును అమలు చెయాలన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ డేవిడ్



ప్రజాపక్షం/సిర్పూర్ టి : జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సహకార అధికారి బిక్కులతో కలిసి సిర్పూర్‌టీ మండలంలోని టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఐకేపీ ఏపీఎం దుర్గయ్య సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం



ప్రజాపక్షం/ నస్పూర్ : గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, పౌర సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, నోడల్ అధికారి డా. ప్రవీణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి, జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సహకారంతో ఈ సంవత్సరం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం నినాదంతో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిక చేసిన రైతులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ వర్సిటీలో రూపుదిద్దుకున్న నాణ్యమైన విత్తనాన్ని గ్రామ గ్రామానికి తీసుకువెళ్తున్న వర్సిటీ శాస్త్రవేత్తల ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగరాజు, మండల వ్యవసాయ అధికారులు మహేందర్, కృష్ణ, రజిత, ఎంపిక చేయబడిన రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో తెలంగాణ రాష్ట్రం



ఎమ్మెల్యే బొజ్జు పటేల్...

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నారూ అని అన్నారు. అదే విధంగా ఎమ్మార్వో కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో, మండల విద్యా వనరుల కేంద్రంలో, మున్సిపాలిటీ కార్యాలయంలో, వివిధ గ్రామాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాలపన చేశారు. తెలంగాణ కోసం త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకొని ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో మండల స్పెషల్ ఆఫీసర్ జీవరత్నం, ఎమ్మార్వో సుజాత, ఎంపీడీవో సునీత, ఎంఈఓ ప్రేమ్‌కుమార్, ఆర్ఐలు నాగేష్, సత్యనారాయణ, రత్నాకర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు రమేష్, గంగానరసయ్య, లక్ష్మి పతి, తదితర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం

రాష్ట్ర ప్రభుత్వ సలహదారు కె. కేశవరావు



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : మెదక్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహదారు కే. కేశవరావు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి,హౌసింగ్ పీడీ మాణిక్యం, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ తో కలిసి రైతులకు,విత్తనాలు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. నాణ్యమైన విత్తనంతో సమృద్ధిగా పంటలు పండించి తద్వారా దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలనే మహోత్తర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఒక వినూత్న కార్యక్రమం ప్రారంభించిందని తెలిపారు. విత్తుకొద్దీ పంట అనే నానుడిని నిజం చేస్తూ ప్రొఫసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ప్రారంబించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ,వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో దారుణం

ఐకెపి కార్యాలయంలో తలకిందులుగా జాతీయ జెండా!

ప్రజాపక్షం/కౌటాల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేళ కౌటాల మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకెపి) కార్యాలయంలో తీవ్ర అపచారం చోటుచేసుకుంది. ఎపిఎం ముక్తేశ్వర్ ఏకంగా జాతీయ జెండాను తలకిందులుగా ఎగరవేసి ఘోరమైన అవమానానికి పాల్పడ్డారు. జెండాను తలకిందులుగా ఎగరవేసినా కనీసం గమనించకుండా, తమ తప్పేంటో తెలుసుకోకుండా జాతీయ గీతం ఆలపించడం మరింత విస్మయానికి గురిచేసింది. అనంతరం జెండాను దించి మళ్లీ ఎగరవేయడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. జాతీయ జెండాకు జరిగిన ఈ అవమానాన్ని చూసి మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యత కలిగిన అధికారి అయి ఉండి కూడా ఇంతటి తప్పిదానికి పాల్పడటం క్షమించరానిదని మండిపడుతున్నారు. జాతీయ జెండాను అవమానించిన ఎపిఎం ముక్తేశ్వర్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల వాసులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు :ఎస్పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (జూన్ 1 వ తేది నుండి 30 వరకు) జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పిసూచించారు. కాబట్టి జగిత్యాల జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని జగిత్యాల జిల్లా ఎస్పిఅశోక్ కుమార్ సూచించారు.

## ఐఐటి అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ‘అల్ఫోర్స్’ అద్భుత విజయం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**ఐఐటి అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. అజ్మీరాపురుషోత్తం నాయక్ 166వ ర్యాంకు సాధించగా పిఎన్ సాయిధృవ 557, ఎన్.అనిరుద్‌సాయి 657, బి.ఆదిత్య 945, 1203, 1224, 1329, 1506, 1604, బి.చైత్రవ్ రాజు 1640, ఇ.శశిలాల్ 1899, కె.వీరేంద్ర ప్రసాద్ 2120, డి.కార్తీక్ 2150, ఎస్ .విఘ్నేష్ 2293, డి.అభిరామ్ 2349, ఎ.శశిప్రీతమ్ 2463, ఇ.అంకిత్ సాయి 2613, మహ్మద్‌దుబ్లాక్ 2766, డి.విశాల్ 2917 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని మరింత పెంచారని యాజమాన్యం పేర్కొంది. 1000 లోపు 4 మంది, 2 వేల లోపు 11 మంది, 3 వేల లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషం. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిష కృషి ఇంతటి ఘనవిజయానికి తోడ్పడ్డాయన్నారు. ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ అందించిన ఐఐటి కోచింగ్ ద్వారా ప్రతిష్టాత్మక ఐఐటిలలో సీట్లు సాధించే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఐఐటి 2025 ఫలితాలలో అద్భుత ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అభినందించారు.

## జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాల విద్యార్థుల అపూర్వ ప్రతిభ




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**జెఇఇ అడ్వాన్స్ 2025 ఫలితాల్లో కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అపూర్వ ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాలు కేవలం కరీంనగర్ బ్రాంచ్‌లో అభ్యసించిన విద్యార్థుల ఫలితాలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ ఫలితాలలో ఎ.రఘుపతి జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు, ఎం.నిఖిత్ నాయక్ 194వ ర్యాంకు, డి.మహేష్ 225వ ర్యాంకు, ఎ.రఘుపతి 226వ ర్యాంకు, బి.సిద్ధిక 1107వ ర్యాంకు, సిహెచ్ ఐశ్వర్య 1129వ ర్యాంకు, బి.ఠాగూర్ 1274వ ర్యాంకు, కె.నిస్సి జాస్పర్ 2172వ ర్యాంకు, జి.అజయ్ 3077వ ర్యాంకు, కె.అక్షర 4524వ వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ఫౌండర్ చైర్మన్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ స్పష్టమైన ప్రణాళిక, మెరుగైన విద్యా బోధనతో కూడిన విధానంలో నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ ర్యాంకులు సాధించడమైనదని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎస్ఎస్‌సి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రినిటీ కళాశాలలో ఫీజు రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ యేడాది నుంచి ఐఐటి అడ్వాన్స్‌డ్ లాంగ్ టర్మ్ ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు అభినందన సభలో పాల్గొన్న ట్రినిటీ కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకుల సాధన కేవలం ట్రినిటీ కళాశాలలకే సాధ్యమని, ఉత్తమ విద్యకు ట్రినిటీ కళాశాలలు మారుపేరు అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు, వివిధ క్యాంపస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం: కాపర్ వైరు చోరీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మండలంలోని సర్వారం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి 25 కెవిఎ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందులోని కాపరు వైరును దొంగిలించారు. కాగా ట్రాన్స్ఫార్మర్ విప్పి అందులోని కాపర్ వైర్ దొంగలించిన విషయంపై సోమవారం పోలీస్ స్టేషన్ లో ట్రాన్స్ కో ఎఇసంతోష్ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా రాత్రి వేళలో పొలాల వద్ద అపరిచితులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

## నేటి నుండి మల్యాలలో భూభారతి గ్రామ సభలు

**ప్రజా పక్షం/మల్యాల :** తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం2025 అమలులో బాగంగా మల్యాల మండలములోని గ్రామాల వారిగా గ్రామ సభలు ఈ నెల 3 వ తేది నుండి 20 వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వసంత ఒక ప్రకటనలో తెలిపారు.ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో ప్రజలకు సంబంధించిన భూ సమస్యల పైన , సాదాబైనామల పైన ఏమైనా సమస్యలు ఉంటే దరఖాస్తులు పెట్టుకోవచ్చు అని,ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ సభలను రెండు గ్రూపులు గా విభజించి ఏ గ్రూప్ కు తహసీల్దార్ కె.వసంత టీమ్ లీడర్ గా ,టీమ్ మెంబెర్స్ గాడి.రాణిఎం.ప్రవీణ్ కుమార్ఎ.సునీత జూనియర్ అసిస్టెంట్ డి.సుజాత జూనియర్ అసిస్టెంట్ పవన్ ధరణి ఆపరేటర్గ్రూప్ బిలో నాయబ్ తహసీల్దార్ నీత టీమ్ లీడర్‌గా,టీమ్ మెంబెర్స్ గాజి.తిరుపతి ఎం అర్ ఐ, సిహెచ్ రాజేష్ రికార్డ్ అసిస్టెంట్ సంజీవ్ విఆర్ఎ,సిహెచ్ శ్రీనివాస్ ఉంటారని ఆమె తెలిపారు.

## కమిషనర్‌ను కలిసిన ఆలయ ఉద్యోగులు



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ కు విచ్చేసిన దేవాదాయ ధర్మదాయ కమీషనర్ ఎస్. వెంకట్రావును కలిసిన ఆలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు. రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి మరియు గోశాలకు సంబంధించిన పలు అంశాల విషయం లో వేములవాడ కు విచ్చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ఎస్. వెంకటరావు కు రాజన్న ఆలయ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి. వంశీ మోహన్ ఆధ్వర్యం లో ఉద్యోగుల యూనియన్ సభ్యులు శాలువా తో సత్కరించి యూనియన్ తరపున ప్రస్తుతం ఆలయంలో ఉన్న స్థితి గతులు, పని భారం దృష్ట్యా తీసుకోవాల్సిన పలు అంశాల పై సమగ్ర నివేదిక తయారు చేసి వినతి పత్రం అందజేశారు.

# కరీంనగర్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ అగ్రగామిగా నిలిచేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించినట్లు వెల్లడించారు. ఇది భవిష్యత్ తెలంగాణకు ఒక భగవద్గీత అని, తెలంగాణ రూపురేఖలనే మార్చేస్తుందన్నారు. ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 500లకే వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పాటు విద్యుత్ ప్లాంట్లు సైతం ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేవలం ఎనిమిది నెలల కాలంలో 2535964 మంది రైతులకు 20617 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. రైతుభరోసాతోపాటు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తున్నామన్నారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అన్నారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసామని, ప్రైవేట్ రంగంలోనూ లక్ష ఉద్యోగాలు సృష్టిస్తున్నామని, సివిల్స్ చదివే వారికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టామన్నారు. 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కరీంనగర్ జిల్లాలో 7626 స్వయం సహాయక సంఘాలకు 785.66 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. 7999 మంది మహిళలకు 66.18 కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను ఇచ్చామన్నారు. భూభారతిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. సమస్యలున్న 1798 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించి భూభారతి పోర్టల్ ద్వారా ధరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. కొత్త గా 67907 రేషన్ కార్డుల ధరఖాస్తులను పరిశీలించి కార్డులను జారీ చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 77 వేల 83 మంది ధరఖాస్తు చేసుకోగా మొదటి దఫా 11575 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాలో డీఎస్సీ ద్వారా 221 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారని, టిఎస్‌పిఎస్‌సి ద్వారా నిర్వహించిన వివిధ రకాల పోటీ పరీక్షలకు జిల్లా నుంచి చాలా మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, ఇటీవలే 172 మంది గ్రామ పాలన అధికారుల ఎంపికకు రాత పరీక్ష నిర్వహించామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం,సూచనలు అందిస్తున్న యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణ ‘రైజింగ్..విజన్ 2047’తో ముందుకు

అమరవీరుల కుటుంబాలను సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రాన్నిదేశంలోనే, ప్రపంచ స్థాయిలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతుంద ని రాష్ట్ర,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వలను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. . సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం పురస్కరించుకొని జయశంకర్ స్టేడియంలో జాతీయ జెండాను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఆనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆకాల హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎఐ గ్లోబెల్, సమ్మిట్, బయో ఏషియో సదస్సు, ప్రపంచ సుందరీకరణ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రజలందరికి అభివృద్ధి ఫలాలు సమర్థవంతంగా అందించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు పునరంకితం అవుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంభ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు ఘనంగా సన్మానించారు.విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు క్వాలిటీ సీడ్, ఎట్ ఎవ్రీ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 12 మంది రైతులకు విత్తనాలను మంత్రి పొన్నం ప్రభాకర్ అందచేశారు.

**రంగధాంపల్లి అమరవీరుల స్థూపానికి నివాళ్లు అర్పించిన మంత్రి పొన్నం, కలెక్టర్, సిపి**

సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి, సిపి అనురాధలు పూలమాల చల్లి నివాళులు అర్పించారు. అదేవిధంగా ముస్తాబాద్ చౌరస్తాలోని జయశంకర్ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, సిపి అనురాధ. అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్,అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కేడం లింగ మూర్తి , ఆర్‌డిఒ సదానందం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విత్తన కల్తీలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు



జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని వందన, శైల సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సోమవారం రోజున జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్ తనిఖి చేశారు. అనంతరం సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలోని పలు రిజిష్టర్లలను అనుమతి పత్రాలను, యంత్రాలను విత్తనాలను పరిశీలించారు. విత్తనాలు అక్రమ నిలవలకి అమ్మకాలకి పాటు పడకుండా క్రింది సూచనలు పాటించాలని అన్నారు. దుకాణదారులకి, రైతులకు అమ్ముతున్నటువంటి విత్తనాలలో ఎలాంటి కల్తీలకు పాటు పడవద్దని, ఎం.ఆర్.పి ధరలకు మించి విత్తనాలను అమ్మకూడదని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు సూచించారు. వారి వెంట జగిత్యాల వ్యవసాయ డివిజనల్ అధికారి తిరుపతి నాయక్, జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయ అధికారి బి.వినీల,సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సాధనకు పోరాడిన సిపిఐ



**ప్రజాపక్షం/చిగురుమామిడి:**ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధనలో సిపిఐ నిరంతర పోరాటం నిర్వహించిందని, ఆ పోరాట ఉధృతం ఢిల్లీ పీఠాన్ని తాకిందని భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, సిపిఐ మండల శాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని చిగురుమామిడి మండల కేంద్రంలోని అమరజీవి కామ్రేడ్ ముసుగు రాజిరెడ్డి మార్గ భవనంలో సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు హైదరాబాద్ సంస్థానంగా నైజాములు పరిపాలిస్తున్న సమయంలో వారికి వ్యతిరేకంగా సిపిఐ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాన్ని జరిపిందని చెప్పారు. సకలజనుల సమ్మెతో 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిందన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రజలు ఊహించిన అభివృద్ధి జరగలేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కొత్త రాష్ట్రంలో అనేక అప్పులు పెరిగిపోయాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు ప్రజల అవసరాలను గుర్తించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకుని విద్య ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, మావురపు రాజ, మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్, గ్రామ శాఖ కార్యదర్శిలు అల్లపు జంపయ్య, కనకయ్య, తిరుపతి, ఎండి ఉస్మాన్ పాషా, మండల కౌన్సిల్ సభ్యులు బందెల శ్రీనివాస్, నాయకులు బింగి స్వామి, శ్రీనివాస్, రాములు, ఐలయ్య, అంతె సంపత్, రాములు తదితరులున్నారు.

## త్వరలో నామినేటేడ్ పదవులు భర్తీ: పొన్నం



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీకోసం కష్టపడిన కార్యకర్తను, నాయకులను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ త్వరలోనే సిద్దిపేట నియోజక వర్గంలో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఆధైర్య పడవద్దని మీకు అండగా కాంగ్రెస్ ఎప్పటికి అందుబాటులో ఉంటుందన్నారు.

**కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ**

సిద్దిపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజక వర్గం ఇంచార్జీ హరికృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నియోజక వర్గం ఇంచార్జి హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్రం అందించిన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.ఈకార్యక్రమంలో నియోజక వర్గం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితులతో కోడెలు మృత్యువాత

గోశాలలో ప్రస్తుతం 16 పశువులకు అనారోగ్యం

తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలకు హెల్త్ బులెటిన్

విడుదల చేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



**ప్రజా పక్షం/ వేములవాడ:** తిప్పాపూర్ లోనే గోశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న మరో 3 పశువులు మరణించాయని, 6 పశువుల పరిస్థితి విషమంగా ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాలు అనారోగ్య పరిస్థితుల కారణంగా తిప్పాపూర్‌లోని గోశాలలో మొదట 8 కోడెలు మరణించగా జిల్లా యం త్రాంగం వెంటనే అప్రమత్తమై 5 వెటర్నరీ డాక్టర్లతో కూడిన 12 మంది వైద్య బృందం ఏర్పాటు చేసి గోశాలలోని పశువులను పరిశీలించడం జరిగింది. రెండవ రోజు అనారోగ్య కారణంతో మరో 5 కోడెలు మరణించాయి. అనారోగ్యం పాలైన 20 పశువులను ప్రత్యేకంగా చికిత్స అందించి వాటిలో 16 పశువుల ప్రాణాలు రక్షించామని, రెండవ రోజు మరో 4 కోడెలు మరణించాయని అన్నారు. ఆదివారం సాయంత్రం నుండి సోమవారం వరకు మరో 3 కోడెలు మరణించాయని, గోశాలలో ఉన్న 1300 పశువులలో మరో 4 పశువులు అనారోగ్యం పాలయ్యాయని, ప్రస్తుతం మొత్తం 16 పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయని, వీటిలో 6 పశువుల పరిస్థితి విషమంగా ఉందని, వీటిని బ్రతికించేందుకు వెటర్నరీ డాక్టర్లు తీవ్రంగా కృషి చేస్తున్నారని, అవసరమైన ఫ్లుయిడ్స్, మందులు అందిస్తున్నారని, వైద్యులు అందించే చికిత్సకు ఆ పశువుల స్పందించడం లేదని తెలిపారు. గోశాలలో మొత్తం 20 కోడెలు అనారోగ్య పరిస్థితులతో మరణించాయని, ప్రస్తుతం 16 పశువుల అనారోగ్యంతో ఉన్నాయని, 5 వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తున్నారని , మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను రాజన్న స్వామి భక్తులు నమ్మవద్దని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆపకుండా పేర్కొన్నారు.

## వేములవాడలో సిపిఐ పట్టణ, రూరల్ మండల మహాసభలు

నూతన కమిటీల ఎన్నిక

ప్రజాపోరాటాలకు సిపిఐ సిద్ధం




**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణ, రూరల్ మండల సిపిఐ మహాసభలు గుమ్మి పుల్లయ్య భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్జి వేణు, సీనియర్ నాయకులు మంత్రి చంద్రయ్య హాజరయ్యారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను సిపిఐ సీనియర్ నాయకురాలు కె.వి. అనసూయ ఆవిష్కరించగా, పార్టీ జెండాను వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు ఆవిష్కరించారు. మహాసభల అధ్యక్షతను కె.వి.అనసూయ, కోకాపెల్లి శాంత, పండుగ పోచమల్లు నిర్వహించారు. అనంతరం వేములవాడ పట్టణ సిపిఐ కమిటీ ఎన్నికలు నిర్వహించగా, ఎల్ల దేవరాజును పట్టణ కార్యదర్శిగా, కోకాపెల్లి శాంతను సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులుగా కడారి రాములు, కె.వి.అనసూయ, గాజుల పోశెట్టి, కుమ్మరి చినకొంరయ్య, కోరేపు శ్రీను ఎంపికయ్యారు. వేములవాడ రూరల్ మండల కమిటీ ఎన్నికల్లో శ్రీరాముల నర్సయ్యను కార్యదర్శిగా, పండుగ పోచమల్లును సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పండుగ చంద్రయ్య, పండుగ అంజయ్య, మెతుకు లచ్చన్న ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ – “ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర బిజెపి ప్రభుత్వం ‘ఆపరేషన్ కగార్’ పేరుతో మారణహోమం సృష్టిస్తోంది. శాంతి చర్చలకు ఆసక్తి చూపించినవారిని చంపడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహసించడమే,” అన్నారు. బడా కంపెనీలకు సహజవనరులను దారాదత్తం చేసేందుకు కేంద్రం దమనకాండకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. సిపిఐ కొత్త కమిటీ ప్రజాపోరాటాలకు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా భూమిలేని దళితులకు భూముల పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాస్థాయిలో మహాసభలు జూన్ 13,14 తేదీలలో సిరిసిల్ల లహరి ఫంక్షన్ హాల్లో జరగనున్నాయని తెలిపారు. రాష్ట్ర మహాసభలు ఆగస్ట్ 1922 మధ్య మేడ్చల్‌లో, జాతీయ మహాసభలు పంజాబ్‌లోని చండీగఢ్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో దుండ్రపెల్లి రవీందర్, తదితర 50 మంది వరకుసిపిఐ ప్రముఖులు పాల్గొన్నారు.

## క్రీడ

## నేడు ఐపిఎల్ ఫైనల్స్

ఐపిఎల్ ఫైనల్‌కు వానగండం..!
మళ్లీ ఆ సీన్ రిపీట్ అవుతుందా..?
అదే జరిగితే ఆర్‌సిబికి టైటిల్ ఛాన్స్ లేనట్లే..!

# గెలిచేదెవరు?



ఐపిఎల్ 2025 సీజన్ ముగింపు దశకు చేరింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగే ఫైనల్‌తో ముగియనున్నది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు ఇప్పటి వరకు టైటిల్‌ను గెలువని విషయం తెలిసిందే. రెండు జట్లలో ఏదో ఒక జట్టు తొలిసారి చాంపియన్‌గా నిలువబోతున్నది. పంజాబ్, ఆర్‌సీబీ గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరి.. ఫైనల్‌లో తలపడబోతున్నాయి. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆర్‌సీబీ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు అద్భుత ప్రదర్శన చేసి గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచాయి. గ్రూప్ దశను ముగిసే సరికి పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉండగా.. ఆర్‌సీబీ రెండోస్థానంలో నిలిచింది. ఆర్‌సీబీపంజాబ్ జట్లు 2021లో అహ్మదాబాద్‌తో ఓ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిచింది. అయితే, క్వాలిఫయర్1 మ్యాచ్‌లో పంజాబ్‌ను ఆర్‌సీబీ ఓడించి ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయర్2 మ్యాచ్‌లో ముంబయిపై విజయంతో పంజాబ్ ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ జరుగున్నది. పంజాబ్‌ముంబయి మధ్య ఆదివారం జరిగిన క్వాలిఫయర్2 మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. వర్షం కారణంగా మ్యాచ్ 2.15 గంటలు ఆలస్యంగా మొదలైంది. అదనపు సమయం కేటాయించడంతో పూర్తిస్థాయిలో మ్యాచ్‌ని నిర్వహించారు. అయితే, ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగిస్తుందా? అని అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణశాఖ నివేదిక ప్రకారం.. ఫైనల్ రోజున అహ్మదాబాద్‌లో వర్షం కురిసేందుకు అవకాశాలున్నాయి. వర్షం కురవడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 2023 సీజన్ ఫైనల్ మ్యాచ్ సైతం అహ్మదాబాద్‌లోనే జరిగింది. ఆ సమయంలోనూ ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిఇంచింది. ఆ సీజన్‌లో ఫైనల్ మ్యాచ్ మే 28న జరగ్గా.. వర్షం కారణంగా ఒక్క బంతి వేయడం కూడా సాధ్యపడలేదు. టైటిల్ మ్యాచ్ కోసం రిజర్వ్ డే ఉండడంతో ఫైనల్‌ను మరుసటి రోజున నిర్వహించారు. రిజర్వ్ డే రోజున సైతం వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దాంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ ఫైనల్ జూన్ 3న మంగళవారం జరుగనున్నది. వర్షం అంతరాయం కలిగిస్తే.. మళ్లీ బుధవారం నిర్వహించనున్నారు. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బిసిసిఐ ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ సమయం పెంచిం ది. మ్యాచ్‌ను పూర్తి చేసేందుకు బిసిసిఐ అదనంగా రెండు గంటల సమయం కేటాయించింది. ఈ మేరకు మ్యాచ్ రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైతే ఓవర్లు కుదించకుండానే మ్యాచ్ జరుగుతుంది. ఐదు ఓవర్ల మ్యాచ్‌కు కటాఫ్ సమయం రాత్రి 11.56 గంటలు కాగా.. ఆ సమయానికి కూడా మ్యాచ్ జరుగక పోతే మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంటుంది. రిజర్వ్ డే రోజున మ్యాచ్ పూర్తి స్థాయిలో నిర్వహించడం సాధ్యం కాక పోతే రెండు జట్లు సూపర్ ఓవర్ ఆడిస్తారు. సూపర్ ఓవర్ అత్యధిక పరుగులు చేసిన జట్టు చాంపియన్‌గా నిలుస్తుంది. ఈ సూపర్ ఓవర్‌కు సైతం అదనంగా 20 నిమిషాల సమయాన్ని అదనంగా కేటాయించింది. అంటే సూపర్ ఓవర్ రాత్రి 12.30 గంటలకు సైతం నిర్వహించేందుకు అవకాశం ఉంది. అప్పటి వరకు కూడా సూపర్ ఓవర్ నిర్వహించడం సాధ్యం కాకపోతే ఫైనల్ మ్యాచ్ రద్దవుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ విజేతగా నిలుస్తుంది.

### ఫైనల్‌లో ఎవరు గెలిచినా.. కొత్త ఛాంపియనే

మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పంజాబ్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. ఇందులో ఎవరు గెలిచినా కొత్త ఛాంపియన్ వచ్చినట్టే. ఇప్పటి వరకు పంజాబ్, బెంగళూరు ఒక్క సారి కూడా టైటిల్‌ను నెగ్గలేదు.

### ఫైనల్‌కు పంజాబ్

పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో క్వాలిఫయర్‌లో ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన పంజాబ్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 203/6 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పంజాబ్ ఐదు వికెట్ల నష్టానికి 19 ఓవర్లలో 207 పరుగులు చేసి విజయం సాధించింది. పంజాబ్ సారథి శ్రేయస్ అయ్యర్ (87*) దంచికొట్టాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో తన జట్టును ఫైనల్‌కు చేర్చాడు. నేహల్ వధేరా (48: 29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (38: 21 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పంజాబ్ టైటిల్ కోసం తలపడనుంది. ముంబయి బౌలర్లలో అశ్వని కుమార్ 2, ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ తీశారు. 2014 తర్వాత పంజాబ్ జట్టు ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. మొత్తంగా ఇది రెండోసారి.



తొలుత సూర్యకుమార్ యాదవ్ (44: 26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (44: 29 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెయిర్ స్టో (38: 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) నమన్ ధీర్ (37: 18 బంతుల్లో 7 ఫోర్లు రాణించడంతో ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో ఒమర్జాయ్ 2, జెమీసన్, స్టాయినిస్, చాహల్, వైశాక్ ఒక్కో వికెట్ తీశారు.



## షష్టి పూర్తి సక్సెస్ మీట్

రాజేంద్రప్రసాద్, అర్చన భార్య భర్తలుగా నటించిన తాజా చిత్రం షష్టి పూర్తి. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్‌లలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. రూపేష్, ఆకాంక్ష హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు పవన్ ప్రభా దర్శకుడు. ఈ మధ్యకాలంలో ఫ్యామిలీతో థియేటర్‌కు వెళ్లి చూసే సినిమాలు తక్కువగా వస్తున్నాయని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ సినిమాను ఇంటిల్లీపాది కూర్చుని హాయిగా నవ్వుతూ చూడొచ్చున్నారు. ఇలాంటి మంచి పాత్రలు వచ్చినప్పుడు చేయడానికి తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని చెప్పారు. ఈ సక్సెస్ మీట్‌లో పలువురు నటీ నటులు, గేయ రచయిత చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.



## తొలిప్రేమేం తోపు కాదు

### కిరణ్ అబ్బవరం

తొలి ప్రేమేం తోపు కాదు. అంటూ గ్లింప్స్ ను చిత్రం యూనిట్ విడుదల చేసింది. చెన్నై లవ్ స్టోరీ పేరుతో వస్తున్న ఈ సినిమాకు మణి శర్మ సంగీతం అందించారు. క సినిమా నటుడు కిరణ్ అబ్బవరం గౌరీప్రియ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సాయి రాజేష్ దర్శకత్వం వహి స్తున్నారు.

## రీల్

## ముస్తాబవుతున్న కన్నప్ప




మంచు విష్ణు పాటిల్ రోల్ పోషించిన సినిమా కన్నప్ప. ఇటీవల దొంగ తనమై పోయిన సినిమా హార్డ్ డిస్క్ దొరికింది. దీంతో సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నారు. మరో ఇరవై అయిదు రోజుల్లో కన్నప్పను థియేటర్‌లోకి తీసుకువస్తామని హీరో, నిర్మాత మంచు విష్ణు బాబు తెలిపారు. ఇందులో హీరో ప్రభాస్ ఓ కిలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇతర పాత్రల్లో మంచు మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, ప్రీతీ ముఖుందన్ నటించిన ఈ సినిమాకు స్టీఫెన్ సంగీతం అందించగా, ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.

## కుబేర ఆడియో వేడుక

తమిళ నటుడు ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'కుబేరా'. అక్కినేని నాగార్జున ముఖ్య పాత్రల్లో కనిపిస్తున్నారు. ధనుష్ సరసన రష్మిక మందాన హీరోయిన్‌గా నటిస్తుంది. అమిగోష్ క్రియేషన్స్ బ్యానర్‌పై సునీల్ నారంగ్ , పుష్కర్ రామ్మోహన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుక చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. తెలుగు, తమిళ, హింది భాషల్లో ఒకేసారి ఈనెల 20న సినిమాను విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.



## వీరమల్లుకు టికెట్ ధరలు పెంచండి

### ఫిలిం ఛాంబర్‌కు ఏఎం రత్నం వినతి



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన సినిమా హరిహర వీరమల్లు ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. ఈనెల 12వ తేదిన హరిహర వీరమల్లు సినిమాను థియేటర్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈమేరకు సోమవారం తెలుగు ఫీలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ను కలిసిన హరిహర వీరమల్లు నిర్మాత ఏ ఎం రత్నం ఛాంబర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 12వ విడుదల అవుతున్న సినిమాకు ఆంధ్ర ప్రదేశ్‌లో టికెట్ రేట్లు పెంచుకునే వెసులుబాటు కల్పించారని కోరారు. ఏపి ప్రభుత్వం దృష్టికి కూడా టికెట్ ధరలు పెంచుకునే అవకాశం ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈచిత్రానికి జ్యోతి క్రిష్ణ దర్శకత్వం వహించగా , ఎం ఎం కీరవాణి సంగీతం అందించారు.

## డల్లాస్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ సంబురాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: స్వతంత్ర భారతదేశ చరిత్రలో మోస్ట్ సక్సెస్ ఫుల్ స్టార్టప్ స్టేట్‌గా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని, ఇంత అమోఘమైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రం దేశంలోనే మరొకటి లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో బిఆర్‌ఎస్ నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సభ, పార్టీ రజతోత్స సంబురాల కార్యక్రమంలో కెటిఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ ధూం ధాం'తో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి గోరేటి వెంకన్న, మాజీ ఎంఎల్‌ఎ రసమయి బాలకిషన్, గాయని మధుప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, కానీ జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్ఆర్ఐలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టమని విజ్ఞప్తి చేశారు. సంకల్పం, పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తెలంగాణ రాష్ట్రం దేశానికి చాటిచెప్పిందన్నారు.

## 'రెవెన్యూ' (మొదటి పేజీ తరువాయి)

కోరిన విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఏప్రిల్ 14వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. మొదటి దశలో నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, ఆ తర్వాత మే 5వ తేదీ నుంచి 28 వరకు జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం సోమవారం నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా భూ భారతి చట్టంలో భాగంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు వారి ప్రమేయం లేకుండానే భూ సమస్యల్లో చిక్కుకున్నారని, వాటి పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉండేదని, ఏ సమస్యకైనా కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అధికారులు వారి వద్దకే వెళ్లి, ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగానే భూ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. మొదటి దశలో 72 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల్లో 13 వేలకు పైగా దరఖాస్తులు, రెండో విడతలో 28 మండలలో 421 రెవెన్యూ గ్రామాలల్లో నిర్వహించిన సదస్సుల్లో 42 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఇప్పటి వరకు 60 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించామని మంత్రి పొంగులేటి వివరించారు. సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, దీనికి త్వరలో పరిష్కారం చూపిస్తామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామ స్థాయిలో అందించేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకెళ్తుందన్నారు.

**మానవీయ కోణంలో సమస్యలను పరిష్కరించండి :** జిల్లా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. భూభారతి చట్టంలో భా గంగా గ్రామ పరిపాలన అధికారులను(జిపిఓ) అతిత్వరలో నియామక పత్రాలను అందజేసి, మండలాల్లో నియమించబోతున్నామన్నారు. గ్రామపాలన అధికారుల 10,954 పోస్టుల భర్తీకి జిఒ విడుదల చేయగా 5వేలకు పైగా దరఖాస్తులు అందాయని, తుదిమెరిట్ జాబితాలో 3,550 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు. సర్వే సెటిల్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని, మొదటి దశలో ఆరువేల మంది సర్వేయర్లను రెండు నెలల్లో నియమించబోతున్నామని, తరతరాలుగా నక్షా లేని 413 గ్రామాలలో పునఃసర్వే నిర్వహించబోతున్నామని వివరించారు. అలాగే టిజిఆర్ఏసి (టిజిఆర్ఏసి తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టామని, దీనికి సంబంధించి 3 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి అన్నారు.

## పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం

### మహిళా కాంగ్రెస్ సమావేశం టిపిసిసి మహేష్‌కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ నేత హరీష్‌రావు, బిజెపి నేత ఈటల రాజేందర్ భేటీపై పక్కా సమాచారం తమ వద్ద ఉందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనపై బహిరంగ చర్చకు వస్తామని, హరీష్‌రావుతో ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. కంచె చేను మేసినట్లు బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వ ఆస్తులు నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్, బిజెపి పొత్తుపై కవిత వ్యాఖ్యలకు ముందు సమాధానం చెప్పాలన్నారు. నాలుగు ముక్కలాటలో ఏ పార్టీ నుంచి హరీష్‌రావు పోటీ చేస్తారని, హరీష్‌రావుకు బి ఫామ్ వస్తుందా అని ప్రశ్నించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిరాన్నోత్సవంలో ఆయన మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, సీనియర్ మహిళా కార్యకర్తలకు పార్టీలో తప్పకుండా చోటు కల్పిస్తామన్నారు. మహిళ కార్యకర్తలకు పదవుల విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. రాజకీయాల్లో ఓపిక, కచ్చితత్వం ఉండాలని, క్రమశిక్షణ చర్యలు తప్పితే ఎంతటి వారైనా సరే వేటు తప్పదని ఆయన హెచ్చరించారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com